పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్

6

# సామాజిక తరగతులు

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

## పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 6

# ముందుమాట

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఎడ్యుకేషన్ సబ్ కమిటీ అక్టోబరు 2022లో ఉపాధ్యాయ శిక్షణ పాఠశాల నిర్వహించింది. శిక్షణలో పాల్గొన్న వారితో చర్చించి వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాత ఈ పాఠశాలలో పంచబడిన నోట్సును ఖరారు చెయ్యడం జరిగింది. అవసరమైన మార్పులు చేసిన తర్వాత ఈ నోట్సును మేము ప్రచురిస్తున్నాము.

సామాజిక సమూహాలు అనే విషయంలో మూడు ఉప విషయాలున్నాయి: అస్తిత్వ రాజకీయాలు, సామాజిక సమస్యలు : మతం, కులం, జెండర్, హిందుత్వ మతోన్మాదం, స్త్రీల సమస్యల పట్లా, జెండర్ పట్లా పార్టీ దృష్టి కోణం. వీటిని కలిపి కానీ, విడి విడిగా కానీ, అన్ని స్థాయిలలోనూ రాజకీయ బోధనకు ఉపయోగించవచ్చు.

ఈ విషయాన్ని బోధించేవారూ, ఇతరులూ ఈ విషయాలను అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని మేము ఆశిస్తున్నాము.

**పార్టీ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ,**
**కేంద్ర కమిటీ, సిపిఐ(ఎం)**

**ఫిబ్రవరి 2023**

# అస్తిత్వ రాజకీయాలు, సామాజిక సమస్యలు: మతం, కులం, జెండర్

**'అ**స్తిత్వ రాజకీయాలు' భారతదేశంలో అభివృద్ధి చెందిన నిర్దిష్ట అనుభవం మీద ఆధారపడి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వివిధ డాక్యుమెంట్లలో తన విధానాన్ని వివరించింది. 'అస్తిత్వ రాజకీయాల' గురించి ఒక సాధారణ మార్క్సిస్టు అవగాహన ముఖ్యమే అయినా, సమకాలీన రాజకీయ పరిణామాలలో అస్తిత్వ రాజకీయాలు ప్రతిఫలిస్తున్న సందర్భాన్ని చూడడం కూడా అవసరం. రాజ్య యంత్రాంగాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటూ 2014లో బిజెపి–ఆరెస్సెస్‌లు అధికారం లోకి వచ్చిన తర్వాత, దేశం మీద రుద్దబడుతున్న ఆధిపత్య భావజాలం లోపల – అంటే హిందుత్వ భావజాలం లోపల – అస్తిత్వ రాజకీయాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయి? అన్నది మనం అర్థం చేసుకోవాలి. ఇది ఈ ధోరణిని విశ్లేషించి అవగాహన చేసుకునే ప్రశ్న మాత్రమే కాదు. మన ప్రతిఘటన వ్యూహాలను మెరుగుపరచుకోవడానికీ, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు పెట్టడానికీ, హిందుత్వ, అస్తిత్వ భావజాలాల మధ్య సహకారాలనూ, సంఘర్షణలనూ మనం అర్థం చేసుకోవాలి.

ఈ పత్రం మూడు భాగాలుగా ఉంది – 1) అస్తిత్వ రాజకీయాల నిర్వచనాలు, వ్యక్తీకరణలు 2) హిందుత్వ, అస్తిత్వ రాజకీయాలు 3) ఈ సమస్యల పట్ల వామపక్ష రాజకీయ వ్యూహం.

**భాగం 1 : నిర్వచనాలు**

'2012లో, 20వ పార్టీ కాంగ్రెసులో అస్తిత్వ రాజకీయాల గురించిన రాజకీయ తీర్మానం ఈ విధంగా ప్రకటించింది: 'కులం, మతం, ప్రాంతం, తెగ, జాతుల మీద ఆధారపడిన అస్తిత్వ రాజకీయాల పెరుగుదల దేశంలో వామపక్ష రాజకీయాలకు ఒక పెద్ద సవాలుగా మారింది. పాలక వర్గాలూ, సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడీ అటువంటి రాజకీయాలను తమ ప్రయోజనాలకు ఎంతో అనువైనవిగా

భావిస్తున్నాయి. అస్తిత్వం పునాదిగా ప్రజలు ముక్కచెక్కలవడమూ, అస్తిత్వ రాజకీయాల ద్వారా ప్రజలను విభజించడమూ, ఒకరి నుండి ఒకరిని వేరు చెయ్యడమూ, రాజ్యానికీ, పెట్టుబడి నిర్వహణకూ ఏ ప్రమాదం లేకుండా చేస్తుంది.

"సామాజిక అణచివేతకూ, వివక్షకూ, దోపిడీకీ గురవుతూ బాధపడుతున్న సమూహాలలోనూ, కమ్యూనిటీలలోనూ అస్తిత్వ రాజకీయాలకు సారవంతమైన భూమి లభిస్తుంది. భారతదేశంలో కుల, తెగ లేదా జెండర్ అణచివేతకు గురవుతున్న ప్రజా విభాగాలను అస్తిత్వ రాజకీయాలు సమీకరిస్తున్నాయి. వర్గ సంఘీభావాన్నీ, వర్గ ఆధారిత ఉద్యమాలనూ తుడిచి పెట్టేసే లక్ష్యంతో కొన్ని ఎన్జీవోలూ, సంకుచిత ప్రాంతీయ గ్రూపులూ అస్తిత్వం మీద ఆధారపడిన అటువంటి రాజకీయాలకు నిధులు సమకూరుస్తున్నాయి.

"వర్గ ఆధారిత ఉమ్మడి ఉద్యమాల నిర్మాణం ద్వారా సిపియం అస్తిత్వ రాజకీయాలను ఎదుర్కోవాలి. అదే సమయంలో సమాజంలోని వివిధ విభాగాలు అనుభవిస్తున్న కుల, సామాజిక, జెండర్ అణచివేతల సమస్యలను చేపట్టాలి."

**'అస్తిత్వ రాజకీయాలు' అంటే ఏమిటి?**

1. అస్తిత్వ రాజకీయాలకు మూలాలు మార్క్సిజానికి ప్రత్యామ్నాయంగా చెప్పబడే ఆధునికానంతరవాదం లాంటి బూర్జువా సిద్ధాంతాలలో ఉన్నాయి. రాజకీయాలకూ, భౌతిక పరిస్థితులకూ మధ్య ఎటువంటి సంబంధమూ లేదని ఈ రాజకీయాలు చెబుతాయి. మానవ సమాజాన్ని, భౌతిక పరిస్థితులతో సంబంధంలేని అనేక అణచివేతలూ, వైరుధ్యాలతో కూడిన సమాజంగా ఈ రాజకీయాలు వర్ణిస్తాయి. జెండర్, జాతి (ethnicity), మతం, తెగ, సెక్సువాలిటీకి సంబంధించిన అణచివేతలను వ్యక్తులు వ్యక్తిగతంగా అనుభవిస్తారు. ఒక వ్యక్తి అనుభవిస్తున్న అణచివేత పునాదిగా అస్తిత్వం ఏర్పడుతుంది. ఇది పూర్తిగా వ్యక్తిగతమైనది, స్వయం ప్రతిపత్తి కలది. దోపిడీ అనేది ఒక వస్తుగత దృగ్విషయమనీ, దోపిడీ గురించిన చైతన్యం వ్యక్తి చైతన్యం మీద ఆధారపడిన ఆత్మాశ్రయమనీ మార్క్సిజం చెబుతుంది. దీనికి విరుద్ధంగా అస్తిత్వ రాజకీయాలు అణచివేత అన్నదే ఒక ఆత్మాశ్రయ లక్షణమనీ, ఈ లక్షణం అణచివేతను అనుభవిస్తున్న వ్యక్తి మీద ఆధారపడి ఉంటుందనీ చెబుతుంది.
2. ప్రపంచీకరణ చెందిన ప్రపంచంలో స్పష్టంగా విరుద్ధంగా ఉండే సామాజిక ప్రయోజనాలు (కార్మికుల, పెట్టుబడిదారుల ప్రయోజనాలు లాంటివి)

ఇంకేమాత్రం లేవని ఈ సిద్ధాంతం చెబుతుంది. ఒక నిర్దిష్ట సమాజంలో వర్గ విభజనల మీద ఆధారపడిన ఏ విశ్లేషణనైనా ఇది తిరస్కరిస్తుంది. అస్తిత్వ రాజకీయాల ప్రకారం సమాజంలో ప్రధాన విభజన అణచివేతను అనుభవిస్తున్న వ్యక్తికీ, అణచివేతను అనుభవించని ఇతరులందరికీ మధ్య ఉంటుంది. ఈ రకమైన రాజకీయాల సారాంశం 'ఇతరానికి' వ్యతిరేకంగా 'తేడా' అనే భావన మీద ఆధారపడి ఉంటుంది. అంటే అణచివేతను అనుభవించని అందరికీ ప్రత్యేక అణచివేతకు గురవుతున్న వ్యక్తి 'భిన్నం'గా ఉంటాడు. ఉదాహరణకు అస్తిత్వ రాజకీయాల సిద్ధాంతం ప్రకారం జాతి వివక్షకు గురవుతున్న ఒక నల్ల కార్మికుడు, కార్మికులతో సహా నల్లవారు కాని ఇతరులందరి కంటే 'భిన్నం'గా ఉంటాడు. నల్లవారు కాని కారణంగా కార్మికులందరినీ విరోధులుగా పరిగణించడం జరుగుతుంది. కానీ, ఈ అస్తిత్వ అవగాహనలో కార్మికుడి అస్తిత్వాన్ని విస్మరించడం జరిగింది.

ఈ సిద్ధాంతాల ప్రకారం కార్మికుడు కూడా సమాజంలో ప్రబలంగా ఉన్న పితృస్వామ్యం లేదా జాతి వివక్ష లాంటి అణచివేత కట్టుబాట్లకే ప్రాతినిధ్యం వహిస్తాడు. అందువలన ఉనికిలో ఉన్న అణచివేతను అతను పునరుత్పత్తి చేస్తాడు. అస్తిత్వవాదులు వర్గ రాజకీయాలను కార్మిక కేంద్ర సిద్ధాంతాలుగా విమర్శించి, 'వర్కరిజం' అంటూ ఆక్షేపిస్తారు.

3. ప్రత్యక్షంగా ఒక ప్రత్యేక అణచివేతను అనుభవించేవారు మాత్రమే ఆ అణచివేతను నిర్వచించగలరనీ, దానికి వ్యతిరేకంగా పోరాడగలరనీ అస్తిత్వ రాజకీయ సిద్ధాంతం చెబుతుంది. ఆ విధంగా సంకుచిత అస్తిత్వాల మీద ఆధారపడి, ఒకదానితో మరొకటి సంఘర్షించే ముక్కచెక్కలైన ఉద్యమాలనూ, స్వభావరీత్యా చాలా ప్రత్యేకంగా ఉండే ఉద్యమాలను అది ప్రతిపాదిస్తుంది. మహా అయితే, ఒక నిర్దిష్ట అస్తిత్వ సమూహం ఆ నిర్దిష్ట సమూహానికి ఉన్నతమైన హోదా కోసం ఉద్యమాలను ప్రారంభించగలదు.
4. రాజ్యం తటస్థంగా ఉంటుందనీ, స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటుందనీ అస్తిత్వ రాజకీయం చెబుతుంది. మరోమాటలో చెప్పాలంటే, దోపిడీ, అణచివేతల పెట్టుబడిదారీ సమాజంలో నిర్దిష్ట వర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యాన్ని అస్తిత్వ రాజకీయాల సిద్ధాంతాలు మౌలికమైన రీతిలో కాపాడుతాయి.

**దీనర్థం ఒక ప్రత్యేక అస్తిత్వంతో ఏ రకమైన అనుబంధమైనా ప్రజాస్వామ్య వ్యతిరేకమైనదీ, అభివృద్ధి నిరోధకమైనదీ అనా?**

దోపిడీకి, అణచివేతకూ గురవుతున్న ప్రజలు తమంతట తామే తమ లేమికి

కారణాలను ఏ మేరకు అర్థం చేసుకోగలుగుతున్నారు అన్న దాని మీదా, తమ హక్కుల కోసం నడుం కట్టడం మీదా, పోరాటాల మీదా, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జరిగే విప్లవోద్యమాల విజయం ఆధారపడి ఉంటుందని మార్క్సిస్టు సిద్ధాంతమూ, ఆచరణా గుర్తిస్తాయి. ఒక కార్మికుడిగా కార్మికుడి వర్గ చైతన్య అస్తిత్వాన్ని మార్క్సిజం ప్రోత్సహిస్తుంది. నల్లజాతికి చెందిన కార్మికుడు కానీ, స్త్రీ కానీ జాతి వివక్షను అనుభవించడమూ, నల్లజాతికి చెందిన వ్యక్తులుగా వారి అస్తిత్వం నల్లజాతికి చెందని వ్యక్తుల కంటే మరింత ఎక్కువగా ఉండడమూ సహజమే. మన దేశంలో సామాజిక అణచివేత గురవుతున్న దళితులు లేదా ఆదివాసీలు లేదా స్త్రీలూ, తమ అణచివేత యొక్క ప్రత్యేక పార్శ్వమైన వివక్షను ఎంతో ప్రత్యక్షంగా అనుభవిస్తారు. ఆ అణచివేతను ఎత్తిచూపే సమూహ అస్తిత్వంతో అనుబంధం నిశ్చయంగా వ్యక్తిత్వాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ ఇస్తుంది. నిర్దిష్ట సమస్యలను ఎత్తిచూపడానికి ఉపయోగపడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో భిన్న సామాజిక తరగతులు నిర్దిష్ట అణచివేతలను అనుభవిస్తున్న చోట ఈ అస్తిత్వాలు ఉండి తీరుతాయి. మార్క్సిస్టులు ఆ అణచివేత వాస్తవమని గుర్తించడం మాత్రమే కాదు, ఆ సమస్యను ఎదుర్కొని పోరాడడానికి వ్యూహాలనూ కనుగొంటారు.

అణచివేతకు గురవుతున్న కులం, జెండర్ లేదా మత మైనారిటీకి చెందినవాడుగా ఒక ప్రత్యేక అస్తిత్వంతో అనుబంధం కలిగి ఉండడాన్ని మనం ప్రశ్నించం. ఆ అస్తిత్వాన్నీ, ఆ అస్తిత్వ నిర్మాణాన్నీ సామాజికార్థిక సందర్భాన్నుంచీ, దోపిడీ, అణచివేతా ఉనికిలో ఉండడానికి గల వస్తుగత కారణాలనుండీ వేరు చేసి తప్పుదారి పట్టించినప్పుడు, ఎవరు లాభపడతారు అన్నది ప్రశ్న. ఇతరులందరినీ 'బయటివారుగా' పరిగణించినప్పుడు అస్తిత్వ రాజకీయాలలో సెక్సిజంను అనుభవిస్తున్న స్త్రీలకు మగవాళ్ళందరూ బయటివారు, కుల వివక్షకు గురవుతున్న దళితులకు దళితేతరులందరూ 'బయటివారు', జాతి వివక్షకు గురవుతున్న నల్లవారికి నల్లజాతికి చెందనివారందరూ 'బయటివారు' ఈ విధంగా ఉంటే ఎవరు లాభపడతారు? ప్రత్యేక అస్తిత్వాల పేరుతో అణచివేతకు గురవుతున్న భిన్న విభాగాలను విడదీసి, విభజించే అటువంటి రాజకీయాలు ఉనికిలో ఉన్న దోపిడీ, అణచివేతలను మరింత బలపరుస్తాయి కానీ నిర్దిష్ట వివక్షకు మూల కారణాలైన మౌలిక వ్యవస్థలను తాకకుండా చెక్కుచెదరకుండా ఉంచుతాయి.

వివక్షకు గురవుతున్న తరగతుల కొన్ని సమస్యలను అస్తిత్వ రాజకీయాలు ఎత్తిచూపగలవు, కొంత ఉపశమనాన్ని తీసుకురాగలవు. వనరులలో వాటా కోసం కానీ, లేదా తమ వ్యక్తిగత హోదాలో మార్పు కోసం కానీ, ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి పరిమిత తరగతుల మధ్య పోటీకి కానీ, లేదా పరిమితమైన

సహకారానికి కానీ దారి తీసే విధంగా రాజకీయాలను నిర్వహించడానికి అస్తిత్వ రాజకీయాలు అనువైనవి. సామాజిక మార్పు ఒక లక్ష్యం కానందున, అస్తిత్వ రాజకీయాల వలన వ్యవస్థకు ఎటువంటి ప్రమాదమూ తలెత్తదు.

**సామ్రాజ్యవాద శక్తుల ప్రోత్సాహంతో**

సోవియట్ యూనియనూ, తూర్పు యూరోపులోని సోషలిస్టు దేశాలూ పతనమైన తర్వాతి కాలంలో, కొన్ని సందర్భాలలో అస్తిత్వ రాజకీయాలను సామ్రాజ్యవాద శక్తులు ప్రత్యక్షంగానూ, ఉద్దేశపూర్వకంగాను ప్రోత్సహించాయి. అంతకుముందు, నయా ఉదారవాద విధానాలు అడుగు పెట్టడంతో. 1980ల నుంచీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ లక్ష్యం జాతి రాజ్యాన్ని (nation state) బలహీనపరచి, ఏకరూపమైన విధానాల చట్రంలో బంధించి, ఏ అంతరాయం లేకుండా ద్రవ్య పెట్టుబడి చలించేలా చెయ్యడమూ, అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లను దోచుకోవడమూగా ఉంది. 19వ, 20వ శతాబ్దాలలో జాతివాదమూ, వర్గమూ ప్రధాన సామాజిక విశ్లేషణకూ, ప్రజలను కూడగట్టడానికీ యూనిట్లుగా ఉండేవి. ప్రపంచీకరణ ఈ రెండింటినీ బలహీనపరిచింది. జాతి, మతం మొదలైన వాటి మీద ఆధారపడిన సంకుచిత సమీకరణలు ప్రధాన అంశాలయ్యాయి.

జాతివాద అస్తిత్వ రాజకీయాలూ, సోదరుల మధ్య తగాదాలూ తలెత్తడం, యూగోస్లోవియా ముక్క చెక్కలు కావడానికీ, జాతివాదం (ethnic nationalism) మీద ఆధారపడిన సంఘర్షణలకూ దారి తీసింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలను ముందుకు తీసుకు వెళ్ళడానికి స్లోవేనియా, క్రోయేషియాల సృష్టీ, పశ్చిమ ఆసియాలో బోస్నియాలో, ఆఫ్రికాలో యుద్ధాలూ, యుగోస్లోవియా ముక్కచెక్కలై కొత్త రాజ్యాలు ఏర్పడడమూ అస్తిత్వ రాజకీయాలు ప్రపంచమంతటా వ్యాపించబోయే ముందు ఒక దుశ్శకునంగా కనుపించింది. మాజీ సోవియట్ యూనియన్‌లో వివిధ జాతి సమూహాల మధ్య సంఘర్షణలు తలెత్తాయి. ఈ మార్కెట్లలోకి చొచ్చుకుపోవడానికి ఒక అవకాశాన్ని గమనించి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడీ, యూరోపియన్ పెట్టుబడీ జాతివాద వైరుధ్యాలను మరింత రెచ్చగొట్టాయి. అనేక కొత్త దేశాల ఏర్పాటుతో పాటు మార్కెట్ ఆర్థిక వ్యవస్థలతో కూడిన నయా ఉదారవాద ప్రభుత్వాలూ ఏర్పడ్డాయి.

అనేక అస్తిత్వాలతో ముక్కచెక్కలైన ప్రజలతో వ్యవహరించడం ప్రపంచ వ్యాపిత ద్రవ్య పెట్టుబడికి మరింత సానుకూలంగా ఉంటుంది. మార్కెట్లోకి చొచ్చుకుపోవడమూ, మార్కెట్‌ను తన అధీనంలోకి తీసుకోవడమూ, ద్రవ్య పెట్టుబడికి

మరింత తేలికవుతుంది. వినియోగదారీతత్వమూ, మార్కెట్టూ విభిన్న సమూహాలను పెంచి పోషిస్తాయి. కానీ ఈ సమూహాలు అసంఖ్యాకమైన అస్తిత్వాలతో ముక్కచెక్కలవడం, పెట్టుబడి దోపిడీనీ, మార్కెట్ మీద దాని ప్రాబల్యాన్నీ సవాలు చెయ్యడం కోసం ఐక్యం కాకుండా అడ్డుపడుతుంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో పెట్టుబడిదారీ రాజ్యం పోటీపడే సమూహాలతో వ్యవహరిస్తుంది. ఈ సమూహాలు సామాజిక అదనపు ఉత్పత్తిలోనూ, ఆర్థిక వస్తువుల లోనూ వాటా కోసం పోటీ పడతాయి. సమూహాల మధ్యా, తరగతుల మధ్యా సార్వత్రిక సంఘీభావం కంటే, అనేక (ప్రత్యేక) సమూహాలుండడం పాలక వర్గాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇవి అతివాద రాజకీయాలను అనుసరిస్తూ ఆర్థిక వస్తువులనూ / అదనపు ఉత్పత్తినీ సమానంగా పంచాలని డిమాండు చేస్తాయి.

**భారతదేశంలో**

భారతదేశ సందర్భంలో అస్తిత్వ రాజకీయాలు ఎలా పని చేస్తున్నాయి?

చారిత్రకంగా కులం, మతం, ప్రాంతం, భాష మొదలైన అనేక విభజనలున్న భారత దేశం లాంటి సమాజంలో, వలస పాలన ఈ విభజనలను తీవ్రతరం చేసిన పరిస్థితులలో, అస్తిత్వ రాజకీయాలు మరింత పెద్ద సవాలుగా ఉంటాయి. బ్రిటిష్ పాలకుల ప్రోత్సాహంతోనూ భారత బూర్జువా రాజీ విధానాలతోనూ ఈ విభజనలు రంగంలోకి వచ్చినా, వలస పాలనకు వ్యతిరేకంగా జాతీయవాదం ప్రాతిపాదికగా జరిగిన సమీకరణలో ఇవి ముందుకు రాలేదు. స్వాతంత్ర్యానంతర కాలంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి, ముఖ్యంగా నయా ఉదారవాద చట్రం, మరిన్ని మార్పులను తీసుకు వచ్చి, అస్తిత్వం గురించి సంకుచిత వ్యాఖ్యలు బలపడడానికి పునాదిని తయారు చేశాయి.

**భౌతిక పునాది**

భారతదేశంలోనూ, ప్రపంచమంతటానూ స్త్రీ పురుషులు పని చేసే భౌతిక పరిస్థితులలో నయా ఉదారవాద విధానాలు తీసుకు వచ్చిన మార్పులతో అస్తిత్వ రాజకీయాలకు ఒక అండ లభించింది. అంతకంతకూ పెరుగుతున్న నిరుద్యోగ, లేదా సరియైన ఉద్యోగాలు లేని, యువ సైన్యానికి ఈ విధానాలు జన్మనిచ్చాయి. ఈ యువతలో ఉన్న నిరాశను వివిధ అభివృద్ధి నిరోధక శక్తులు ఉపయోగించుకున్నాయి.

నయా ఉదారవాద పాలనలో, ఉత్పత్తి ప్రక్రియలోనూ, లేబర్ కాంట్రాక్టుల స్వభావంలోనూ కార్మికుల హక్కులకు భంగం కలిగించే మార్పులు సంభవించాయి. ఒక పక్క ఎంతో అభివృద్ధి చెందిన ఉత్పత్తి యూనిట్లు ఏర్పడ్డాయి. పెట్టుబడి సాంద్రీకరణ

గల ఈ ఉత్పత్తి యూనిట్లు, ఉన్నత డిగ్రీలు, నైపుణ్యాలు గల కార్మికులను చాలా తక్కువ సంఖ్యలో నియమిస్తాయి. మరో పక్క తయారీ విభాగం మొత్తంలో వికేంద్రీకరణను మరింత లాభదాయకంగా పెట్టుబడిదారుడు పరిగణిస్తాడు. ప్రధాన కంపెనీ ఉత్పత్తి ప్రక్రియను ముక్కలు ముక్కలు చేసి ఔట్ సోర్సింగ్ ద్వారా తయారు చేయించి, తిరిగి అంతిమంగా పూర్తి వస్తువును కూరుస్తుంది. భారీ స్థాయిలో క్యాజువల్ పద్ధతి మీదా, కాంట్రాక్టు పద్ధతి మీదా నియమించడమూ, పెద్ద తయారీ కంపెనీలు అంతకంతకు ఔట్ సోర్సింగుకు పాల్పడడమూ, స్త్రీ పురుషుల ఉద్యోగ అన్వేషణలో తీవ్రంగా దిగజారిన పరిస్థితులూ – కార్మికులను ఉద్యోగాలలో నియమించడంలో ప్రధాన ధోరణిగా ఉన్నాయి. దోపిడీ అధికమవుతున్నా, ఒక ఫ్యాక్టరీలో యజమానికీ కార్మికుడికీ మధ్య ప్రత్యక్షంగా ఉండే వైరుధ్యం అనేక పొరల యజమానుల, కంట్రాక్టర్ల ద్వారా మరుగున పడుతుంది. ఆ కారణంగా వర్గ పోరాటం మరింత కఠినంగానూ, క్లిష్టంగానూ మారుతోంది. పాత తరహా ఫ్యాక్టరీలలోనూ, మిల్లులలోనూ పని చేస్తూ, పారిశ్రామిక ప్రాంతాలలోనూ, పరిసర ప్రాంతాలలోనూ నివసిస్తూ వ్యవస్థీకృతమైన పారిశ్రామిక కార్మిక వర్గం, దోపిడీకి గురవుతున్న వర్గంలో ఒక భాగంగా కార్మికుడి అస్తిత్వానికి వస్తుగతంగా ఒక బలమైన పునాదిగా ఉండేది. ఫ్యాక్టరీలో దైనందిన అనుభవం కార్మికుడు తను దోపిడీకి గురవుతున్నాననే చైతన్యాన్ని పటిష్టం చేసేది. పాత కార్మికుల కాలనీల స్థానంలో డబ్బున్న వారికి రియల్ ఎస్టేట్ డెవలపర్లు నిర్మించిన ఆకాశహర్మ్యాలూ, పెద్ద మాల్స్, షాపింగ్ సెంటర్లూ వెలిశాయి. పట్టణ ప్రాంతాలలో కార్మికుల కాలనీలు అదృశ్యమవడంతో కార్మికులూ, శ్రామికులూ చెల్లాచెదరయ్యారు. ఆర్థిక వ్యవస్థలోనూ, సాంస్కృతిక, సామాజిక జీవితంలోనూ వారి రాజకీయ ప్రాబల్యమూ, పోరాడే శక్తీ క్షీణించింది. మరో పక్క ఔట్ సోర్సింగ్, వికేంద్రీకరణ ప్రక్రియలతో తరచు కార్మికుడి ఇల్లే అతని పని స్థలమవుతోంది. ఆ విధంగా పని ప్రక్రియలలోనూ, పని స్థలంలోనూ కార్మికుల సమీకరణ మీద ఆధారపడిన సంప్రదాయ కార్మిక వర్గ రాజకీయాలు బలహీనపడ్డాయి.

వర్గేతర అస్తిత్వాల మీద ఆధారపడిన రాజకీయాలు పుంజుకోవడానికి గల నేపథ్యం ఇది. కార్మికుల అస్తిత్వాలు ఇలా ముక్క చెక్కలవడం వలన కలిగిన ఫలితం, కుల ఆధారిత రాజకీయ పార్టీలూ, ఉద్యమాలూ వేగంగా పెరగడంలోనూ, విస్తరించడంలోనూ స్పష్టంగా కనుపిస్తుంది. ఈ పార్టీలూ, ఉద్యమాలూ తమ సంకుచిత ప్రయోజనాల కోసం ఈ వస్తుగత ప్రక్రియలను ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆత్మాశ్రయ అంశం కూడా, అంటే పద్ధతులలోనూ, కార్మికులకు చేరువవడంలోనూ మన బలహీనతలు కూడా ఇందుకు తోడ్పడ్డాయి.

భారతదేశంలో 90వ దశకంలోనూ, 21వ శతాబ్దపు తొలి సంవత్సరాల లోనూ, తీవ్రమైన అణచివేతకు గురవుతున్న దళితులలోనూ, ఆదివాసీలలోనూ, అస్తిత్వ రాజకీయాలకు ప్రాతినిధ్యం వహించిన ప్రధాన ధోరణులు ఉండేవి. ఆ కాలంలో బహుజన సమాజ్ పార్టీ, మహారాష్ట్రలో అంబేద్కరైట్ పార్టీలు, దళితులలోనూ, ఆదివాసీలలోనూ పని చేస్తున్న అనేక యన్జీవోలూ, రాజకీయంగా అత్యంత బలంగా ప్రాతినిధ్యం వహిస్తుండేవి. ఈ పార్టీలూ, సంస్థలూ ప్రధానంగా వామపక్షాలకూ, వామపక్షాల వర్గ విశ్లేషణకూ వ్యతిరేకంగా ప్రత్యేక రాజకీయాలను ప్రచారం చేసేవి. స్త్రీల ఉద్యమాలలో, తొలి ఫెమినిస్టు ధోరణులు కూడ 'స్త్రీలు మాత్రమే' అనే అస్తిత్వాన్ని' నిర్మించడానికి కృషి చేశాయి.

**కుల దోపిడీ : దళితులు, గిరిజనులు / ఆదివాసీలు**

పుట్టుక మీద ఆధారపడిన కుల వ్యవస్థ దోపిడీ అవలక్షణాలను పెట్టుబడిదారీ విధానం, ముఖ్యంగా నయా ఉదారవాద దశలో ఉపయోగించుకోవడం దళిత, ఆదివాసీ అస్తిత్వవాద రాజకీయాలకు సారవంతమైన భూమి అయింది. భారతదేశంలో మొత్తం సమాజాన్ని ప్రభావితం చేస్తూ చారిత్రకంగా ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందిన విధానంలో కుల వ్యవస్థ వేళ్ళూనింది. కులం ఉపరితలంలోని భాగం అనీ లేదా క్యాపిటలిస్టు వ్యవస్థకు ముందున్న ఫ్యూడల్ వ్యవస్థ అవశేషమనీ, ఈ అవశేషాన్ని ఆధునిక క్యాపిటలిస్టు ఉత్పత్తి సంబంధాలు అధిగమించగలవనీ ఉండిన యాంత్రిక అవగాహన సైద్ధాంతికంగా, భావజాలంగా ఒక తప్పు. క్యాపిటలిజంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాలలో కులాన్ని విలీనం చెయ్యడం జరిగింది. వర్గ దోపిడీ ద్వారానూ, కుల అణచివేత ద్వారానూ దేశంలో ఉన్న బూర్జువా భూస్వామ్య వ్యవస్థ మనగలుగుతోంది. తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ఈ వర్గాలు సామాజిక నిచ్చెన మెట్ల వ్యవస్థను ఉపయోగించుకుంటున్నాయి. పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి క్రమంలో కులానికీ, వర్గానికీ మధ్య ఉన్న సహసంబంధం మారుతున్న మాట వాస్తవమే. గ్రామీణ ప్రాంతాలలో ఓబిసిలలో ఒక ఉన్నత వర్గం అభివృద్ధి చెందడాన్ని మనం గమనిస్తున్నాం. భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో, గిరిజనులలో ఒక బలమైన మధ్యతరగతి వర్గం అభివృద్ధి చెందడాన్ని మనం గమనిస్తున్నాం. షెడ్యూల్డ్ కులాలలో ఒక భాగంలో కూడా వర్గ భేదాలను మనం గమనిస్తున్నాం. కానీ, మొత్తం మీద శ్రామిక వర్గ సామాజిక కూడికలో, ముఖ్యంగా గ్రామీణ శ్రామిక వర్గంలో, దళితులూ, ఆదివాసీలు అత్యంత పెద్ద సమూహంగా ఉన్నారు.

దళితులూ, ఆదివాసీలూ తమ అస్తిత్వాన్ని చాటుకోవడంలో ఒక ప్రజాస్వామ్య అంశం ఉంది. పెట్టుబడిదారీ దోపిడీలోనూ, కుల అణచివేతలోనూ ఉన్న వారి భౌతిక పరిస్థితికీ ఈ ప్రజాస్వామ్య అంశానికీ సంబంధం ఉంది. కానీ దళితులు తమ అస్తిత్వాన్ని చాటుకోవడంలో ఉన్న ప్రజాస్వామ్య అంశాన్ని, ఆ దుస్థితికి కారణమైన వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటం నుండి వేరు చెయ్యాలని ప్రయత్నించే అస్తిత్వ రాజకీయాలతో మనం పోరాడాలి. ముఖ్యంగా (యూనివర్సిటీ) ప్రాంగణాలలో దూకుడుగా ఉండే దళిత లేదా అణగారిన కుల అస్తిత్వ రాజకీయాలు పుంజుకోవడం మనం చూస్తున్నాం. ఈ అస్తిత్వ రాజకీయాలు తరచు మితవాద గ్రూపుల కంటే వామపక్షాలనే తమ దాడికి లక్ష్యంగా చేసుకుంటున్నాయి. దీన్ని మనం ఒక శక్తివంతమైన సైద్ధాంతిక పోరాటం ద్వారా ఎదుర్కోవాలి. నిర్దిష్ట పరిస్థితిని అధ్యయనం చేసిన తర్వాత నిర్దిష్ట విధానాలను రూపొందించాలి.

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం తోనూ, బూర్జువా ఎన్నికల రాజకీయాలతోనూ ఓబీసీలు అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఏర్పరచగలిగాయి. ఓబీసీలలో అధిక భాగం ఇంకా చిన్న, మధ్య తరహా రైతులుగా కొనసాగుతున్నా, ఒక విభాగం భూస్వాములుగా ఎదిగి గ్రామీణ ఉన్నత వర్గంలో ఒక భాగమైంది. భౌతిక పరిస్థితుల మీద ఆధారపడిన భేదం పెరుగుతున్న కొలదీ, ఓబీసీలలో ఆధిక్యతలో ఉన్న కొన్ని ఉప కులాలు రిజర్వేషన్ మొదలైన సదుపాయాలు కలిగించిన లాభాలలో అధికభాగాన్ని స్వంతం చేసుకున్నాయని భావించడం జరిగిన చోట, ఇది ఓబీసీలలో సంఘర్షణలకు దారి తీసింది. అనేక చిన్న ఉప కులాల మీద ఆధారపడిన సంస్థల సమీకరణలతో, ఓబీసీలలో అత్యంత వెనుకబడిన విభాగాల అస్తిత్వాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఓబీసీ రిజర్వేషన్లలో రిజర్వేషన్ సమస్య గురించి మన దృక్కోణం ఏమిటి అన్నది నిర్ణయించేటప్పుడు ప్రతీ రాష్ట్రంలోనూ ఉన్న నిర్దిష్ట అమరికను మనం అధ్యయనం చెయ్యాలి. కానీ అస్తిత్వం మీద ఆధారపడి ఇలా ముక్క చెక్కలవడం కుల వ్యవస్థకూ మనవాద సంస్కృతికీ వ్యతిరేకంగా జరిగే విశాల సాధారణ పోరాటాన్ని బలహీన పరుస్తుంది.

ఈ మధ్య, ముఖ్యంగా హిందుత్వ రాజకీయాలు ప్రవేశించిన తర్వాత, కులం పేరుతో బ్రాహ్మణులు, ఠాకూర్లు లాంటి అగ్ర కులాలు, తమ కులాల ప్రజలను సమీకరించడం సర్వసాధారణమైంది. కుల వ్యవస్థలో తమ ఆధిక్యతను ప్రకటించే ఇటువంటి అస్తిత్వ రాజకీయాలు పూర్తిగా అభివృద్ధి నిరోధకమైనవి.

**స్త్రీలు, జెండర్, అస్తిత్వ రాజకీయాలు**

చౌకగా ఉండే స్త్రీ శ్రమశక్తి నుండి అదనపు విలువను మరింతగా దోచుకునే

ఉద్దేశంతో, ఈ దోపిడీ వ్యవస్థను కొనసాగించడానికి కుల సమస్యలో లాగానే, పితృస్వామిక సంస్కృతినీ, విధానాలనూ, ఆచరణలనూ ఉపయోగించుకోవడమూ, మరింత బలపరచడమూ జరుగుతోంది. స్త్రీ శ్రమ శక్తి పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో లాభానికి ఒక ముఖ్య వనరు. మధ్యతరగతికి చెందిన కొంతమంది యువతులకు కొన్ని విభాగాలలో ఉద్యోగాలకు కొత్త అవకాశాలు ఏర్పడడమూ, స్త్రీ వ్యతిరేక సంప్రదాయాలకు వ్యతిరేకంగా చట్టపర చర్యల కోసం మహిళా ఉద్యమాలూ, స్త్రీల పరిస్థితిలో నిశ్చయంగా ఆహ్వానించదగ్గ మార్పులకు దారి తీశాయి. కానీ నిరుద్యోగ సమస్య, అధిక ధరలు, పెరుగుతున్న హింసల బరువు క్రింద కార్మిక, శ్రామిక వర్గాల స్త్రీలు అణిగిపోతున్నారు. కుల వ్యవస్థలో ఒక ప్రధాన అంశమైన స్వకుల వివాహం, స్త్రీల సెక్సువాలిటీని నియంత్రించడం మీదా, వ్యక్తిగత స్వాతంత్ర్య నిరాకరణ మీదా ఆధారపడి ఉంది. కులాంతర వివాహాలకూ, మతాంతర వివాహాలకూ వ్యతిరేకంగా జరిగే పరువు నేరాలలో గణనీయమైన పెరుగుదల స్త్రీ సాధికారిత పై పై మెరుగేననీ, నిస్సారమైనదనీ సూచిస్తుంది.

పలుకుబడిగల పట్టణ ప్రాంత ఫెమినిస్టు గ్రూపులు ఆధునికానంతర సిద్ధాంతాలతో చేతులు కలిపి నిరంతరం వామపక్ష వ్యతిరేక దృక్కోణాన్ని అవలంబిస్తున్న బలమైన ధోరణులున్నాయి. వారు స్త్రీల స్థితిని కేవలం స్త్రీ-పురుష నమూనాలోనే విశ్లేషించారు. పితృస్వామ్యాన్ని, సామాజికార్థిక నిర్మాణంతో సంబంధంలేని స్వతంత్ర సామాజిక సంస్థగా పరిగణించారు. ఇటీవలి సంవత్సరాలలో అటువంటి ధోరణులు బలహీనపడ్డాయి. అయినా యూనివర్సిటీ ప్రాంగణాలలో అటువంటి కొన్ని గ్రూపులు ఇంకా కొన్ని ఉన్నాయి, అక్కడ వారికి కొంత బలం ఉంది.

గే హక్కుల కోసం అంతర్జాతీయంగా ఆందోళనలు జరగడంతో ప్రత్యామ్నాయ సెక్సువాలిటీ గుర్తింపు సమస్యకు ప్రచారం లభించింది. భారత దేశంలో కూడా LGBTQIZ (లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్ జెండర్, క్వీర్, ఇంటర్ సెక్స్, ఎసెక్సువల్) తన గొంతును వినిపించడంతో దాదాపు అన్ని ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలలోనూ ఈ విషయం చర్చకు దారి తీసింది. కొన్ని పార్టీలు మౌనం వహిస్తే, బిజెపి స్వలింగ సంబంధాలనూ, సెక్సువల్ ఎంపికనూ తీవ్రంగా వ్యతిరేకించింది. సిపియం, ఇతర వామపక్ష పార్టీలు మాత్రమే, యువతకు అంగీకారంతో స్వలింగ సంబంధాల హక్కును సమర్థించాయి. స్వలింగ సంబంధాలను నేరాలుగా పరిగణించడం అటువంటి సంబంధాల పట్ల హింసకు దారి తీసింది. సామాజిక తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా అటువంటి విభాగాలు తమ అస్తిత్వాన్ని ప్రకటించినప్పుడు, దాన్ని అన్యాయానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంగా చూడాలి.

ట్రాన్స్‌జెండర్ పౌరులు తమను ఇతర పౌరులతో సమానంగా చూడాలని చేసే పోరాటానికి కూడా ఇది వర్తిస్తుంది. వారి పోరాటాలూ, ప్రకటనలూ పార్లమెంటులో చట్ట ముసాయిదాకు దారి తీసినా, వివక్ష కొనసాగుతూనే ఉంది. పశ్చిమ దేశాలలో సెక్సువల్ హక్కుల కోసం జరిగే అనేక ఉద్యమాలను వామపక్షానికి మిత్రులుగా పరిగణించడం జరుగుతోంది. సాధారణంగా అటువంటి ఉద్యమాలు ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలైనా, భారతదేశంలో అటువంటి ధోరణి కనుపించడం లేదు.

ఇటువంటి సమస్యలలో ఒక ప్రజాస్వామ్య అంశం ఉంటుంది కనుక వాటిని మనం వ్యతిరేకించవలసిన అస్తిత్వ రాజకీయాలుగా చూడకూడదు.

**జాతి అస్తిత్వం, జాతి జాతీయవాదం**

జాతి (ethnic) అన్న పదమే అస్తిత్వ రాజకీయాల సమీకరణలో ఒక భాగంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

1980ల నుండి కొత్త రూపాల జాతి అస్తిత్వాలు ఎలా తలెత్తాయో అర్థం చేసుకోవడానికి ఈశాన్య ప్రాంతం ఒక మంచి ఉదాహరణ. ఒక జాతి సమూహంలో భాగమనే చైతన్యమూ, తమ అస్తిత్వాన్ని చాటుకోవడమూ క్రమంగా పెరిగింది. సంకుచితమైన తమ జాతి అస్తిత్వం తప్ప మరే విశాల వేదిక లేకపోవడం వలన, అటువంటి అస్తిత్వ రాజకీయాలు మరొక తరహా అస్తిత్వ రాజకీయాలతో సంఘర్షణకు దారి తీశాయి. దిమాసా, నాగాలు, బోడోలు, కర్బీలు – సోదరుల మధ్య సంఘర్షణలతో వీరిలో చాలామంది ఒకరికి ఒకరు శత్రువులయ్యారు. ఇవన్నీ కూడా గిరిజన కమ్యూనిటీలలో భాగమే. కానీ, సంకుచితమైన ఈ అస్తిత్వ రాజకీయాలను బూర్జువా రాజకీయ పార్టీలు తమ అధీనంలోకి తీసుకుని ప్రోత్సహించడంతో లోతైన చీలికలు ఏర్పడ్డాయి.

పెట్టుబడిదారీ విధానం అసమానంగా అభివృద్ధి చెందడంతో ఇంతకు ముందటి భాషాప్రయుక్త రాష్ట్రాల డిమాండు స్థానంలో సంకుచిత ప్రాంతీయ వర్గ రహిత అస్తిత్వాలు తలెత్తాయి. తులనాత్మకంగా అంతగా అభివృద్ధి చెందని ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు తమ ప్రాంతం పట్ల వివక్షను గ్రహించడం, వారిలోని నయా ధనికులలో, రాజకీయంగా దురాశతో ఉన్నవారిలో కొన్ని విభాగాలు ఒక ప్రత్యేక రాష్ట్ర డిమాండు లేవనెత్తడానికి పునాది అవుతుంది. ఈ క్రమంలో ప్రత్యేక రాష్ట్రానికి లేదా రాష్ట్రాన్నుండి విడిపోవడానికి డిమాండు ఈశాన్య ప్రాంతంలోనూ, ఇతర ప్రాంతాలలోనూ తలెత్తింది. త్రిపురలో మాజీ పాలకుడి కుటుంబ నాయకత్వాన ప్రత్యేక గిరిజన రాష్ట్ర డిమాండు ఊపందుకుంది. ఈ ఉద్యమం గిరిజన యువత నుండి చాలా మద్దతును పొందగలిగింది. ఉదాహరణకు, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో

పక్క పక్కన ప్రాంతాలలో నివసిస్తున్న భిల్ ఆదివాసీ కమ్యూనిటీలు ప్రత్యేక భిల్ రాష్ట్రం కోసం మద్దతునివ్వడం మనం చూస్తున్నాం. దక్షిణ రాజస్థాన్‌లో భారతీయ గిరిజన పార్టీ ధూంగార్పూర్ ప్రాంతంలో బిజెపి, కాంగ్రెసు పార్టీలను ఓడించి ముఖ్యమైన సీట్లను గెలుచుకుని గిరిజన ప్రాంతాలలో బలమైన పార్టీగా నిలిచింది. ఇంతకు ముందు విద్యార్థులలో మనకున్న గిరిజన పునాదిని ఇది తుడిచి పెట్టేసింది. అటువంటి డిమాండుకు మనం మద్దతు ఇవ్వలేం. కానీ దోపిడీకీ గురవుతున్న, అంచులకు నెట్టివేయబడిన గిరిజనుల నిజమైన సమస్యల గురించి మనం పోరాడాలి.

ఉమ్మడి ఉద్యమాన్ని బలహీనపరచడమూ, విచ్ఛిన్నం చెయ్యడమూ అస్తిత్వ రాజకీయాల పర్యవసానంగా ఉంటుంది.

## భాగం 2 : హిందుత్వ, అస్తిత్వ రాజకీయాలు

ఈ ధోరణులన్నీ వర్గ ఆధారిత విశ్లేషణకూ, ఐక్యతను డిమాండు చేసే వామపక్ష రాజకీయాలకూ ఇంకా ఒక సవాలుగా కొనసాగుతుండగానే, హిందుత్వ, మనువాద భావజాలాన్ని సమాజం మీద రుద్దడానికి దూకుడుగా చేస్తున్న ప్రయత్నాల వలన పరిస్థితిలో ఒక నాటకీయమైన మార్పు సంభవించింది. ఇతర మతాల పట్ల, ముఖ్యంగా ఇస్లాం పట్ల, ద్వేషం మీద ఆధారపడుతూ మతం పేరుతో అన్ని అస్తిత్వాలను కమ్మివేసే హిందుత్వ అస్తిత్వాన్ని అభివృద్ధి చెయ్యడానికి జరుగుతున్న ప్రయత్నాలతో ఈ ప్రమాదకరమైన మార్పు సంభవించింది. హిందుత్వ అస్తిత్వ రాజకీయాలకూ ఇతర అస్తిత్వ రాజకీయాలకూ మధ్య తేడా ఏమిటంటే – హిందుత్వ అస్తిత్వవాదం మెజారిటీ మతవాదంతో అంతర్గతంగా ముడిపడి ఉంటుంది. దీనికి పాలక వర్గాల బలమైన మద్దతు కూడా ఉంది. ఈ రోజు మనం చూస్తున్నది ఒక కార్పొరేట్–మతోన్మాద పాలనా వ్యవస్థ. ఈ పాలనా వ్యవస్థలో అస్తిత్వ రాజకీయాల కొత్త రూపాలను ప్రోత్సహించడం జరుగుతోంది.

### మత అస్తిత్వం X మత విశ్వాసం

ఒక ప్రత్యేక, ఆధిపత్య మత అస్తిత్వాన్ని సృష్టించడం – తను ఎంచుకున్న మతాన్ని ఆచరించడమూ, ప్రచారం చెయ్యడమూ అనే రాజ్యాంగ హక్కుకు పూర్తిగా భిన్నమైనది. దానికి మత విశ్వాసంతో కూడా సంబంధం లేదు. ఈ రాజ్యాంగ హక్కును కాపాడడమే కాకుండా, సిపియం తన కార్యక్రమంలో తన వైఖరిని నిర్దిష్టంగా పేర్కొంది. 'జనతా ప్రజాస్వామ్యమూ, దాని కార్యక్రమమూ' విభాగంలో, 'ఏ అడ్డంకులూ లేని భావప్రకటనాస్వేచ్ఛ (conscience), మత విశ్వాసమూ, ఆరాధన' గ్యారంటీ ఉన్న

ఒక హక్కు అనీ, ఈ హక్కును 'కాపాడుతామనీ' స్పష్టంగా చెప్పడం జరిగింది.

ప్రస్తుత చర్చ మతం పట్ల మన విధానం గురించి కానప్పటికీ, ఇక్కడ మనం కొంచెం పక్కకు తొలగి, మన పార్టీ సభ్యులలో మత ఆచరణ, మత విశ్వాసాల గురించి పార్టీ అవగాహనను మళ్ళీ చెప్పడం అవసరం. కమ్యూనిస్టులుగా మనం నాస్తికులం. ప్రపంచం గురించి భౌతికవాద అవగాహన మీద మన విధానం ఆధాపడి ఉంటుంది. రోజువారీ సైద్ధాంతిక కృషిలో భాగంగా మనం ఈ అవగాహనను ప్రచారం చేస్తాం. కానీ పార్టీలో సభ్యత్వానికి నాస్తికవాదిగా ఉండాలనే ముందస్తు నియమం మన నియమావళి (constitution)లో లేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ, జిల్లా స్థాయిలోనూ పార్టీ నాయకత్వం మత సంప్రదాయాలనూ, కర్మకాండనూ వదిలిపెట్టి ఈ శాస్త్రీయ విధానాలను సమర్థించాలని భావిస్తాం.

పార్టీ సభ్యత్వానికి నియమాల గురించి చెబుతూ, లెనిన్ తన రచన 'సోషలిజం–మతం'లో ఈ ప్రశ్న గురించి చాలా స్పష్టంగా చెప్పాడు : "క్రిస్టియన్లకూ, దేవుడిని విశ్వసించేవారికీ మన పార్టీ సభ్యత్వాన్ని ఎందుకు నిరాకరించడం లేదు?"

ఈ ప్రశ్నకు సమాధానం, మతం పట్ల బూర్జువా ప్రజాస్వామ్య వైఖరికీ, సోషల్ డెమోక్రటిక్ వైఖరికీ మధ్య నున్న చాలా ముఖ్యమైన భేదాన్ని వివరిస్తుంది.

మన కార్యక్రమం పూర్తిగా శాస్త్రీయ దృక్పథం మీద, అంటే ప్రపంచం గురించి భౌతికవాద దృక్పథం మీద, ఆధాపడి ఉంది. ఆ కారణంగా మన కార్యక్రమ వివరణలో తప్పనిసరిగా మత మౌఢ్యానికి గల వాస్తవమైన చారిత్రక, ఆర్థిక మూలాల గురించి వివరణ ఉంటుంది.

కానీ ఎట్టి పరిస్థితులలోనూ మనం మత సమస్యను, బూర్జువా వర్గంలోని రాడికల్ ప్రజాస్వామ్యవాదులు తరచు చేస్తున్నట్లు, అమూర్తంగా, భావవాద పద్ధతిలో, వర్గ పోరాటంతో సంబంధంలేని 'మేధో సంబంధమైన' ప్రశ్నగా పరిగణించే తప్పు చెయ్యకూడదు. అంతులేని అణచివేతతో శ్రామిక జనులు మొరటుతనానికి గురవుతున్న సమాజంలో కేవలం ప్రచారం ద్వారా మత దురభిప్రాయాలను తొలగించగలమని ఆలోచించడం మూర్ఖత్వం. మానవజాతి భుజాల మీద మోపబడిన మతమనే కాడి, కేవలం సమాజంలోని ఆర్థిక కాడి యొక్క ఉత్పాదితమూ, ప్రతిబింబమూ అన్న విషయాన్ని మరచిపోవడం బూర్జువా సంకుచిత దృక్పథం అవుతుంది. పెట్టుబడిదారీ విధాన దుష్ట శక్తులతో తన పోరాటాల ద్వారా కార్మిక వర్గం జ్ఞానాన్ని పొందలేకపోతే, ఏ పుస్తకాలూ, ఉపదేశాలూ కార్మిక వర్గానికి జ్ఞానాన్ని ఇవ్వలేవు. స్వర్గం గురించి కార్మిక వర్గ అభిప్రాయాలలో ఐక్యత కంటే భూమి మీద స్వర్గాన్ని సృష్టించడానికి

అణగారిన వర్గం చేసే ఈ విప్లవాత్మక పోరాటంలో ఐక్యత మనకు చాలా ముఖ్యమైనది.

ఆ కారణంగా మనం మన కార్యక్రమంలో నాస్తికత గురించి ఒక నియమాన్ని పెట్టలేదు, పెట్టకూడదు. అందుకనే, పాత దురభిప్రాయాల అవశేషాలను ఇంకా వదులుకోలేని కార్మికులను మన పార్టీలో చేర్చుకోవడానికి నిరాకరించడం లేదు, నిరాకరించకూడదు. మనం ఎల్లప్పుడూ శాస్త్రీయ ప్రపంచ దృక్పథాన్ని బోధిస్తాం. వివిధ 'క్రిస్టియన్లలో' మాటలకూ, చేతలకూ ఉన్న తేడాలతో పోరాడడం అవసరం. దీనర్థం మత సమస్యను మొదటి స్థానానికి తీసుకురావాలని కాదు. ఈ సమస్య ఏ మాత్రం మొదటి స్థానంలో ఉండాల్సిన సమస్య కాదు. అర్థంపర్థం లేని భావజాలమూ, తృతీయ శ్రేణి భావాలూ రాజకీయ ప్రాముఖ్యతను వేగంగా కోల్పోతున్నాయి, ఆర్థికాభివృద్ధితో చెత్తగా తుడిచిపెట్టుకుపోతున్నాయి. అటువంటి భావజాలాల ద్వారా నిజమైన విప్లవాత్మక ఆర్థిక, రాజకీయ పోరాట శక్తులు ముక్కలు కావడం మనం అనుమతించకూడదు.

**ఆరెస్సెస్ - ప్రత్యేక హిందూ అస్తిత్వ నిర్మాణం**

హిందూయిజానికి ఒక ప్రత్యేక వ్యాఖ్యానం మీద ఆధారపడి ఆధిపత్య అస్తిత్వాన్ని నిర్మించే ఆరెస్సెస్ ఎజెండా విషయానికి వస్తే, హిందూ అస్తిత్వం అనే దాన్ని నిర్మించడానికి అనేక కోణాలున్నాయి. పూర్తిగా కాక పోయినా, దిగువన కొన్ని ఉదాహరణలు చూద్దాం :

1. హిందూ అస్తిత్వాన్ని జాతీయవాదంతో సమానంగా పరిగణించడం. సావర్కర్, హెడ్గేవార్, గోల్వాల్కర్‌లతో ప్రారంభించి ఆరెస్సెస్ సాహిత్యంలో మతాన్ని జాతీయతకూ దేశానికీ పునాదిగా నిర్వచించడం జరిగింది. ఆ విధంగా మొట్టమొదటగా రెండు దేశాల సిద్ధాంతాన్ని సావర్కర్ ప్రకటించాడు. దీన్ని అదే సమయంలో భారతీయత నిర్వచనంగా అభివృద్ధి చెయ్యడం జరిగింది. ఎవరికి ఈ దేశం పితృభూమి, పవిత్రభూమి కూడా అవుతుందో వారిని మాత్రమే భరతమాత పుత్రులుగా అంగీకరించాలి అనే సిద్ధాంతం మీద మతాన్ని జాతీయతతో జోడించడం అనే భావజాల సారాంశం ఆధారపడుతుంది. ఆ విధంగా తాను ఇండియా - హిందూ దేశం, హిందూ రాష్ట్ర అని భావించిన దాని నుంచి ముస్లింలనూ, క్రిస్టియన్లనూ సావర్కర్ మినహాయించాడు. అధికారంలోకి వచ్చినప్పటినుండీ హిందువులనూ, జాతీయతనూ సమానంగా పరిగణించడం ప్రమాదకర స్థాయికి చేరుకుంది.

పాకిస్తాన్‌తో ఉన్న ప్రతీ విభేదాన్నీ ఉపయోగించుకుంటూ, ముస్లింలు సహజంగానే పాకిస్తాన్‌ను తమదిగా భావిస్తారు అని ఆరెస్సెస్ ప్రచారమంతటిలోనూ ప్రతిపాదించడం జరుగుతోంది. తమ మత అనుబంధం ఇస్లాంతో ఉన్న కారణంగా భారతదేశ పౌరులైనా ముస్లింలు ఇండియాకు విశ్వాసపాత్రంగా ఉండలేరనే ఈ మెజారిటీవాద ప్రచారాన్ని బలపరచడానికే ముస్లిం మతస్తులను టెర్రరిస్టులుగా, దేశ విద్రోహకర శక్తులుగా, రేపిస్టులుగా, నేరస్తులుగా, రాక్షసులుగా చిత్రిస్తున్నారు. ఆ విధంగా హిందువుగా ఉండడమంటే జాతీయవాదిగా ఉండడం, హిందువుగా ఉండడం అంటే భారతీయుడిగా ఉండటం అవుతుంది. హిందుత్వ పునాది ఇది. సాంస్కృతిక జాతీయత అని అది ఇచ్చే నినాదం మతం మీద ఆధారపడిన మతతత్వ అస్తిత్వ రాజకీయాలకు ఒక ముసుగు మాత్రమే.

2. చరిత్రను తిరిగి రాయడమూ, భారతదేశంలో బ్రిటిష్ వలస పాలన సాగించిన నేరాలను తక్కువ చేసి చూపడమూ, తొలి ముస్లిం పాలకులనూ, ఆ తర్వాత వచ్చిన మొఘలులనూ నిజమైన శత్రువులుగా చెప్పడమూ, ఈ హిందుత్వ అస్తిత్వ నిర్మాణంలో ఒక భాగమే. స్థానిక హిందూ ఫ్యూడల్ ప్రభువులతోనూ, రాజులతోనూ పొత్తుల కారణంగా విదేశీ సైన్యాలు విజయం సాధించ గలిగాయని చెప్పడానికి మారుగా ఈ యుద్ధాలను ముస్లిం–హిందూ, ఇస్లాం–హిందూయిజంల మధ్య యుద్ధాలుగా చెప్పడం జరుగుతోంది. ఫ్యూడల్ ప్రభువుల పట్ల విధేయత కలిగిన ఆరెస్సెస్, ముస్లిం దండయాత్రలకు వ్యతిరేకంగా వాస్తవంగా సాగిన 'సాహసపూరితమైన యుద్ధాలు' కానీ, లేదా కల్పిత సాహస గాథలు కానీ ఈ విషయాన్ని నొక్కి చెప్పడానికి ఉపయోగిస్తోంది.

3. కుల వ్యవస్థను కొనసాగిస్తూ కుల విభేదాల సమస్యను అధిగమించడం ఎలా అనేది ఆరెస్సెస్ ముందున్న ముఖ్య కార్యక్రమాలలో ఒకటి. వివిధ కులాల, ఉప కులాల అస్తిత్వాలను ప్రోత్సహించడం ద్వారా ఇది సాధించడానికి ప్రయత్నించడం జరుగుతోంది. ఉదాహరణకు, దళితులలోని ప్రత్యేక ఉప కులాలను గుర్తించి, ఆ కుల నాయకుల చరిత్రలూ, సంస్కృతులూ మొదలైన వాటిని అధ్యయనం చేసి, ఒక ప్రత్యేక అస్తిత్వాన్ని ప్రోత్సహించడానికీ, ఆ అస్తిత్వాన్ని చూసి ఈ ఉప కులాలు గర్వించడానికీ ఉపయోగిస్తోంది. కానీ ఆ అస్తిత్వం వర్ణాశ్రమం నాలుగు గోడల మధ్యనే కొనసాగుతుంది. కుల వ్యవస్థకు ఆరెస్సెస్ కట్టుబడి ఉండడం 'ఘర్ వాపసీ–ఇంటికి తిరిగి రండి' ఉద్యమంలో మనం చూస్తాం. 'హిందూ సమూహం'లోకి తిరిగి చేరేలా ఒత్తిడికి

గుర్రై మతం మారిన వారిని, దళితులైనా, ఆదివాసీలైనా, తమ కులంలోకి చేర్చడం జరుగుతోంది.

అనేక ఎన్జీవోల ద్వారానూ, వేదికల ద్వారానూ ఆరెస్సెస్ ఆదివాసీలలో ఒక బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ రెండు విధాలుగా ప్రయత్నం జరుగుతోంది. మొదటగా, ఆదివాసీలలో వివిధ విభాగాలను ప్రోత్సహించడం ద్వారా అస్తిత్వాన్ని అభివృద్ధి చేస్తుంది. వివిధ విభాగాలలోని సాంప్రదాయక ప్రత్యేక ఆచరణలనూ, సంస్కృతులనూ ఉపయోగిస్తూ, దాని ద్వారా హిందూయిజేషన్‌ను ప్రవేశపెడుతుంది. రెండోది – మత పునాది మీద విరుద్ధ సమూహాలుగా విభజించడం. ఆదివాసీలలో గణనీయమైన భాగం క్రిస్టియన్లు కనుక, వారు హిందూయిజం అంగీకరించేటట్లు చెయ్యడం కానీ, లేదా షెడ్యూల్డ్ జాతులకు చెందిన వారిగా వారి గుర్తింపును రద్దు చెయ్యడానికి ఉద్యమాలను నిర్మించడం కానీ చేస్తుంది.

మైక్రో ఇంజినీరింగుకు ఈ రకమైన అస్తిత్వ రాజకీయాలు పునాది. (మైక్రో ఇంజినీరింగ్) వివిధ కుల అస్తిత్వాలకు స్థలాన్ని కల్పిస్తూ కుల వ్యవస్థను కాపాడి కొనసాగించే ఒక ద్వేషపూరితమైన రాజకీయ ప్రణాళిక. ఒక్కొక్కప్పుడు వామపక్ష సానుభూతిపరులు కూడా మైక్రో ఇంజినీరింగును సాధించవలసిన లక్ష్యంగా తప్పుగా ఉపయోగిస్తుంటారు. ఇది పూర్తిగా తప్పు. అంచులలో జీవించే కమ్యూనిటీలను గౌరవించడమూ, వామపక్ష ఉద్యమంలో వారి సమస్యలను గుర్తించడమూ మైక్రో ఇంజినీరింగుతో ఏ మాత్రం సంబంధం లేనిది.

4. ఇతర మతాలలో లాగా హిందూ మతాన్ని విశ్వసించేవారికి ఒకే ఒక దేవుడు కాని, బైబిల్ లేదా ఖురాను వంటి ఒకే ఒక పవిత్ర గ్రంథం కాని లేకపోవడం వలన, హిందూమతాన్ని విశ్వసించేవారిలో ఉన్న అసంఖ్యాక స్థానిక సంప్రదాయాలనూ, ఆచరణలనూ పక్కకు నెట్టి, అత్యున్నత స్థానంలో రాముడిని నిలిపి ప్రబలమైన హిందూ అస్తిత్వాన్ని నిర్మించే ప్రయత్నం జరుగుతోంది. డబ్బు సంచుల అండదండలతో బిజెపి, ఆరెస్సెస్‌లు మత విశ్వాసాన్ని ఉత్సవాలుగా నిర్వహించడం పెద్ద ఎత్తున జరుగుతోంది. బిజెపి అధికారంలో ఉన్న కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇలా చేశాయి. ఉదాహరణకు, దక్షిణాన కానీ, తూర్పున కానీ అంతగా ఆచరించని రామనవమి లాంటి పండుగలను హిందూ ఐక్యతకూ, అస్తిత్వానికీ చిహ్నాలుగా భారతదేశమంతటా దూకుడుగా ప్రోత్సహించడం జరిగింది. ఇది

కొనసాగుతున్న ప్రణాళిక. ఆ విధంగా ఇది భారతదేశంలో ఆరాధన, విశ్వాసాల సంస్కృతిలో ఉన్న బహుళ సంప్రదాయాలను చదును చెయ్యడమే. భారత దేశ భిన్నత్వం మీద ఒక దాడిగా కూడా దీన్ని పరిగణించవచ్చు.

5. భారతదేశమంతటా స్థానిక స్థాయిలో లక్షల స్త్రీల గ్రూపులను 'ఇరుగు పొరుగు' (neighbourhood) సమూహాలుగా ఏర్పరచడం జరిగింది. రెగ్యులర్‌గా భజనలూ, హిందూ మత గ్రంథాలను పఠించడమూ మొదలైన చర్యల ద్వారా హిందువులకూ ఇతరులకూ మధ్య తేడాని నొక్కి చెప్పడానికి ఈ సమూహాలను విలక్షణమైన అస్తిత్వంతో ఏర్పరిచారు. ఈ గ్రూపుల ద్వారా అన్ని రకాల మూఢ విశ్వాసాలను ప్రచారం చెయ్యడం జరుగుతోంది. కోవిడ్ కాలంలో కోవిడ్ దేవతను పూజించమని స్త్రీలను కోరడం మనం చూశాం. హిందువులూ ఇతరులూ కలిసి ఉన్న ప్రదేశాలలో మాత్రం ఇది ముస్లిం స్త్రీలను వేరు చేసింది.

అస్తిత్వ రాజకీయాల ఇతర రూపాలన్నింటినీ హిందుత్వ, దాని బ్రాహ్మణ మనువాద పునాది సాధారణ చట్రంలో ముంచి వెయ్యడానికి ప్రయత్నం జరుగుతోంది. ఈ ప్రణాళిక ప్రకారం, ఆచరణలో హిందువుగా ఉండడమంటే తప్పనిసరిగా ఇతర మతాల పట్ల, ముఖ్యంగా ఇస్లాం పట్ల, ద్వేషంతో కూడిన ఒక దురభిమానిగా ఉండడమన్నమాట.

**ముస్లిం అస్తిత్వవాద రాజకీయాలు**

ద్వేషం మీద ఆధారపడిన ఒక ప్రత్యేక మత అస్తిత్వాన్ని దూకుడుగా నిర్మించే ఈ ప్రయత్నానికి జవాబుగా, ముస్లిం మతతత్వవాదులు తమ తరహా అస్తిత్వ రాజకీయాలతో ముస్లిం కమ్యూనిటీలోకి లోతుగా చొచ్చుకుపోయారు. ఇక్కడ అత్యంత అభివృద్ధి నిరోధకమైన, సంప్రదాయవాద కట్టుబాట్లు, ముఖ్యంగా స్త్రీలకూ బాలికలకు వ్యతిరేకంగా, కమ్యూనిటీలో వ్యాపిస్తున్నాయి. అదీకాక, ప్రత్యేక లక్ష్యాలకు వ్యతిరేకంగా హింసాత్మక అతివాద చర్యలను ప్రోత్సహించే రాజకీయాలను వ్యాప్తిచేసే ప్రయత్నం జరుగుతోంది. SDPI, PFI, క్యాంపస్ ఫ్రంట్ లాంటి సంస్థలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ తరహా రాజకీయాలు 'ముస్లింలు మాత్రమే' రాజకీయాలను చాలా తీవ్రంగా ప్రోత్సహిస్తున్నాయి. మరింత ప్రమాదకరమైన మెజారిటీ మతతత్వ రాజకీయాలకూ ముస్లిం రాజకీయాలకూ మధ్య తేడాను అంచనా వెయ్యడంలో కొన్ని వామపక్ష, ఉదారవాద గ్రూపులు ముస్లిం మతతత్వ గ్రూపుల పట్ల రాజీ ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ఉదాహరణకు, సిపిఐ–యంయల్, దాని ఫ్రంటు సంస్థలూ, జమాతే ఇస్లామీకి

అనుబంధంగా ఉన్న కేంపెయిన్ అగెనెస్ట్ హేట్, లేదా SIO లాంటి గ్రూపులనూ ఫ్రంటు సంస్థలనూ చేర్చుకోవడానికి సహకరిస్తున్నాయి. ఏ రంగులో ఉన్నా మతతత్వ గ్రూపులతో మనం ఏ విధంగానూ రాజీ పడకూడదు.

**భాగం 3 : వామపక్ష రాజకీయ వ్యూహం**

రాజ్యం అండదండలతో ఆరెస్సెస్ మెజారిటేరియన్ మతతత్వ అస్తిత్వ రాజకీయాలను దూకుడుగా అమలు చేస్తున్న కాలంలో, అస్తిత్వ రాజకీయల పట్ల మన విధానానికి అనేక కోణాలుంటాయి. వివిధ రాష్ట్రాలలో పరిస్థితులను అధ్యయనం చెయ్యవలసి ఉంటుందన్నది వాస్తవమే అయినా, కొన్ని ఉమ్మడి లక్షణాలు కూడా ఉంటాయి :

1. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా సిపియం చేసే పోరాటంలో సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే నిర్దిష్ట పోరాటం మిళితమయి ఉంటుంది. భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిలో అంతర్గతంగా పెనవేసుకున్న కుల వ్యవస్థ, పితృస్వామ్యం లాంటి వ్యవస్థలను వినియోగించుకోవడం ద్వారా వర్గ దోపిడీ సాధ్యమవుతుంది. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడడానికీ, శ్రమజీవుల ఐక్యతను సాధించడానికీ ఈ రెండింటికీ వ్యతిరేకంగా జరిగే పోరాటాలను జతచేయడం అవసరం.

   ఈ సందర్భంలో రెండు పెడ ధోరణుల పట్ల జాగ్రత్త వహించడం అవసరం: మొదటిది – వర్గాన్నీ, వర్గ పోరాటాన్నీ యాంత్రికంగా అర్థం చేసుకోవడం. కార్మిక వర్గం యొక్కా, గ్రామీణ శ్రామిక వర్గం యొక్కా సామాజిక కూర్పును విస్మరించడం జరుగుతోంది. ఈ వర్గాలలో దళితులూ, ఆదివాసీలూ ఎక్కువగా ఉంటారు. వీరి నుంచి మరింత అదనపు విలువను గుంజడానికి కుల అణచివేత ఒక సాధనంగా ఉంటోంది అన్న వాస్తవాన్ని విస్మరించడం జరుగుతోంది. అణచివేతకు గురయ్యే కులాల విషయంలో, చాలా తక్కువ చెల్లించే, నైపుణ్యం లేని ఉద్యోగాలలో నియామకానికి కులం నిర్ణయాత్మకంగా ఉంటోంది. పట్టణ ప్రాంతాలలో అటువంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మరింత ఎక్కువగా ఉన్నాయి. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా శక్తివంతంగా పోరాడకుండా భారతదేశ కుల వ్యవస్థ నేపథ్యంలో వర్గ ఐక్యతను సాధించవచ్చు అనే అవగాహన వర్గ పోరాటాన్ని నీరుగారుస్తుంది.

   అస్తిత్వ రాజకీయాలను పూర్తిగా అంగీకరిస్తూ, అటువంటి అణచివేతకు గురవుతున్న గ్రూపులలోనూ, కమ్యూనిటీలలోనూ కొన్ని విభాగాలు

అనుసరిస్తున్న అస్తిత్వ రాజకీయాల వెనుక తోకలా నడవడం మరో పెద ధోరణి. ఈ గ్రూపులతో సంబంధం పెట్టుకొని, మన వైపుకు తిప్పుకునే పేరుతో, మనం వారి తప్పుడు రాజకీయాలను గుర్తించి వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయకపోవడం. అణచివేతకు గురవుతున్న విభాగాలు ఎదుర్కొంటున్న నిర్దిష్ట సామాజిక, కుల అడ్డంకుల సమస్యలను గమనం లోకి తీసుకుని వర్గ ఐక్యతను సాధించే మన విధానాన్ని ఈ విభాగాలలో ఉన్న ప్రజలలో చొప్పించే ప్రయత్నాలు ఏమీ చెయ్యక పోవడం.

ఆదివాసీలకూ, దళితులకూ, మైనారిటీలకూ మనం ప్రత్యేక వేదికలనూ సంస్థలనూ ఏర్పాటు చేసినప్పుడు, వారి చైతన్య స్థాయినీ, ప్రస్తుత చైతన్య స్థితినీ దృష్టిలో  ఉంచుకుని, వారి దగ్గరకు వెళ్ళి వారి సమస్యల మీద మనం వారిని ఆర్గనైజ్ చెయ్యగలం, సమీకరించగలం. ఆ విధంగా మనం ఉమ్మడి ఉద్యమం లోకి వారిని తీసుకురాగలం. కానీ ఉమ్మడి ఉద్యమం కూడా అణచివేతకు గురవుతున్న విభాగాల నిర్దిష్ట సమస్యలను చేపట్టడంలో చైతన్యంతో, క్రియాశీలంగా ఉండాలి. సామాజికంగా అణచివేతకు గురవుతున్న విభాగాలలో పని చేస్తున్న సంస్థలు మాత్రమే వారి సమస్యలను చేపట్టాలనడం తిరగేసిన అస్తిత్వ రాజకీయాలే. ఈ ప్రజలలో మనం ఐక్యంగా, సమన్వయంతో చేసే పని సఫలమైతే, వారు అస్తిత్వ రాజకీయాలను తిరస్కరించి, విశాల ప్రజాస్వామ్య, వర్గ ఉద్యమాలలో ఒక భాగంగా ఒక విశాల చైతన్యాన్ని పొందుతారు.

దళితుల, గిరిజనుల, స్త్రీల, మైనారిటీల సమస్యలను పార్టీ, వామపక్షాలూ పరిగణనలోకి తీసుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పనవసరం లేదు. ఈ సామాజిక విభాగాలు వామపక్షాలతో సహజ భాగస్వాములు కావలసినవి. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్నీ, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్నీ సమర్థవంతంగా జోడించడం వామపక్షాల వ్యూహాత్మక కర్తవ్యం.

2. ఒక బలమైన హిందుత్వ అస్తిత్వాన్ని నిర్మించే ఆరెస్సెస్ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటానికి సంబంధించి, మతాన్ని రాజకీయాల నుంచి విడదీయడానికీ, లౌకికవాద సూత్రాల కోసమూ మనం రాజీలేని వైఖరిని తీసుకోవాలి.
3. హిందుత్వ మతతత్వ అస్తిత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో, ఈ అస్తిత్వం మనువాద పునాది మీద ఆధారపడి ఉందని మనం నిరంతరం

నొక్కి చెప్పాలి. మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం మనం చేసే పనిలాగానే, మన ప్రచారంలోనూ, పనిలోనూ, పోరాటంలోనూ హిందుత్వ అస్తిత్వవాద కులతత్వ, పితృస్వామ్య విధానాన్ని ఎత్తి చూపాలి. హిందుత్వ అంటే ఏమిటో అర్థం చేసుకుని పోరాడేలా, మత విశ్వాస పరంగా హిందువులుగా ఉన్న విశాలమైన కార్మికులకు విశదపరచాలి. పెట్టుబడిదారుల, కుల అణచివేతదారుల పాలనను కొనసాగించడానికి హిందూ ఐక్యత అని చెప్పబడేదాని పునాదిని బద్దలు కొట్టాలి.

4. నిరుద్యోగ సమస్యతో నిరాశలో ఉన్న యువతను అస్తిత్వ రాజకీయాలు, ముఖ్యంగా సంఘ్ పరివార్ ఆచరిస్తున్న హిందుత్వ మతతత్వ అస్తిత్వ రాజకీయాలు, ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. వివిధ రకాల సంకుచిత అస్తిత్వ రాజకీయాలను ప్రతిఘటించడానికీ, కుల, జెండర్ అణచివేతకు వ్యతిరేకంగా సామాజిక న్యాయ పతాకాన్ని లేవనెత్తడానికీ మన పార్టీలోనూ, సాధారణ ప్రజాస్వామ్య ఉద్యమంలోనూ ఉన్న విద్యార్థులూ, యువతా ఒక ముఖ్యమైన, ప్రత్యేకమైన పాత్రను పోషించాలి.

# హిందుత్వ మతోన్మాదం

**మ**తోన్మాదం ఆధునిక యుగంలో ఒక రాజకీయ దృగ్విషయం. మతం పేరుతో వ్యవహరించే రాజకీయమే మతోన్మాదం. రాజకీయ సమీకరణలకు అది మత అస్తిత్వాన్ని ఉపయోగిస్తుంది. సామాజిక జీవితాన్ని మతతత్వీకరణం చెయ్యడం ద్వారా అది మోసపూరితంగా మతాన్నీ, మత అస్తిత్వాన్నీ రాజకీయ లక్ష్యాలను సాధించడానికి ఉపయోగించుకుంటుంది.

మతోన్మాదం అనే పదం మత సమూహాల మధ్య సంఘర్షణల మీద ఆధారపడి, మత కలహాలను రెచ్చగొట్టే భావజాలాన్ని సూచిస్తుంది. మన సమాజంలో మత సంఘర్షణా, మతతత్వమూ శాశ్వతంగా ఉండేదేననీ మన దేశంలో చాలామంది నమ్ముతారు. ఇది గతంలో ఉంది, భవిష్యత్తులో కూడా ఉంటుంది. మత సమూహాల మధ్య సంఘర్షణల వలనా, మత పునాది మీద ప్రజలు చీలిపోవడం వలనా రాజకీయంగానూ, ఇతరత్రానూ లాభపడే మతోన్మాదశక్తులు ఈ నమ్మకాన్ని బలపరుస్తాయి, ప్రచారం చేస్తాయి.

ఇది చాలా అచారిత్రకమైన అవగాహన. మతతత్వం భారతదేశంలో 19వ శతాబ్దపు మధ్యభాగంలో ఉనికిలోకి వచ్చింది. 20వ శతాబ్దంలో మరింత తీవ్రమై విస్తరించింది. అంతకుముందు, కేవలం మత పునాది వలన రూపు దిద్దుకున్న అస్తిత్వాలు, అంటే ఒక స్పష్టమైన ఆకారంతో ఒక దాని నుంచి ఒకటి ప్రత్యేకంగా ఉండే మత అస్తిత్వాలు, దాదాపు లేవు. ప్రజలు భిన్న మత విశ్వాసాలతో ఉండేవారు, ఒకరితో ఒకరు కలిసి మెలిసి ఉండేవారు. స్పష్టంగా భిన్న మతాలకు చెందినవారికి కూడా అనేక ఉమ్మడి సాంస్కృతిక, పూజా సంబంధమైన అంశాలూ, ఆచారాలూ ఉండేవి. విభజన రేఖలు అస్పష్టంగా ఉండేవి.

వలస ప్రభుత్వమూ, దాని విధానాలూ, ఆ విధానాలకు వ్యతిరేకతా, ప్రతిఘటనా మత అస్తిత్వాలు అభివృద్ధి చెందడానికీ, ఘనీభవించడానికీ కారణాలు. ఈ ప్రక్రియలను రెండు పక్షాలూ  అంటే ఒక పక్క వలస ప్రభుత్వం, మరో పక్క ఆ వలస ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న శక్తులు ఉద్దేశపూర్వకంగా ప్రోత్సహించాయి, బలపరిచాయి.

బ్రిటిష్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అమలుపరచిన వివిధ విధానాలు మతం మీద ఆధారపడిన అస్తిత్వాలు మరింత బలపడడానికి దారి తీయడం మాత్రమే

కాక క్రియాశీలంగా మతాల మధ్య అనైక్యతనూ భేదాలనూ ప్రోత్సహించాయి. ఉదాహరణకు, ప్రజల ఆందోళనలు భారతీయులకు కొంత ప్రాతినిధ్యం ఇచ్చేలా ఒత్తిడి తీసుకువచ్చినప్పుడు, మత కమ్యూనిటీలకు రిజర్వు చేసిన సీట్లకు ఓటింగు మత ప్రాతిపాదిక మీద జరిగేలా బ్రిటిష్ ప్రభుత్వం జాగ్రత్తపడింది. పర్యవసానంగా, నియంత్రిత ప్రజాస్వామీకరణ ప్రక్రియ మత భావనల పెరుగుదలకు తోడ్పడింది.

బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జాతీయ భావాలు మొలకెత్తుతున్న ఈ సమయంలో, మూడు ముఖ్యమైన మతతత్వ సంస్థలు – 1915లో ముస్లిం లీగ్, హిందూ మహాసభలు, 1925లో ఆరెస్సెస్ – ఆవిర్భవించాయి.

**ముస్లిం లీగ్, హిందూ మహాసభ, ఆరెస్సెస్‌ల ఆవిర్భావం**

జాతీయోద్యమ ఆవిర్భావమూ, దానికి బ్రిటిష్ ప్రభుత్వ స్పందనా, 1905లో ఢాకాలో ఆగా ఖాన్ నాయకత్వాన ఒక ముస్లిం భూస్వాముల గ్రూపు ముస్లిం లీగ్‌ను ఏర్పాటు చెయ్యడానికి దారి తీసింది. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలూ, ప్రాతినిధ్యమూ కావాలని లీగ్ వాదించింది. ఈ డిమాండుకు బ్రిటిష్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అనేక మెలికల తర్వాత, అంతిమంగా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా 1935 చట్ట ప్రకారం హిందువులకూ, ముస్లింలకూ ప్రత్యేక నియోజకవర్గాల ప్రాతిపాదికన 1937లో రాష్ట్రాల అసెంబ్లీలకు, కేంద్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి.

అదే సమయంలో, 1906లో పంజాబ్‌తో ప్రారంభించి అనేక రాష్ట్రాలలో హిందూ సభలు ఏర్పడ్డాయి. చివరకు 1915లో హిందూ మహాసభ ఏర్పడింది. హిందూ సమాజాన్ని సంస్కరించే ఉద్దేశంతో ప్రారంభమైన ఆర్య సమాజ్ ఉద్యమం త్వరలోనే హిందువులనూ, హిందూయిజాన్ని 'రక్షించే' కార్యక్రమంలో చేరిపోయింది. ఆర్య సమాజ్ సంస్థే 1909లో పంజాబ్‌లో హిందూ సభను ప్రారంభించింది.దాని ముఖ్య నాయకులలో ఒకరైన లాలా లజపతి రాయ్ ఆ సభలో ప్రసంగిస్తూ '....హిందువులు తమంతట తామే ఒక 'జాతి (nation)' అన్న విషయంలో సందేహానికి ఆస్కారం లేదు. ఎందుకంటే వారు తమదైన ఒక తరహా నాగరికతకు ప్రతినిధులు' అన్నాడు.

1915లో అనేక సభలు ఏకమై హిందూమహాసభ ఏర్పడింది. కొన్ని సంవత్సరాల పాటు హిందూ మహాసభ కాంగ్రెసులో పని చేస్తూ ఆ పార్టీ మీద ఒత్తిడి తీసుకు వచ్చే గ్రూపుగా పని చేసింది. లాలా లజపతిరాయ్‌తో పాటు రాజేంద్ర ప్రసాద్, మదన్ మోహన్ మాలవ్యా లాంటి కొందరు ప్రముఖ కాంగ్రెసు నాయకులకు హిందూ మహాసభతో సంబంధాలుండేవి.

సహాయ నిరాకరణ ఉద్యమంతో 'ఖిలాఫత్'ను జోడించడమూ, ఆలీ సోదరులకు ప్రాముఖ్యత నివ్వడమూ, మలబార్‌లో మోప్లా ఉద్యమం విరుచుకు పడడమూ, 1922లో గాంధీ హఠాత్తుగా ఉద్యమాన్ని విరమించిన తర్వాత సంయుక్త రాష్ట్రాలలో (యునైటెడ్ ప్రావిన్సెస్) మత సంఘర్షణలూ – మహాసభ తన భావజాలాన్ని ధృఢతరం చెయ్యడానికి తోడ్పడ్డాయి. ముస్లింలతో పోల్చి చూస్తే హిందూ సమాజ బలహీనత గురించీ, న్యూనత గురించీ సభ నాయకుల రాశారు. హిందువులలో ఉన్న అనైక్యత గురించీ, ముస్లింలలో శిలా సదృశంగా ఉన్న ఐక్యత, సంఘీభావాల గురించి మాట్లాడారు. తాము 'బాధితులం' అనే భావన మరింత సంఘీభావానికీ, 'ఇతరుల'ను వేరుపరచడానికీ అవసరం. ముస్లింలు క్రమం తప్పకుండా మసీదులలో సమీకృతమవుతుంటే, హిందువులు కలవడానికి ఉమ్మడి స్థలం ఏదీ లేదనే వాస్తవాన్ని నొక్కి చెప్పారు. ఈ ఆరోపణకు స్పందనగా పారిశ్రామికవేత్త బిర్లా కుటుంబం ప్రధాన నగరాలలో 'బిర్లా మందిరాలు' నిర్మించింది. ప్రారంభం నుండి హిందూ మత సంస్థలు ప్రముఖ పారిశ్రామికవేత్తల నుండి ఎటువంటి ఆర్థిక సహాయాన్ని అందుకుంటున్నాయో అర్థం చేసుకోవడానికి ఇది కూడా ఒక ఉదాహరణ.

**హిందుత్వ భావజాలం**

భవిష్యత్తులో (1937–42) హిందూ మహాసభ అధ్యక్షపదవిని అలంకరించబోతున్న వినాయక్ దామోదర్ సావర్కర్ 1923లో 'హిందుత్వ : హిందువు ఎవరు?' అనే రచనను ప్రచురించాడు. ఈ రచనలో ఆయన 'ఆ విధంగా ఊహకందని కాలం నుండీ ఈ భూమికీ, ఈ భూమి మీద నివసించిన ప్రజలకూ హిందూ అనే పేరు ఉంటూనే ఉంది. వేదాలలో ఉన్న సింధూ కూడా తర్వాతి కాలానిది, హిందూ పదం యొక్క రెండో రూపం' అని రాశాడు. 'సింధు నదిని మహ్మద్ ఘజ్నీ దాటిన రోజునుండీ జీవన్మరణ పోరాటం ప్రారంభమైంది.' 'తను కాని దానితో సంఘర్షణలోనే తన గురించి చేతన కలుగుతుంది' అని అతను రాశాడు.

ఎవరు హిందుత్వకు నిబద్ధులు? అన్న విషయం గురించి సావర్కర్ ఈ విధంగా చెప్పాడు : ... సింధునది నుండి సింధునది దాకా, ఇండస్ నుండి సముద్రాల దాకా విస్తరించిన భూమిని తమ పితృభూమిగా ప్రేమించే, పర్యవసానంగా ప్రాచీన సప్త సింధుల నుండి ఉద్భవించిన జాతి రక్తానికి వారసుడిగా....హిందుత్వ యొక్క రెండు ముఖ్య ఆవశ్యకతలను కలిగి ఉన్నారనవచ్చు....మన మహమ్మదీయ, క్రిస్టియన్ దేశవాసులలో కొందరు హిందువులు కారు, వారిని హిందువులుగా గుర్తించలేము. హిందువుకు పితృదేశమైనట్లే వారికి హిందూస్థాన్ పితృదేశమైనా, ఇది

వారి పవిత్ర భూమి కూడా కాదు...వారి ప్రేమ విభజింపబడింది.....తమ ప్రేమలోనూ, విధేయతలోనూ వారిలో ప్రతీ ఒక్కరూ వారి పవిత్ర భూమిని పితృభూమి కంటే ఉన్నత స్థానంలో ఉంచి తీరాలి.' ఆ తర్వాత అతను హిందువులలో కలవడాన్ని అంగీకరించడానికి క్రిస్టియన్లకూ, ముస్లింలకూ తమ తల్లిని తమ పితృదేశంగా (పితృభూ), పవిత్ర భూమిగా కూడా (పుణ్యభూ) గుర్తించమని చెబుతాడు. ఆ విధంగా సావర్కర్ దృష్టిలో జాతీయత అనేది మత విశ్వాసం యొక్క ఒక గుణం. ఎందుకంటే పౌరులుగా అంగీకరించబడడానికి అతను ముస్లింలకూ, క్రిస్టియన్లకూ విధిస్తున్న నిబంధనలను తమ మత విశ్వాసాలను వదులుకోకుండా వారు అంగీకరించడం సాధ్యం కాదు.

1923లో మదన్ మోహన్ మాలవ్యా ముస్లిం దురాగతాల నుండి హిందువులను కాపాడడానికి ఒక హిందూ సంస్థ ఏర్పడాలని ప్రతిపాదించాడు. డా. ముంజే (ఆరెస్సెస్ స్థాపకుడైన హెడ్గేవార్ గురువు) హిందూ బాలికలను రక్షించడానికి హిందూ సంస్థలను ఏర్పాటు చెయ్యడం గురించి మాట్లాడాడు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, గాంధీ ఈ ప్రతిపాదనలకు తన అభ్యంతరాన్ని తెలిపాడు.

1923లో నాగపూర్ లో మత సంఘర్షణ ఒకటి చెలరేగింది. హిందూ యువతకు శారీరక, సైద్ధాంతిక శిక్షణను ఇవ్వడానికి హెడ్గేవర్ సంస్థలను ప్రారంభించాడు. 1925లో, విజయ దశమి నాడు, హిందూ మహాసభ సభ్యులైన మరో నలుగురు బ్రాహ్మణులతో కలిసి అతను, స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడడానికి కాక, కేవలం హిందువులను రక్షించడానికి ఆరెస్సెస్ ను స్థాపించినట్లు ప్రకటించాడు. అతన్ని ఆ సంస్థ యొక్క సర్సంగ్ చాలక్ (అధిపతి)గా నియమించడం జరిగింది. దేశ స్వాతంత్ర్యం కొరకు జరుగుతున్న పోరాటం ఊపందుకుంటున్న సమయంలో ఆరెస్సెస్‌ను స్థాపించడమూ, అది అభివృద్ధి చెందడమూ జరిగింది. ఆరెస్సెస్ నేడు తన హీరోలుగా కీర్తిస్తున్న భగత్ సింగ్ తదితర విప్లవకారుల కార్యకలాపాలు ఆరెస్సెస్ స్థాపన జరిగిన తదుపరి సంవత్సరాలలో శిఖరాన్ని చేరుకున్నాయి. కానీ ఆరెస్సెస్ అప్పుడు వారికి ఏ రకమైన సహకారాన్నీ ప్రకటించలేదు. భగత్‌సింగ్‌ను విడుదల చెయ్యాలని ఆందోళన చెయ్యలేదు, అతన్ని ఉరితీయడాన్ని ఖండించనూ లేదు. ఆరెస్సెస్, హిందూ మహాసభలు జాతీయోద్యమాన్ని ఎప్పుడూ హేళన చేస్తూనే ఉండేవి. సామ్రాజ్యవాదంతో పోరాడుతున్న జాతీయవాదుల్లో విప్లవకారులూ, కాంగ్రెసువారూ, సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ ఉండేవారు. అందరూ సమాన పౌరులుగా జీవించగల ఒక స్వతంత్ర దేశం కోసం జరిగిన జాతీయోద్యమం విజయవంతంగా అన్ని కులాల, మతాల, ప్రాంతాల, భాషల, ప్రజలను ఆకర్షించ గలిగింది. కానీ ఆరెస్సెస్ హిందువులకు మాత్రమే ఇండియా /

భారత్ పౌరహక్కులు ఉండాలనీ, భారత సమాజానికి మనుస్మృతి నిర్మాణాత్మక చట్రాన్నిస్తుందనీ విశ్వసించింది. ఆ కారణంగా ఆరెస్సెస్ సమాన పౌరసత్వ హక్కులను అనేక మంది భారతీయులకు నిరాకరించింది.

మహారాష్ట్రలో ఊపందుకుంటున్న కుల వ్యతిరేక పోరాటానికి ఆరెస్సెస్ నిర్మాణం ఒక స్పందన కూడా. జ్యోతీరావు పూలే (1887-1890) సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించగా, బ్రాహ్మణ హిందూయిజానికి వ్యతిరేకంగా దళితులను మేల్కొల్పడానికి, ఆర్గనైజ్ చెయ్యడానికి డా. బి.ఆర్. అంబేద్కర్ తన ఉద్యమాన్ని ప్రారంభించారు. 1936లో బహిరంగంగా మనుస్మృతిని తగలబెట్టారు. ఆరెస్సెస్ దృష్టిలో వర్ణాశ్రమ ధర్మమూ, హిందూ ధర్మమూ విడదీయలేనివి.

మొదటినుండీ ఆరెస్సెస్ ఆలోచనను ప్రభావితం చేసిన విషయం మరొకటి - 1917లో బోల్షివిక్ విప్లవం, సోవియట్ యూనియన్‌లో ఒక కొత్త తరహా సమాజం ఏర్పడడం వలన సంభవించిన చారిత్రక మార్పు. కార్మిక వర్గమూ, గ్రామీణ పేదలూ, భూమిలేని వారూ జార్ ప్రభువునూ, ఫ్యూడల్ భూస్వాములనూ కూలద్రోయడం, సామాజిక ఆర్థిక దోపిడీ మీదా, పుట్టుకతో ఏర్పడే అసమానత మీదా ఆధారపడిన నిచ్చెనమెట్ల సమాజానికి బద్ధులైన ఆరెస్సెస్ వంటి సంస్థలలో తీవ్రమైన ద్వేషాన్నీ, వ్యతిరేకతనూ రగిలించింది.

ఆరెస్సెస్ ప్రాథమిక యూనిట్ అయిన శాఖలలో శారీరక శిక్షణను ప్రవేశపెట్టడంతోనూ, బ్రిటిష్ పోలీసులను అనుకరిస్తూ ఖాకీ నిక్కర్లు ధరించడంతోనూ సంస్థలో సైనిక అంశాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

1930లో ఆరెస్సెస్ స్థాపకులలో ఒకరు, హిందూ మహాసభ నాయకుడు అయిన మూంజే ఇటలీలో ముస్సోలినీని కలిశాడు. ఇటాలియన్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటాలియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది మిడిల్ అండ్ ఫార్ ఈస్ట్ కూ, కలకత్తా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకీ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ముఖర్జీ తరువాత మహాసభలో చేరాడు. 1938లో హిట్లర్ జర్మనీ సుడెటన్ లాండును ఆక్రమించడాన్ని సావర్కర్ ప్రశంసించాడు.

సర్ సంఘ్ చాలక్ గా హెడ్గెవార్ తరువాత వచ్చిన గోల్వాల్కర్ 1939లో 'మనమూ లేదా మన జాతీయత నిర్వచనం' అనే తన ప్రసిద్ధ గ్రంథంలో ఆరెస్సెస్ భావజాల చట్రాన్ని విశదపరిచాడు. 'జాతి యొక్కా, దాని సంస్కృతి యొక్కా స్వచ్ఛతను కాపాడడానికి జర్మనీ తన దేశాన్నుంచి సెమిటిక్ జాతులను - యూదు మతస్తులను - ప్రక్షాళన చేసి ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. ఒకే దేశంలో (whole) ఐక్యతతో జాతులూ, సంస్కృతులూ కలిసిపోవడం ఎంత అసాధ్యమో కూడా జర్మనీ చూపించింది.

హిందూస్తాన్‌లో మనం ఈ పాఠాన్ని నేర్చుకుని లాభపడాలి' అని రాశాడు. 'హిందూస్తాన్‌లో నివసిస్తున్న విదేశీ జాతులు హిందూ సంస్కృతినీ, భాషనూ అంగీకరించాలి, హిందూ మతాన్ని గౌరవించడమూ, ఆరాధించడమూ నేర్చుకోవాలి, హిందూ జాతినీ సంస్కృతినీ కీర్తించడం తప్ప మరేవిధమైన భావనలూ ఉండకూడదు.... లేదా ఏమీ కోరకుండా, ఏ విశేషాధికారాలు లేకుండా, ప్రాధాన్యతలు లేకుండా – పౌర హక్కులు కూడా లేకుండా – హిందూ జాతికి పూర్తిగా లోబడి దేశంలో నివసించాలి' అని రాశాడు. సావర్కర్ 'హిందుత్వ' ప్రభావం చాలా స్పష్టంగా మనకు కనిపిస్తుంది.

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు క్రిస్టోఫర్ జెఫ్రెలో ఆరెస్సెస్ గురించి ఇలా వర్ణించాడు: హిందూ జాతివాద దృక్కోణం నుంచి, ముస్లింలు 'ఇతరులను బెదిరించే' పాత్రలో ఉంటే, బ్రిటిష్ వలసపాలకులు 'అనుకరించదగిన ఇతరుల'కు ప్రాతినిధ్యం వహించారు.

**రెండు దేశాల సిద్ధాంతం - దేశ విభజన**

పైన పేర్కొన్న మూడు సంస్థలూ - ముస్లిం లీగ్, హిందూ మహాసభ, ఆరెస్సెస్ – దేశ విభజనకు ముందటి దశాబ్దాలలో విశేషంగా పెరిగాయి. ఈ సంస్థలన్నింటికీ రెండు దేశాల సిద్ధాంతంలో విశ్వాసం ఉంది. హిందూ ముస్లింలు చెరో ధృవంలోనూ ఉండేలా చెయ్యడానికి, దేశ విభజననూ బలపరిచే ఉద్యమాలను ఈ సంస్థలు నడిపాయి. ప్రజలను సమీకరించాయి. 1909లో పంజాబ్‌లో ప్రసంగిస్తూ లాలా లజపత్ రాయ్ '...హిందువులు తమకు తామే ఒక 'జాతి' అన్న విషయంలో సందేహం ఉండనవసరం లేదు. ఎందుకంటే తమదైన ఒక తరహా నాగరికతకు వారు ప్రతినిధులు' అన్నాడు. ఇవే భావాలను సావర్కర్ పునరుద్ఘాటించాడు. హిందూ మహాసభ 19వ సమావేశంలో ప్రసంగిస్తూ, 'భారత దేశంలో ఒకదాని పక్కన ఒకటి నివసించే రెండు వైరుధ్యపూరితమైన జాతులున్నాయి...ప్రధానంగా రెండు జాతులు (nations) ఉన్నాయి : హిందువులు, భారతదేశంలో ఉన్న ముస్లింలు' అన్నాడు. ఈ భావనను మహాసభ అంగీకరించింది. ఈ భావాలను ఆరెస్సెస్ ఎన్నడూ ఖండించలేదు.

1940లో లాహోర్ సమావేశంలో ముస్లిం లీగ్ 'పాకిస్తాన్ తీర్మానాన్ని' ఆమోదించింది. 1943 ఆగస్టు 15న నాగపూర్ లో ప్రసంగిస్తూ, **"రెండు దేశాల సిద్ధాంతం గురించి జిన్నాతో నాకు వివాదం ఏమీ లేదు. మనం హిందువులం మనంతట మనమే ఒక దేశం. హిందువులు, ముస్లింలు రెండు జాతులన్నది ఒక చారిత్రక సత్యం"** అని సావర్కర్ అన్నాడు.

రెండు దేశాల సిద్ధాంతంలో ఈ మూడు సంస్థల మధ్య అభిప్రాయాలు

కలవడం మనకు ఆశ్చర్యాన్ని కలిగించకూడదు. ఈ సంస్థలన్నీ మతం పేరుతో ప్రజలను విడదీయడానికి కంకణం కట్టుకున్నవే. ఈ మూడు సంస్థలూ మతతత్వం వలన చాలా లాభపడ్డాయి. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల వారి వ్యతిరేకత చాలా తక్కువే. ఈ సంస్థలు ఒకదానినొకటి ఎప్పుడూ విమర్శించుకోలేదు, కానీ లౌకికవాదానికి కట్టుబడ్డవారి పట్లా, కాంగ్రెస్ పట్లా విషం కక్కేవి. బెంగాల్‌లో ముస్లిం లీగూ, హిందూ సహా సభా కలిసి ఒక సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి కూడా. దేశ విభజన ప్రక్రియ కారణంగా తలెత్తిన మత హింస వలనా, మతం పేరుతో ప్రజలను విడదీయడం వలనా ఈ మూడు సంస్థలూ గణనీయంగా లాభపడ్డాయి. ఈ రోజు వరకూ కూడా ఇవి లాభపడుతూనే ఉన్నాయి.

**స్వతంత్రం తర్వాత ఆరెస్సెస్, హిందూ మహాసభలు**

సంస్థాగత నెట్‌వర్క్‌కు ఇచ్చిన ప్రాముఖ్యత వలన స్వతంత్రానికి కొద్ది కాలం ముందూ, స్వతంత్రం వచ్చిన తర్వాతా, ఆరెస్సెస్ కొంత లాభపడగలిగింది. ఆరెస్సెస్‌తో పోల్చి చూస్తే మహాసభ అంత పటిష్టమైన సంస్థ కాదు.

తన శాఖల, ప్రచారక్‌ల నెట్‌వర్క్ ద్వారానూ, పాకిస్తాన్ నుండి వచ్చిన కాందిశీకులలో చేసిన కృషి ద్వారానూ, ఉత్తర భారతదేశంలో అనేకమంది హిందువుల మనస్సులలో ఆరెస్సెస్ ఒక 'హిందూ' సంస్థగా గుర్తింపు పొందింది. స్వాతంత్ర్య పోరాటంలో ఏ పాత్రనూ పోషించకపోయినా, వాస్తవానికి ఆ పోరాటాన్ని వ్యతిరేకించినా, ఆరెస్సెస్ ఈ గుర్తింపును పొందగలిగింది. గాడ్సే మహాత్మా గాంధీని హత్య చెయ్యడమూ, ఈ హత్య కోట్లమంది ప్రజల మనస్సులలో కలిగించిన తీవ్రమైన ఏవగింపూ, హత్య తరువాత ప్రభుత్వ నిషేధమూ, ఆరెస్సెస్ కున్న మద్దతు చాలా మటుకు క్షీణించడానికి దారి తీశాయి. మత సంస్థలను అణచి వెయ్యడంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలు సమర్థవంతంగా ఉంటాయని ఇది వెల్లడిస్తుంది. గాంధీజీని హత్య చెయ్యడంలో పాత్ర ఉన్న వ్యక్తులందరినీ భారత ప్రభుత్వం అరెస్టు చెయ్యలేదు. ఆరెస్సెస్ చేసిన తప్పుడు వాగ్దానాలనూ, కృత్రిమ విన్నపాలనూ భారత ప్రభుత్వం అంగీకరించినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వం త్వరలోనే ఈ నిషేధాన్ని ఎత్తివేసింది.

ఆ కాలం నాటి ఉద్రిక్త వాతావరణంలో, గాడ్సే హేయమైన చర్య పట్ల లోలోపల ఒక సానుభూతి ఉంది. దేశ విభజన ఎందువలన జరిగిందో తన వ్యాఖ్యానాన్ని ఆరెస్సెస్ వెల్లడించిన తర్వాత, కాంగ్రెస్ 'మైనారిటీలను' బుజ్జగిస్తున్నదని ప్రచారం ఉధృతంగా చెయ్యడం ప్రారంభించిన తర్వాత, గాడ్సే పట్ల సానుభూతి మరింత పెరిగింది.

ఈ కాలంలో, 1949లో భారత రాజ్యాంగాన్ని ఆమోదించడం జరిగింది. రాజ్యాంగాన్ని రచించడంలోనూ, ఆమోదించడం లోనూ డా. అంబేద్కర్ ఒక మహత్తర

పాత్రను పోషించారు. రాజ్యాంగం మీద ఒక బలమైన ముద్ర వేశారు. ప్రజాస్వామ్య సూత్రాలూ, సామాజిక, జెండర్ సమానత్వమూ, లౌకికవాదం పట్ల ఒక నిబద్ధతా – ఈ రాజ్యాంగం యొక్క ముఖ్య లక్షణాలు. రాజ్యాంగం పట్ల తన పూర్తి వ్యతిరేకతనూ, భారతదేశంలో చట్టానికి మనుస్మృతి ఒక్కటే ఆమోదయోగ్యమైన పునాదిగా తను కట్టుబడి ఉండడాన్నీ ఆరెస్సెస్ ఎన్నడూ దాచలేదు.

1940–1973ల మధ్య గోల్వాల్కర్ సర్ సంఘ్ చాలక్‌గా ఉన్నాడు. అతని ప్రసంగాల సంగ్రహాన్ని 'పాంచజన్యం' - Bunch of Stray Thoughts 1960లో ప్రచురించారు. ఈ ప్రసంగాలలో వెల్లడించిన అభిప్రాయాలూ, సిద్ధాంతాలూ సంఘ్ పరివార్ భావజాలానికి పునాదిగా ఉపయోగపడ్డాయి. అతను ముస్లింల పట్ల ద్వేషాన్ని రగుల్కొల్పవలసిన అవసరం గురించి చెబుతూనే, 'మన జీవితం యొక్క మత, సామాజిక నిర్మాణాన్ని కూల్చివేయడమే కాకుండా, వివిధ ప్రాంతాలలో, సాధ్యమైతే దేశమంతటా, రాజకీయ ప్రాబల్యాన్ని సాధించడానికి' ఒక అంతర్జాతీయ కుట్రలో భాగంగా క్రిస్టియన్ల గురించి కూడా చెప్పాడు. అతని అవగాహన ప్రకారం, మూడో శత్రువు కమ్యూనిజం. అతను తరచు దేవుడంటే విశ్వాసం లేని కమ్యూనిస్టుల గురించీ, సంఘ్ పరివార్ లక్ష్యాలకు కమ్యూనిస్టుల నుండి ఎదురవుతున్న ప్రమాదం గురించీ మాట్లాడాడు.

గోల్వాల్కర్ సర్సంఘ్ చాలక్‌గా ఉన్న సుదీర్ఘకాలంలో ఆరెస్సెస్, సంఘ్ పరివార్‌లూ పెరిగాయి, వాటి ప్రభావమూ క్రమంగా పెరిగింది. గిరిజనులలోనూ, విద్యార్థుల లోనూ, యువతలోనూ, స్త్రీలలోనూ, హిందూమత విభాగాల అధిపతుల లోనూ, దేవాలయాలలోనూ, ఆశ్రమాలు మొదలైనవాటిలోనూ, కార్మికులూ రైతుల లోనూ, రాజకీయ రంగంలోనూ, ఆరెస్సెస్ అనేక సంస్థలను ఏర్పాటు చేసింది. మొదట జన సంఘ్ ఆరెస్సెస్ రాజకీయ విభాగంగా ఉండేది. అనేక రాజకీయ ప్రయోగాల తర్వాత భారతీయ జనతా పార్టీ చిన్నగా ప్రారంభమై, కొన్ని అపజయాలను చవిచూసి, ఈ నాడు రాజకీయంగా సర్వోన్నతస్థానాన్ని పొందగలిగింది. ఆరెస్సెస్ మాత్రం ఏకదీక్షతో హిందూ రాష్ట్ర ఏర్పాటు గురించి కృషి చేసింది. హిందూ రాష్ట్ర ఏర్పడాలంటే మెజారిటీ మతంలోని అనేక విభాగాలను ఒక బలమైన హిందు అస్తిత్వం క్రింద సంఘటితం చెయ్యాలి. కానీ ఈ సంఘటనలో అసమానత కొనసాగుతూనే ఉంటుంది.

అనేక ఎత్తుగడలూ, పద్ధతులూ అనుసరిస్తూ ఆరెస్సెస్ గణనీయమైన విజయాలను సాధించింది. ఈ పత్రంలో కొన్నింటి గురించి చెప్పుకుందాం.

**హింస**

ఆరెస్సెస్ భావజాలంలో హింస ఎప్పుడూ కేంద్ర స్థానంలో ఉంటుంది.

ఆరెస్సెస్ పుట్టినప్పటినుండీ ఒక ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను ఎంచుకుని హింసకు పాల్పడడం జరుగుతూనే ఉంది. మత కలహాలలో అది హింసకు పాల్పడుతుంది. ఈ మత కలహాలు చెలరేగడానికి తరచు ఆరెస్సెసే బాధ్యురాలు. తాను నిర్వచించిన 'శత్రువు'కు వ్యతిరేకంగా హింసకు పాల్పడమని అది హిందువులకు బోధిస్తుంది.

దేశ విభజన సమయంలో ఆరెస్సెస్ సభ్యులు అనేక హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన తక్షణమే అత్యంత హేయమైన హింసాత్మక చర్య – మహాత్మా గాంధీ హత్య – ఆరెస్సెస్ సభ్యులలో ఒకరి ద్వారా జరిగింది.

ఆరెస్సెస్ ప్రతీ రోజూ శాఖలలో డ్రిల్లు చేయించడమూ, లాఠీలు ఉపయోగించడమూ ప్రోత్సహిస్తుంది. ఎంపిక చేసిన యువకులకు ఆయుధాలు ప్రయోగించడంలో శిక్షణ ఇస్తుంది. 'శత్రువు'కు వ్యతిరేకంగా హింసను కీర్తిస్తుంది. ఆరెస్సెస్ స్థాపించబడిన రోజు, విజయ దశమి నాడు, బహిరంగంగా ఆయుధ పూజ జరుగుతుంది. తొలి దశాబ్దాలలో ఊరేగింపులలోనూ, సమావేశాలలోనూ ఆయుధాల ప్రదర్శన ఉండేది కాదు. రహస్య శిబిరాలలో ఆయుధ శిక్షణ ఇచ్చేవారు. కానీ ఇటీవలి సంవత్సరాలలో ఆయుధాలు బహిరంగంగా కనిపిస్తున్నాయి. హేతువాద, కుల వ్యతిరేక అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించినందుకు దబోల్కర్, గౌరీ లంకేష్, కాల్బుర్గి, పన్సారేలను హత్య చెయ్యడం జరిగింది. ఈ హత్యలన్నీ సంఘీలు చేసినవే, వారికి శిక్షణను ఇచ్చిన ప్రదేశాన్ని గుర్తించడం కూడా జరిగింది. బాంబుల ప్రయోగం లాంటి టెర్రరిస్టు కార్యకలాపాలతో సంబంధం ఉన్నందుకు అసీమనందా, ప్రగ్యా ఠాకూర్ తదితర ఆరెస్సెస్ కార్యకర్తల మీద ఆధారాలతో నేరారోపణ జరిగింది. ఆరెస్సెస్ కేడర్ దశాబ్దాలుగా కేరళలో కమ్యూనిస్టులను హత్య చేస్తూనే ఉన్నారు. స్వతంత్రం తర్వాత హింసను ప్రేరేపించడంలోనూ, హింసలో పాల్గనడంలోనూ ఆరెస్సెస్ పాత్ర గురించి వివిధ కమిషన్లు తమ నివేదికలలో వివరంగా పేర్కొన్నాయి. డా. అంబేద్కర్ వర్థంతి సందర్భంలో 1992లో బాబ్రీ మసీదును కూల్చివేయడం అంబేద్కర్ రాజ్యాంగం మీద దాడికి ఒక పథకం ప్రకారం చేబట్టిన చర్య. 2002లో గుజరాత్‌లో సంఘ్ పరివార్ నాయకత్వంలో జరిగిన ఒళ్ళు గగుర్పొడిచే హింసాకాండ అందరికీ తెలుసున్నదే.

హిందూ రాష్ట్రను స్థాపించడానికి మార్గంలో ఒక భాగంగా ఈ హింసాత్మక చర్యలన్నీ ఒక పథకం ప్రకారం చేపట్టినవే. వ్యూహంలో భాగంగా, పరివార్ యొక్క వివిధ విభాగాలు ఈ హింసాత్మక చర్యలకు వివిధ రకాలుగా స్పందిస్తాయి. కొంతమంది ఈ హింస పట్ల తమ అసహ్యాన్ని వ్యక్తం చేస్తారు. కొంతమంది ఈ సంఘటనలకు దూరంగా ఉంటారు. కొంతమంది ఈ సంఘటనలకు సంతోషిస్తారు. మనం

గమనించవలసినదేమిటంటే పరివార్ బలం పెరగడానికీ, మెజారిటీ కమ్యూనిటీలో దాని భావజాలం విస్తరించడానికీ, ఆమోదించడానికీ ఈ హింసాపథం కారణమవుతోంది. దీన్ని వివిధ మార్గాలలో సాధించడం జరుగుతుంది. మొదటిది – మైనారిటీల సభ్యులుగా, మద్దతుదారులుగా – ముఖ్యంగా ముస్లింలను – శత్రువులుగా గుర్తించడం. రెండోది – హింస ప్రయోగాన్ని 'సమర్థించడానికి' ఏదో కార్యక్రమాన్నో, సంఘటననో హైలైట్ చెయ్యడం. ఉదాహరణకు, పాకిస్తాన్ ప్రభుత్వానికి బాకీపడ్డ పెద్ద మొత్తాన్ని చెల్లించాలని గాంధీ పట్టుబట్టడం అతని హత్యకు కారణంగా చెప్పినా, స్వయంగా గాడ్సే గాంధీజీని హత్య చెయ్యడానికి వేరే వివరణలు ఇచ్చాడు. అది మాత్రమే కాదు, స్వతంత్రానికి ముందు కూడా గాంధీని హత్య చెయ్యడానికి అతను ప్రయత్నించాడు. గాంధీజీ హత్యకు సంఘ్ చెప్పే కారణాలు అసత్యమని ఇది రుజువు చేస్తుంది. అయినా సంవత్సరాలుగా ఈ ప్రచారం ప్రజల అవగాహనను ప్రభావితం చేస్తూనే ఉంది.

గాంధీజీని హత్య చెయ్యడానికి గాడ్సే ఇచ్చిన వివరణా, స్వతంత్రానికి ముందు కూడా గాంధీజీని హత్య చెయ్యడానికి అతను ప్రయత్నించాడనే వాస్తవమూ, పరివార్ చెప్పే 'కారణం' అసత్యమని రుజువు చేస్తుంది. కానీ ప్రజల అవగాహనలో అది కారణంగా అగుపించింది. చాలామంది అది న్యాయమైనదేనని భావించారు. ప్రతీ హింసాత్మక చర్య తర్వాత, హింసకు తనను బాధ్యురాలుగా ఆరోపించడం జరిగినప్పుడు, పరివార్ ఈ ఎత్తుగడను అవలంబిస్తోంది. ఇటీవలి ఉదాహరణలు – గోద్రాలో రైలు బోగీని తగులబెట్టడం, హిందూ ఊరేగింపుల మీద రాళ్ళు రువ్వడం, ముజఫర్ నగర్ అల్లర్లు మొదలైన వాటి గురించి చెప్పినట్లు, హిందూ బాలికలను వేధించడం మొదలైనవి చెప్పి హింసకు ముస్లింలను (ఒక్కొక్కసారి ఒరిస్సాలోని కాంధామల్‌లో లాగా క్రిస్టియన్లను) బాధ్యుల్ని చెయ్యడం జరుగుతుంది. ఆ కారణంగా హిందువులు ప్రతీకారంగా చేసిన హింస న్యాయమైనదని చెబుతుంది. అన్ని అల్లర్లలోనూ హిందువుల కన్నా ముస్లింలలో ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా సంభవించినా, అధికంగా జైలుపాలయినా, ముస్లింలు 'ఇది ప్రారంభించడం వలన' హిందువులను నిందించకూడదు. వీరోచితంగా ప్రతిఘటించినందుకు హిందువులను కీర్తించాలి. మైనారిటీల మీద జరుగుతున్న హింసాకాండలో అంతకంతకు పెరుగుతున్న సంఖ్యలో హిందువులు, ముఖ్యంగా పేదలూ, వెనుకబడిన, దళిత కులాలకు చెందిన వారూ పాల్గొంటున్నారు. ఇది నేరాల్లో వారిని భాగస్వాములను చెయ్యడం మాత్రమే కాకుండా, వారికి ఒక సాధికారత భావాన్ని ఇస్తుంది. వీరోచిత ప్రతిఘటనా చర్యలలో తాము భాగస్వాములనే భావననిస్తుంది. ఇది మనం గుర్తుంచుకోవలసిన చాలా ముఖ్యమైన

విషయం. బాబ్రీ మసీదు కూల్చివేతలో పాల్గొన్న మురికివాడకు చెందిన ఒక పేద మహిళ ఒక ఇంటర్వ్యూలో అయోధ్యకు తను బయలుదేరుతున్నప్పుడు పూలదండలతోనూ, స్వీట్లతోనూ తనకు వీడ్కోలు చెప్పారనీ, తిరిగి వచ్చినప్పుడు తనను ఒక నాయకురాలిగా ఆహ్వానించారనీ చెప్పింది. ఆమె జీవితంలో అటువంటి అనుభవాలేమీ అంతకుముందు లేవు.

ఆ కారణంగా ఆరెస్సెస్ ఎజెండాలో హింస అనేది ఒక ముఖ్యమైన భాగమూ, స్వభావమూ మాత్రమే కాదు, తన సాధారణ సభ్యుల సంఖ్యను పెంచడానికి ఉపయోగపడే ముఖ్య అంశం. 2014 తర్వాత, అంతులేకుండా ముస్లింలను హత్య చెయ్యడంలో ఓబిసి, దళిత్, ఆదివాసీ కమ్యూనిటీలకు చెందిన యువత పాల్గొనడం మనకు కనుపిస్తుంది. ప్రభుత్వమూ, పోలీసులూ, న్యాయ వ్యవస్థా సహకరించడం వలన కాని, లేదా తటస్థంగా ఉండడం వలన కాని, శిక్షిస్తారనే భయం లేకుండా ఈ హింసాత్మక చర్యలు జరుగుతున్నాయి. పేద, అణచివేతకు గురవుతున్న విభాగాల నుండి మరింతమంది యువకులు హిందుత్వ వైపు ఆకర్షించబడడానికి ఇది ఉపయోగపడుతుంది.

అల్లర్లు మానని గాయాలు చేస్తాయి. ప్రజలు చెరో ధృవంలోనూ పోగుపడేలా చేస్తాయి. అల్లర్లలో పాల్గొన్న, లేదా ప్రేక్షకులుగా నిలిచిపోయిన, లేదా ఈ సంఘటనల గురించి విన్న, వ్యక్తులలో చాలామందిని తమ మత అస్తిత్వానికి దిగజారుస్తాయి. ప్రతీ మత కలహం, పరస్పరం ద్వేషించే, పరస్పరం సంఘర్షించే, మత అస్తిత్వాలను బలపరుస్తుంది. ఇది హిందువుల మీద ఆరెస్సెస్ భావజాల పట్టును బలపరుస్తుంది.

వార్డ్ బెరెన్ షాట్ 'కల్లోల రాజకీయాలు – Riot politics, గుజరాత్ మారణహోమం మీద ఒక ముఖ్యమైన రచన. అతను ఇలా రాశాడు – 'అల్లర్లను ప్రేరేపించడంలోనూ, నిర్వహించడంలోనూ పాల్గొన్న సమూహాలకు తర్వాత జరిగే ఎన్నికల సమయంలో ప్రతిఫలం లభించడం మన మళ్ళీ మళ్ళీ చూస్తున్నాం. గుజరాత్ హింస ఈ నమూనానే ప్రదర్శించింది. అల్లర్లు చెలరేగిన పదినెలల తర్వాత రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో బిజెపి అఖండ విజయాన్ని సాధించింది. అల్లర్లకు గురైన ప్రాంతాలలో బిజెపి తన ఓట్లను 10 శాతానికి పెంచుకోగలిగిందనీ, అల్లర్లు లేని జిల్లాలలో బిజేపీ ఓట్ల వాటా సగటున 3 శాతానికి పడిపోయిందనీ ఎన్నికల ఫలితాల విశ్లేషణ వెల్లడించింది. మత కలహాల ప్రేరణతో ఓటర్లు మత ప్రాతిపాదికన చీలిపోతారని, లభ్యమవుతున్న సాహిత్యంలో అధిక భాగం ఎన్నికల మీద మత కలహాల ప్రభావాన్ని వివరిస్తోంది. ఈ అల్లర్ల ఫలితంగా, ఓటర్లు మరింతగా మత ప్రాతిపాదికన

ఓటుచేస్తారు. అంటే ఒక మత కమ్యూనిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెబుతున్న పార్టీలకు ఓటు చేస్తారు

**ప్రచారం - సమాచార సంబంధాలు**

శాఖల సమావేశాలలో పాల్గొన్న, లేదా పాల్గొంటున్న అనేక మంది ఉదయ కార్యక్రమాలలో 'ఈ రోజు నీలివార్త' (పుకారు) ను కూడా చర్చిస్తారని తరచు చెబుతారు. ఈ నీలివార్తను వివిధ ప్రాంతాలలో, ఎంతమంది వీలుపడితే అంతమందిలో, ప్రచారం చేస్తారు. తన పుట్టుక నుండీ సంఘ్ పరివార్ నీలివార్తలను ప్రచారం చేసి నమ్మించడం, వాస్తవాలను వక్రీకరించడం, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చెయ్యడం మొదలైన కళలలో ఆరితేరింది. ప్రజలను మరింతగా చీల్చడానికీ, మైనారిటీల పట్లా, లౌకికవాదులైన వ్యక్తులు, నాయకులు, సంస్థల పట్లా ద్వేషాన్ని పెంచడానికీ ఈ కళను ఉపయోగిస్తోంది. విశాల ప్రజానీకంలో ఉన్నత స్థాయిలో ఉన్న దురభిప్రాయమూ, అజ్ఞానమూ ఈ విషయంలో సంఘ్‌కు సహకరిస్తున్నాయి.

తన భావజాలాన్ని ప్రచారం చెయ్యడానికి పుస్తకాల, కరపత్రాల ప్రచురణ ఆరెస్సెస్ పనిలో ఒక ముఖ్యమైన భాగం. సంఘ్ పరివార్ ప్రాపంచిక దృక్పథాన్ని ప్రచారం చెయ్యడానికి ఉపయోగపడే మత సంబంధమైన, పాక్షికంగా మత (semi-religious) సంబంధమైన పుస్తకాలను పెద్ద సంఖ్యలో దశాబ్దాలుగా ప్రచురిస్తున్న గీతా ప్రెస్ దీనికి ఒక ఉదాహరణ. పెద్ద సంఖ్యలో వార్తా పత్రికలు, పత్రికలు, కామిక్ బుక్స్, అమర్ చిత్ర కథ లాంటి 'చరిత్ర' పుస్తకాలు మొదలైన వాటి ప్రచురణ ఈ కృషిలో ఒక భాగమే. జనతా పార్టీ ప్రభుత్వంలో యల్.కె. అద్వానీ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ మంత్రిగా ఉన్నప్పుడు, మీడియా సంస్థలలో వివిధ స్థాయిలలో ఆరెస్సెస్ పట్ల సానుభూతి ఉన్న జర్నలిస్టులను పెద్ద సంఖ్యలో నియమించబడేలా చూశాడు. నేడు కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాలలోనూ ఉన్న బిజెపి ప్రభుత్వాలు, ప్రధాన స్రవంతి మీడియాలో – పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలు – అధిక విభాగాలు పూర్తిగా తమ నియంత్రణలో కానీ, లేదా ఆరెస్సెస్ భావజాలంతో ఏకీభవించేవారి ప్రాబల్యంలో కానీ ఉండేట్లు చేశాయి.

తొలి దశాబ్దాలలో మత కలహాలమీదా, అల్లర్ల మీదా ఆరెస్సెస్ ప్రభావంలో ఉన్న మీడియా రిపోర్టులు మెజారిటీ మతానికి చాలా అనుకూలంగా ఉంటూ మైనారిటీ మతాన్ని దోషిగా చిత్రించేవి. ఇది ఇటీవలి సంవత్సరాలలో మరింత ఎక్కువైంది. విదేశీ వ్యవహారాల గురించి రాయడంలో కూడా మత పక్షపాతం కనుపిస్తుంది. ఇజ్రాయల్–పాలస్తీనా వివాదం మొదలైన వాటి గురించీ, పాకిస్తాన్, ఇండో–పాకిస్తాన్

క్రికెట్ ఆటలు మొదలైన వాటి గురించీ రిపోర్టింగు చేసే పద్ధతిలో కూడా ఇది కనుపిస్తుంది. నేడు ఈ పరిస్థితి ఎంత విషమించిందంటే, ప్రసారం అయ్యే దాదాపు ప్రతీ విషయమూ ప్రజల మధ్య విద్వేషాలను పెంచడానికీ, ప్రజలను చీల్చడానికీ ఒక ప్రోత్సాహం అవుతోంది.

సోషల్ మీడియా మీద సంఘ్ నియంత్రణ గురించి చాలామంది రాశారు. మతోన్మాద ఎజెండాను ప్రోత్సహించడం కోసం తప్పుడు వార్తలను రెగ్యులర్‌గా ఉపయోగించడం జరుగుతోంది. మత హింసను రెచ్చగొట్టడానికి వాట్సాప్‌ను ఉపయోగించడం సర్వ సాధారణంగా మారింది.

**చరిత్ర వక్రీకరణ - పాఠ్య పుస్తకాలలో మతతత్వం**

ఆరెస్సెస్ వ్యూహంలో ఇది ఒక ముఖ్యమైన అంశం. ఇదేదో 2014 తర్వాత ప్రవేశ పెట్టబడినది కాదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండీ ఇది రెగ్యులర్‌గా జరుగుతూనే ఉంది. వివిధ విద్యా శాఖలు, ప్రచురణాలయాలు మొదలైనవాటిలో పని చేస్తున్న తన అనుయాయుల ద్వారా దశాబ్దాలుగా ఆరెస్సెస్ సిలబస్‌నూ, పాఠ్యగ్రంథ రచననూ, బోధననూ ప్రభావితం చేస్తోంది.

1993లోనూ, 1994లోనూ నేషనల్ స్టీరింగ్ కమిటీ ఆన్ టెక్స్ట్ బుక్ ఎవాల్యుయేషన్ ఇలా వ్యాఖ్యానించింది: **'సరస్వతి శిశు మందిర్‌లలో (1952లో గోల్వాల్కర్ స్థాపించినవి) ప్రాథమిక స్థాయిలో ప్రస్తుతం ఉపయోగిస్తున్న కొన్ని పాఠ్యగ్రంథాలు భారతదేశ చరిత్ర గురించి చాలా తీవ్రమైన మత దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఏ మాత్రం అద్దూ అదుపూ లేకుండా చారిత్రక 'సత్యాలను' కల్పిత కథలుగా చెబుతున్న తీరు, వారు చెబుతున్నట్లు దేశభక్తిని కాక పూర్తిగా మూఢవిశ్వాసాన్నీ, మతోన్మాదాన్నీ ప్రోత్సహించడానికి ఉద్దేశించబడినవి'.**

ఆరెస్సెస్ తరహా దేశభక్తీ, జాతీయతా వాస్తవానికి మూఢవిశ్వాసం మీదా, మతోన్మాదం మీదా ఆధారపడి ఉన్నవని గుర్తించడం అవసరం.

'విద్యాభారతి పాఠశాలలలో సంస్కృతి జ్ఞాన్ శీర్షికతో పచ్చి మతతత్వ రచనల ప్రచురణ గురించి' కమిటీ తన ఆందోళనను వ్యక్తం చేసింది. 'ఈ రచనల సంఖ్య 6000 ఉన్నట్లు తెలుస్తోంది. సంస్కృతి జ్ఞాన్ రచనల పేరుతో ఉన్న రచనలలో చాలా సమాచారం 'యువతలో సంస్కృతి గురించి జ్ఞానాన్ని పెంపొందించే పేరుతో మూఢ విశ్వాసాల్నీ, మతోన్మాదాన్నీ ప్రోత్సహించడానికి ఉద్దేశించబడినవని' నివేదికతో ఏకీభవిస్తోంది. ఆరెస్సెస్ తరహా దేశభక్తీ, జాతీయతా, వాస్తవానికి మూఢవిశ్వాసం మీదా, మతోన్మాదం మీదా ఆధారపడి ఉన్నవని మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవడం ముఖ్యం.

కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాలలోనూ బిజెపి ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత, ఇంతకు ముందు ఆరెస్సెస్ పాఠశాలలో ఉపయోగించిన పాఠ్య పుస్తకాలను విద్యా వ్యవస్థలో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపయోగిస్తున్నారు. మరోమాటలో చెప్పాలంటే, చరిత్ర, దేశభక్తి, సంస్కృతి పేరుతో పాఠశాలల వ్యవస్థ అంతటా మూఢ విశ్వాసాల్నీ, అసత్యాలనూ, మతోన్మాదాలను ప్రోత్సహిస్తున్నారు.

**ఉద్యమాలు**

తన భావజాలాన్ని మెజారిటీ మతానికి చెందిన ప్రజలలో ప్రచారం చేసి, ఆ భావాలు తమ స్వంతమే అని వారు భావించేటట్టు చెయ్యడానికి ఆరెస్సెస్ అనేక ఉద్యమాలు నిర్వహించింది. పరివార్ సభ్యులకు తాము పని చేస్తున్న ప్రాంతాలలో దాదాపు నాయకత్వ హోదాను సాధించడానికి రామ్ మందిర్ ఉద్యమం చాలా విజయవంతంగా ఉపయోగపడింది.

స్వామీ దిగ్విజయనాథ్ లాంటి హిందూ మహాసభ సభ్యులు రెచ్చగొట్టడంతో, జిల్లా మేజిస్ట్రేట్ సహకారంతో, 1949 డిసెంబరు 22-23 తేదీలలో బాబ్రీ మసీదులో విగ్రహాలను ప్రతిష్టించడంతో ఈ ఉద్యమం ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆ విగ్రహాలను తొలగించమని సర్దార్ పటేల్ స్వయంగా ఆ నాటి యుపి ముఖ్యమంత్రి పండిట్ పంత్ కు చెప్పాడు. మసీదు ప్రవేశ ద్వారానికి తాళం వేసినా ఆ విగ్రహాలను మాత్రం తొలగించలేదు. తర్వాత ఇద్దరు ప్రముఖ కాంగ్రెసు నాయకులు – మౌలానా కచ్ఛోచ్వి, దావు దయాల్ ఖన్నాలు – మసీదును కాపాడమనీ, దాన్ని రామజన్మ స్థలంగా గుర్తించబోమనీ ఉద్యమాలు ప్రారంభించారు. కానీ ఈ ఉద్యమమంతా దాదాపు న్యాయస్థానాలకే పరిమితమైంది. 1983లో సంఘ్ యొక్క విశ్వ హిందూ పరిషత్ ఒక ధరమ్ సంసద్‌ను నిర్వహించింది. అయోధ్య, కాశీ, మధురలలో ఉన్న మూడు మసీదులను హిందూ మతానికి అప్పగించాలని ఆ సంసద్ డిమాండు చేసింది. ఆ తర్వాత 1984 సాధారణ ఎన్నికలకు ముందు అనేక సమావేశాలూ, ఊరేగింపులూ జరిగాయి. కానీ శ్రీమతి ఇందిరా గాంధీ హత్య తర్వాత బిజెపి ఎన్నికలలో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఎన్నికల తర్వాత ఆందోళన కొనసాగి బలం పుంజుకుంది. దక్షిణ భారతదేశంలో ఉద్యమాన్ని బలపరచడానికి కర్నాటకలో ఒక ధరమ్ సంసద్‌ను నిర్వహించారు. 'రామ కార్యానికి' ప్రతీ పట్టణంలోనూ, గ్రామంలోనూ మద్దతు కూడగట్టడానికి భజరంగ్ దళ్‌ను ఏర్పాటు చేశారు. 1989 ఫిబ్రవరి 1న, ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చాలా తప్పుపని ఒకటి చేశాడు. తాళాలు తొలగించి మసీదులో పూజలు అనుమతించాలి అని ఫైజాబాద్ జిల్లా జడ్జి ఒక ఆర్డర్ పాస్ చేసేలా చేశాడు. దీనితో ప్రముఖ ముస్లిం నాయకులతో బాబ్రీ మసీదు ఏక్షన్ కమిటీ ఒకటి ఏర్పడింది.

హిందువులందరినీ కూడగట్టే ఒక ఉద్యమానికి ఆరెస్సెస్ నడుం కట్టింది. ఈ ఉద్యమంలో సంఘ్ సభ్యులందరూ పాల్గన్నారు. ఈ ఉద్యమం బిజెపి సైద్ధాంతిక ప్రణాళికకూ, రాజకీయాలకూ ఎంతో లాభాన్ని చేకూర్చింది.

బిజెపి నాయకుడు, మాజీ సంఘ్ ప్రచారక్ అయిన యల్. కె. అద్వానీ అయోధ్యకు తన రథయాత్రను ప్రకటించాడు. ఈ రథ యాత్ర రెండు లక్ష్యాలను నెరవేర్చింది. దేశ వ్యాపితంగా హిందువులు, ముస్లింల మధ్య ఒక అగాధాన్ని సృష్టించింది. కుల విభేదాలను అధిగమించి ఒక ప్రబలమైన హిందూ ఐక్యతను సాధించడానికి పునాది వేసింది.

మసీదును కూల్చివేయడానికి ఉద్యమం ఊపు అందుకుని, అంతిమంగా 1992 డిసెంబరు 6న మసీదుని కూల్చివెయ్యడం జరిగింది.

అనేక కారణాల వలన ఈ సంఘటన చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. తన లక్ష్యాలను చేరుకోవడానికి ఆరెస్సెస్ పట్టువిడవకుండా చేసే కృషి స్వభావానికి ఇది రుజువు. కులాలకూ, ప్రాంతాలకూ అతీతంగా హిందూ ప్రజల నుండి ఆరెస్సెస్‌కు మద్దతు పెరిగిందనడానికీ ఇది రుజువు. ఇది డా. అంబేద్కర్ వర్ధంతి నాడు లౌకిక రాజ్యాంగం మీద ఆరెస్సెస్ చేసిన ఒక పెద్ద దాడి. కాంగ్రెసు పార్టీ, ఎవరి కనుసన్నలలో మసీదు కూల్చివేత జరిగిందో ఆ న్యాయ వ్యవస్థా, ప్రభుత్వమూ రాజ్యాంగానికీ, లౌకికవాదానికీ కట్టుబడి లేవని ఆ నిబద్ధతలో బలహీనతను బయటపెట్టింది.

ఈ ఉద్యమమూ, విజయవంతంగా మసీదును కూల్చివేయడమూ ప్రతీ రంగంలోనూ సంఘ్ పరివార్ శక్తిని చాలా ఇనుమడింప చేసింది. ఈ విజయాలతో అది హిందూ రాష్ట్రాన్ని నిర్మించే తన లక్ష్యం వైపుకు ఏక దీక్షతో ముందుకు కదిలింది.

## 2014 తర్వాత హిందుత్వ మత ఎజెండా అమలు

ఒక పక్క తన మతతత్వ ఎజెండాను విడవకుండా కొనసాగిస్తూ, వివిధ ప్రాంతీయ పార్టీలతో చేతులు కలపడానికి జన సంఘ్, ఆ తర్వాత బిజెపి, చాలా పట్టువిడుపులతో కూడిన ఎత్తుగడలను ఉపయోగించాయి. ఫలితంగా 2014లో అనేక రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ బిజెపి ప్రధాన రాజకీయ పార్టీ అయింది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఉన్న బిజెపి ప్రభుత్వాలు తాము ప్రకటించిన లక్ష్యాలను చేరుకోవడానికి వేగంగా కదిలాయి. అదుపులేని దోపిడీకీ, కార్పొరేట్ల, భూస్వాముల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల మద్దతుకూ బిజెపి నిబద్ధతలో ఒక భాగంగా కార్మికుల మీదా, రైతుల మీదా, స్త్రీల మీదా, యువత మీదా కనీవినీ ఎరుగని విధంగా జరుగుతున్న దాడులను

చూడాలి. మత ప్రాతిపాదికపైన ప్రజలను మరింతగా చీల్చడానికి పట్టువిడవకుండా బిజెపి చేస్తున్న ప్రయత్నం ఇందుకు ఉపయోగపడుతోంది.

మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను, రాక్షసులుగా చిత్రించడం అనేక విధాల జరుగుతోంది. 'లవ్ జిహాద్' (ముస్లిం పురుషులు హిందూ స్త్రీలను ఆకర్షించడమూ, ఎత్తుకుపోవడమూ), మతాలకు అతీతంగా స్నేహాన్ని లేదా ప్రేమను ప్రకటించే యువ జంటల మీద దాడి చెయ్యడానికి 'రోమియో దళాలు', కొందరు ముస్లింలు యు.పి.యస్.సి. పరీక్షలో ఉత్తీర్ణులైనప్పుడు 'ఐఎయస్ జిహాద్' ఆరోపణలు, ముస్లింలు భూమిని కాజేస్తున్నారన్న ఆరోపణతో 'భూ జిహాద్', కరోనా వ్యాధి కాలంలో ముస్లింలు కరోనా వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నారన్న పేరుతో 'కరోనా జిహాద్' మొదలైన ఆరోపణలను ప్రతీ రోజూ చెయ్యడం జరుగుతోంది. ఆరెస్సెస్ అడుగులకు మడుగులొత్తుతూ సహకరించే మీడియా వీటిని గోరంతలు కొండంతలు చేస్తోంది. సాధారణ నేరాలకూ లేదా రోజువారీ ప్రవర్తనకూ మత ఉద్దేశాలను అంటకట్టడం ద్వారా మత ప్రాతిపాదిక మీద ప్రజలను చీల్చే ప్రక్రియను నూతన శిఖరాలకు తీసుకు వెడుతోంది. ప్రలోభాల ద్వారా కానీ, వివాహం కోసం కానీ మత మార్పిడికి వ్యతిరేకంగా ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, కర్నాటక, ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన, క్రూరమైన చట్టాలు చేశాయి. అనేకమంది ముస్లిం యువకులనూ, వారి కుటుంబ సభ్యులనూ కారాగారంలో పడెయ్యడానికీ, తమ జీవితభాగస్వామిని ఎన్నుకునే హక్కును నిరాకరించి హిందూ స్త్రీలను అవమానాలకూ, హింసకూ గురి చెయ్యడానికీ ఈ చట్టాలను ఉపయోగించడం జరుగుతోంది. ఇదే సమయంలో హిందూ పురుషులు ముస్లిం స్త్రీలను వివాహమాడడాన్ని ప్రోత్సహించడమూ, కీర్తించడమూ జరుగుతోంది.

ముస్లింలకూ, క్రిస్టియన్లకూ వ్యతిరేకంగా హింసను మరింత తీవ్రంగా, తరచుగా ఉపయోగించడం జరుగుతోంది. 'మత మార్పిడి' కార్యక్రమాల గురించి, ముఖ్యంగా గిరిజన, దళిత ప్రాంతాలలో జరుగుతున్న మత మార్పిడి కార్యక్రమాల గురించి క్రిస్టియన్ల మీద దాడి జరుగుతుంటే, గో వధ, గోవులను దొంగిలించడం, రవాణా చెయ్యడం, స్త్రీలను వేధించడం మొదలైన నెపాల మీద ముస్లింల మీద దాడి చెయ్యడం, హత్య చెయ్యడం జరుగుతోంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలు మినహా దేశమంతటా ఇలా జరుగుతోంది. రామనవమి, హనుమాన్ జయంతి మొదలైన హిందూ పండుగల సందర్భంగా ఊరేగింపులు లేవదీసినప్పుడు కూడా ముస్లింల ఇళ్ళ మీదా, బస్తీల మీదా దాడి చెయ్యడం జరుగుతోంది. ఈ సంఘటనలలో ముస్లింల ఇళ్ళూ, దుకాణాలు నాశనమవుతుంటే, ముస్లింలు క్షతగాత్రులవుతుంటే, చంపబడుతుంటే, ఊరేగింపుల మీద దాడి చేశారు లాంటి తప్పుడు ఆరోపణల మీద అధిక సంఖ్యలో

ముస్లింలను అరెస్టు చేస్తున్నారు. అటువంటి సంఘటనల తర్వాత, ఇటీవలి మాసాలలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీలలో ముస్లిం ఇళ్ళను కూల్చి వెయ్యడానికి బుల్డోజర్లను ఉపయోగిస్తున్నారు. నవరాత్ర 'గర్బ' నృత్య వేడుక ముస్లింలను లక్ష్యంగా చేసుకుని దాడి చెయ్యడానికి, ముఖ్యంగా గుజరాత్‌లో ఉపయోగపడుతోంది. ఈ పండుగలకు హాజరవుతున్న ముస్లింలను గుర్తించి దాడి చేస్తున్నారు. 'గర్బా పందిళ్ళ మీద రాళ్ళు విసిరారన్న' నేరారోపణతో ముస్లింల ఇళ్ళూ, కుటుంబాలూ కూడా దాడులకు గురవుతున్నాయి. గ్యాన్‌వాపీ మసీదు, మధుర ఈద్గా సమస్యలను రేకెత్తించి పెద్ద ఎత్తున ప్రచారం ఇస్తున్నారు.

ఇతర వార్తలన్నింటినీ దాదాపు విస్మరిస్తూ అటువంటి సంఘటనల గురించి మీడియాలో – ముఖ్యంగా ప్రధాన స్రవంతికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియాలో – చెప్పడం, చర్చించడం జరుగుతోంది. 2014 నుండి మీడియా యాజమాన్యం అంబానీ గ్రూపు లాంటి కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకృతమైపోయింది. తమకు వరాలు కురిపిస్తున్న, రాయితీలు – పన్ను మినహాయింపులు ఇస్తున్న బిజెపికి ఈ కార్పొరేట్లు చాలా మద్దతు ఇస్తున్నారు. ప్రతీ దినం ఈ కార్పొరేట్ల ఛానల్స్ భారీ స్థాయిలో మతతత్వ ప్రచారం చేస్తున్నాయి. మధ్య మధ్య హిందూ పండుగల గురించీ, హిందూ ఆచారాల గురించీ, హిందూ విశ్వాసాల గురించీ ఎంతో మూఢనమ్మకాలను ప్రచారం చేస్తున్నాయి. వివిధ రకాల 'పవిత్ర' హిందూ స్త్రీ పురుషులకు ఈ ఛానల్స్‌లో మాట్లాడడానికి టైము ఇస్తున్నారు. అంతే కాదు, ఈ పవిత్రులకు స్వంత ఛానళ్ళు ఉన్నాయి. అత్యంత హీనంగా అశాస్త్రీయ మూఢ నమ్మకాలను ప్రచారం చెయ్యడానికి మాత్రమే కాక ముస్లింల మీద విషపూరితమైన దాడులు చెయ్యడానికి ఈ ఛానళ్ళను ఉపయోగిస్తున్నారు. ముస్లింలను చంపమనీ, ముస్లిం స్త్రీలను చెరచమనీ బహిరంగంగా రెచ్చగొడుతున్నారు.

బిజెపి, దాని అనుబంధ సంస్థలకు ఇస్లామిక్ టెర్రరిజం ఒక ప్రచార ఆయుధంగా ఉపయోగపడుతోంది. టెర్రరిస్టు గ్రూపులతో సంబంధాలుండే కొంతమంది అరెస్టులను, ముస్లింలో మెజారిటీకి అటువంటి సంస్థల పట్ల సానుభూతి ఉందనీ, అనేక మందికి ఆ సంస్థలతో అనుబంధం ఉందనీ ఒక ముద్ర వెయ్యడానికి ఉపయోగిస్తున్నారు. హిందూ వ్యక్తుల, గ్రూపుల, సంస్థల టెర్రరిస్టు కార్యకలాపాలను పూర్తిగా మరుగుపరిచే ప్రయత్నం జరుగుతోంది.

సావర్కర్, గోల్వాల్కర్ తదితరులు తమ రచనలలో వర్ణించిన ఆరెస్సెస్ యొక్క పక్షపాత, సంకుచిత జాతీయత వ్యాఖ్యానాన్ని నిజమైన జాతీయతగా సంఘ్, దాని ప్రచార యంత్రాంగమూ, మీడియా ప్రచారం చేస్తున్నాయి. మైనారిటీలు, లౌకికవాదులైన వ్యక్తులూ, సంస్థలూ లాంటి అంతర్గత శత్రువుల మీదా, పాకిస్తాన్

లాంటి వెలుపలి శత్రువుల మీదా, ప్రచారాన్ని కేంద్రీకరిస్తున్నారు. ఒక జాతివాదిగా ఉండడానికీ, సంఘ్ అనుమతించిన హిందువుగా ఉండడానికీ మధ్య అనుసంధానాన్ని క్రమంగా బలపరుస్తున్నారు. జె.యన్.యు. లాంటి సంస్థల మీదా, సిఎఎ వ్యతిరేక ఆందోళనల లాంటి వాటి మీదా దాడి చెయ్యవలసి వచ్చినప్పుడు, లేదా 2019 ఎన్నికల ముందు చేసినట్లు ఎన్నికలలో పోటీ చేసేటప్పుడు వెర్రి జాతీయోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నారు.

2019 ఎన్నికలలో విజయం తర్వాత బిజెపి మరింత వేగంగా ఆరెస్సెస్ లక్ష్యాలను సాధించడానికి కదులుతోంది. ఫెడరల్ నిర్మాణాన్ని బలహీన పరిచే, ప్రభుత్వ విద్యను నాశనం చేసే, కార్మికుల హక్కులను హరించే, రైతులను నాశనం చేసే, కనీవినీ ఎరుగని స్థాయిలో జాతీయ ఆస్తులను అమ్మివేసే, ప్రైవేటైజేషన్‌ను ప్రోత్సహించే, రాజ్యం యొక్క నిరంకుశ స్వభావాన్ని అధికం చేసే చట్టాలను చేసింది. రాజ్యం యొక్క లౌకిక స్వభావాన్ని బలహీనపరిచి, మత ప్రాతిపాదికపైన ప్రజలను చీల్చే చట్టాలను చేసింది. ఆర్టికల్ 370 రద్దూ, జమ్మూ-కాశ్మీరును రెండు యూనియన్ ప్రాంతాలుగా విభజించడంతో పాటు జనాభానూ, భూ యాజమాన్య పద్ధతినీ మార్చడం గురించి బహిరంగంగా ప్రకటించారు. ఈ దిశగా అనేక అడుగులు - ఉదాహరణకు లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన వెయ్యడం జరిగింది.

రామజన్మ భూమి-బాబ్రీ మసీదు వివాదంలో ఆ స్థలంలో రామ మందిర్ నిర్మాణాన్ని ఆదేశించే తీర్పును సుప్రీం కోర్టు ఇచ్చేలా బిజెపి ప్రభుత్వం చెయ్యగలిగింది. మెజారిటీ మతం దీనిని ఒక విజయంగా ఆహ్వానిస్తే, అన్ని రాజకీయ పార్టీలు కూడా ఈ తీర్పును ఆహ్వానించాయి. సిపియం పార్టీ ఒక్కటే ఈ తీర్పును విమర్శిస్తూ ఒక బహిరంగ ప్రకటన చేసింది. ఒకప్పుడు మసీదు ఉన్న, మందిరం నిర్మించబోయే ప్రదేశంలో, ప్రధాన మంత్రి, యు.పి. ముఖ్యమంత్రి, ఆరెస్సెస్ అధిపతి మోహన్ భగవత్‌లు 2019 ఆగస్టు 5న శిలాపూజ చేశారు. మోహన్ భగవత్ తన ప్రసంగంలో మనుస్మృతి నుండి ఒక శ్లోకాన్ని ఉటంకించాడు. ఆ శ్లోకం ఈ విధంగా ఉంటుంది : 'మొట్టమొదట జన్మించిన (అంటే బ్రాహ్మణుడు) వాని నుండి భూమి మీద ఉన్న జనులందరూ తమ తమ ధర్మములను నేర్చుకుందురుగాక'. హిందూ రాష్ట్రానికి పునాదిరాయిని వెయ్యడంగా ఈ సంఘటనను మనం అర్థం చేసుకోవచ్చు. సామాజిక వర్గీకరణ చెక్కుచెదరకుండా మొత్తం మతస్తులను ఆవరించే ప్రబలమైన హిందూ అస్తిత్వాన్ని నెలకొల్పే తమ లక్ష్యానికి చేరువ కావడానికి ఆరెస్సెస్, దాని అనుబంధ సంస్థలూ, వ్యూహాల్నీ, యుద్ధ తంత్రాలనూ ఉపయోగించే విధానానికి ఈ సంఘటన ఒక సంకేతంగా నిలుస్తుంది. తమపై కూడా వ్యతిరేక ప్రభావం చూపే ప్రభుత్వ

విధానాలను ప్రతిఘటించకుండా హిందూ మతంలో విశాలమైన భాగాలు మౌనం వహిస్తాయి. ఎందుకంటే ప్రభుత్వమూ, దాని భావజాల మిత్రులూ మైనారిటీల మీద చేసే దాడులను వారు సమర్థిస్తారు.

బిజెపి, సంఘ్ పరివార్ లు ఎదగడానికీ, అధికారాన్ని సంఘటితపరుచుకోవడానికీ ఒక ముఖ్య కారణం – పెట్టుబడిదారీ వర్గంలోని అన్ని విభాగాల నుండీ, కార్పొరేట్ వ్యవస్థ నుండీ వారికి లభిస్తున్న ఉదారమైన సహకారం. ఉచ్ఛ స్థితిలో ఉన్నప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీకి ఈ రకమైన సహకారం లభించలేదు. నేడు బిజెపి కార్పొరేట్ విరాళాలలో మూడింట రెండు వంతులు అందుకుంటోంది. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో డిపాజిట్ చెయ్యబడిన డబ్బులో అధిక భాగం బిజెపికే పోతోంది. అనేక పెద్ద వ్యాపార సంస్థలకు బిజెపి హిందుత్వ ఎజెండాతో ఒక భావోద్వేగ అనుబంధం ఉంది. ప్రైవేటైజేషన్, ప్రభుత్వ ఆస్తుల అమ్మక (monetization) విధానాలకు పూర్తి మద్దతు, కార్మికుల, రైతుల హక్కుల మీద చేస్తున్న దాడి, బిజెపికి అపరిమితమైన సహకారం లభించేలా చేస్తోంది. అంతేకాకుండా, అనేక మీడియా సంస్థలు అంబానీ, ఇప్పుడు అదానీ లాంటి పెద్ద కార్పొరేట్ల యాజమాన్యంలో ఉన్నాయి. బిజెపికీ, సంఘ్ పరివార్‌కు పూర్తిగా సహకరించడం వలన మతతత్వం మీద ప్రజలను చీల్చే ఎజెండాలో వీరు కూడా నేర భాగస్వామ్యులవుతారు. ఇది ద్వేష రాజకీయాలు, ద్వేష ప్రసంగాలు, పెరుగుతున్న అసహనం, మతం పేరుతో హత్యలు, మైనారిటీల మీద హింసాపూరిత దాడులూ అనుదినం జరగడానికి దారి తీస్తుంది. ఇది మళ్ళీ ప్రజలు చెరో పక్షాన సమీకరింపబడడానికీ, బిజెపి, పరివార్ల వెనుక మరింత మంది చేరడానికి కారణమవుతుంది.

### ఆరెస్సెస్, దాని అనుబంధ సంస్థల విధానాలనూ, రాజకీయాలనూ ప్రతిఘటించడం

ప్రజాస్వామ్యాన్నీ, లౌకికవాదాన్నీ, రాజ్యాంగం ఇచ్చిన హామీలనూ, ఫెడరలిజం మొదలైన వాటిని కాపాడుకోవడానికీ, స్త్రీల, కార్మికుల, రైతుల, దళితుల, ఆదివాసీల, మైనారిటీల హక్కుల పరిరక్షణకూ, సంఘ్ దాని అనుబంధ సంస్థల విధానాలతోనూ, రాజకీయాలతోనూ పోరాడడం అత్యవసరం.

ఇది చెయ్యాలంటే, మొట్టమొదట చెయ్యవలసినది తాము అజేయులమనే ప్రచారాన్నీ, తమ వెనుక విశాలమైన మెజారిటీ ఉన్నదని ప్రజలలో వాళ్ళు సృష్టించిన

నమ్మకాన్నీ తొలగించాలి. వాస్తవానికి వాళ్ళకు మెజారిటీ సీట్లు లభించినా, సాధారణ ఎన్నికలలో వారికి పోలైన ఓట్లలో మెజారిటీ లభించలేదు. రాష్ట్ర ఎన్నికలలో కూడా దీనికి భిన్నంగా లేదు. వారు గెలిచిన రాష్ట్ర ఎన్నికలలో కూడా వారికి 40 శాతం కంటే ఎక్కువ ఓట్లు రాలేదు.

మనుస్మృతికి వారు కట్టుబడి ఉండడం వలన రాజ్యాంగాన్నీ, స్త్రీలకు సమాన హక్కులనూ వ్యతిరేకించవలసి వస్తుంది. వర్ణాశ్రమ ధర్మానికి మద్దతు ఇవ్వాల్సి వస్తుంది. ఓబిసిలకూ, ఎస్సీలకూ, ఎస్టీలకూ ఉన్న రిజర్వేషన్లూ, ప్రత్యేక హక్కులూ నీరు కార్చవలసి వస్తుంది. ఇదంతా మనం విడమరిచి చెప్పి వారి నిజ స్వరూపాన్ని బహిర్గతం చెయ్యడం మాత్రమే కాకుండా ఈ విధానాలతో పోరాడాలి. ప్రైవేటైజేషన్‌ను బలంగా వ్యతిరేకించాలి. రిజర్వేషన్లను కాపాడాలి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల డిమాండుకు మద్దతివ్వాలి. కుల జనగణన డిమాండుని సీరియస్‌గా తీసుకోవాలి. ఏ రకమైన అస్పృశ్యతనైనా, కుల వివక్షనైనా వ్యతిరేకించాలి. దురాగతాలు జరిగినప్పుడు సమర్థవంతంగా కలుగజేసుకోవాలి.

మన ఉద్యమాలన్నింటిలోనూ స్త్రీల సమస్యలూ, కోరికలూ ఒక భాగం కావాలి. స్త్రీలకు వ్యతిరేకంగా జరిగే అన్ని రకాల హింసనూ వ్యతిరేకించాలి. వారి హక్కుల మీద దాడులు జరిగినప్పుడు పోరాడాలి. జెండర్ వివక్షనూ, స్త్రీలను కించపరిచే ప్రసంగాలనూ, వ్యాఖ్యలనూ వ్యతిరేకించాలి.

సంఘ్ ఎప్పుడూ స్త్రీల సమానత్వాన్నీ, స్త్రీలు తమకు సంబంధించిన విషయాలలో నిర్ణయం తీసుకునే హక్కునూ, పౌర జీవితంలో తమ పాత్రను నిర్వహించే హక్కునూ అంగీకరించలేదు. సంఘ్ అనుబంధ సంస్థలైన దుర్గా వాహిని, రాష్ట్రీయ సేవికా దళ్ లాంటి స్త్రీల సంస్థలు వివాహంలోనూ, గృహంలోనూ సమాన హక్కును వ్యతిరేకిస్తాయి. వివాహ పవిత్రతను కాపాడడానికి స్త్రీలు అన్ని విధాలా రాజీ పడాలి అని ఈ సంస్థలు భావిస్తాయి. కుటుంబంలో స్త్రీల హక్కులను వ్యతిరేకిస్తాయి. మైనారిటీ మతస్తులకు వ్యతిరేకంగా, ముఖ్యంగా ముస్లింలకు వ్యతిరేకంగా, పోరాడటానికి మాత్రమే స్త్రీలు బయటకు రావాలని అవి భావిస్తాయి. ముస్లింలను హిందూయిజానికి శత్రువుగా భావిస్తూ, హింసతో సహా అన్ని విధాలా ముస్లింలతో పోరాడాలంటాయి. ఒక పక్క స్త్రీలను అణుకువగా, విధేయతతో ఉండమని చెబుతూ, ముస్లింలను వ్యతిరేకించే విషయం తలెత్తినప్పుడు, వారికి ఆయుధ శిక్షణ కూడా ఇస్తాయి. ఈ అవగాహననూ, మత కలహాలను ప్రోత్సహించడానికి స్త్రీలను ఉపయోగించడాన్నీ తీవ్రంగా వ్యతిరేకించాలి. స్త్రీల హక్కులు, సమానత్వానికి సంబంధించి సంఘ్ వైఖరిలోని వైరుధ్యాలను బహిరంగం చెయ్యాలి.

సామాజిక సంస్కరణ కోసం ఉద్యమాలను ప్రారంభించాలి. కులాంతర, మతాంతర వివాహాలకు అండగా నిలవాలి. తిరోగమన, అశాస్త్రీయ ఆలోచనను తర్కంతోనూ, వాస్తవాలతోనూ ఎదుర్కోవాలి.

సంక్షేమ పథకాలు – ముఖ్యంగా స్త్రీలకూ, బాలికలకూ ఉద్దేశించబడినవి – అమలు అయ్యేలా చూడడం మన పోరాటాలలో ఒక భాగం కావాలి.

బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల, రైతుల పోరాటాలను నిర్మించాలి. ప్రభుత్వ విధానాలకూ, అణచివేతకూ వ్యతిరేకంగా నిరంతర పోరాటాన్ని సాగించడానికి రైతాంగంలోని విశాలమైన భాగాలను ఎలా సమీకరించవచ్చునో సంవత్సరం పాటు సాగిన రైతు ఉద్యమం ఒక స్ఫూర్తినిచ్చే ఉదాహరణ. వర్గ దోపిడీ వాస్తవాన్ని సంఘ్ అంగీకరించదు. దాని ట్రేడ్ యూనియన్, రైతు శాఖలు దోపిడీదారులకూ, దోపిడీకి గురయ్యేవారికీ మధ్య స్నేహపూర్వక సంబంధాలను ఏర్పాటు చెయ్యడం గురించి మాట్లాడుతాయి. దీనర్థం ఏమిటంటే – ఒక పక్క కార్మికుల, రైతుల ప్రయోజనాలను తాకట్టు పెడుతూ, మరో పక్క పెట్టుబడిదారుల, కార్పొరేట్ల ప్రయోజనాలను ముందుకు తీసుకు వెళ్ళడం. కార్మికుల హక్కులను హరిస్తూ బిజెపి ప్రభుత్వం తీసుకు చేసిన చట్టాలూ, రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలూ ఈ అవగాహనను రుజువు చేస్తాయి. కార్మికుల, రైతుల హక్కుల కోసం పోరాటాన్ని శక్తివంతం చెయ్యడానికి ఈ అవగాహనను ఎండగట్టడం అత్యవసరం.

సంఘ్ యొక్క మత భావజాలాన్నీ, జాతీయతకు అది ఇచ్చే తప్పుడు వ్యాఖ్యానాన్నీ ఏ మాత్రం అంగీకరించకూడదు. భావజాల రంగంలో పోరాడకుండా, మెజారిటీ మతంలోని అధికులలో ఫాసిస్టు హిందుత్వ, ఆరెస్సెస్‌లు సాధించిన ఆధిపత్యాన్ని బలహీనపరచడం సాధ్యం కాదు. మనువాద హిందూ రాష్ట్ర నిర్మాణానికి ఆరెస్సెస్ ప్రయాణంలో ఈ ఆధిపత్యమే ప్రజల హక్కుల మీద దాడి చెయ్యడానికి వీలు కల్పిస్తున్నది. అందువలన వారి విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని వారి విషపూరిత భావజాలానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంతో జోడించడం అవసరం.

ప్రస్తుతం సంఘ్ పరివార్ తన భావజాలాన్ని 'నిజమైన జాతీయత'గా చిత్రించడానికి నిర్విరామంగా ప్రయత్నిస్తోంది. సావర్కర్‌ను కీర్తించడం ద్వారా, క్షమాపణలు చెబుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి అతని లేఖల జ్ఞాపకాలను తుడిచి వెయ్యడానికి ప్రయత్నించడం ద్వారా, స్వాతంత్ర్య పోరాటంలో ఆరెస్సెస్ నుండి ఎవరూ పాల్గొనలేదు అనే వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తోంది. ఇది రెండు విధాలుగా ఉపయోగపడుతోంది. సావర్కర్‌ను నిజమైన స్వాతంత్ర్య యోధుడిగా చిత్రించడం ద్వారా, అతని 'హిందుత్వ' సిద్ధాంతాన్ని 'నిజమైన' జాతీయవాదంగా కూడా చిత్రించవచ్చు.

ఈ రెండు వాదనలనూ ఖండించాల్సిన అవసరం ఉంది.

మనువాద హిందుత్వ భావజాలాన్ని ఎండగట్టడమూ, వ్యతిరేకించడమూ మాత్రమే కాదు, మన భావజాలాన్నీ, అవగాహననూ మరింత సమర్ధవంతంగా, పట్టువిడవకుండా ప్రచారం చెయ్యడం కూడా ముఖ్యం. ఆరెస్సెస్‌తో పోరాడడానికి మాత్రమే కాకుండా, మరొక ప్రత్యామ్నాయ, ప్రజానుకూల విధానాల పునాది మీద మన దేశాన్ని అభివృద్ధి చెయ్యడానికి దారిని సుగమం చెయ్యడానికీ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని సురక్షితం చెయ్యడానికీ ఇది అవసరం.

ఇది చెయ్యాలంటే, మన భావజాలాన్నీ, మన చరిత్రనూ ప్రచారం చెయ్యడానికి మరిన్ని ప్రయత్నాలు చెయ్యాలి.

స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు పోషించిన మహత్తర పాత్రను ఎత్తి చూపాలి. జాతీయోద్యమానికి ప్రేరణ కలిగించి, అందరినీ కలుపుకుపోగల విశాలమైన ఉద్యమ నిర్మాణాన్ని సాధ్యం చేసిన సూత్రాలను పరిరక్షించాలి. మనువాదుల దాడి నుండి రాజ్యంగాన్ని కాపాడాలి. మన ఉద్యమాలలోనూ, ప్రచారంలోనూ, రాజ్యాంగం మనకు వాగ్దానం చేసిన సామాజిక, ఆర్థిక, జెండర్, రాజకీయ సమానతల మీద దృష్టిని కేంద్రీకరించాలి. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటాన్ని ఆరెస్సెస్, హిందూ మహాసభలు క్రియాశీలంగా వ్యతిరేకించాయి. జాతీయోద్యమాన్నుండి దూరంగా ఉండమనీ, తమ నిజమైన శత్రువులు బ్రిటిష్ పాలకులు కాక కమ్యూనిస్టులూ, క్రిస్టియన్లూ, ముస్లింలూ అనీ ఆరెస్సెస్ సిద్ధాంతవేత్తలు తమ అనుచరులకు పదే పదే హితబోధ చేసేవారు. దోపిడీతో పోరాడడానికి వర్గ ఐక్యతను నిర్మించడం పట్ల మన అవగాహనను ప్రచారం చెయ్యాలి. భారతదేశ బడా బూర్జువాకూ, సామ్రాజ్యవాదానికీ మధ్య ఉన్న అనుసంధానాన్నీ, ఈ అనుసంధానికి సంఘీయులు ఇచ్చే బలమైన మద్దతునూ పూర్తిగా ఎండగట్టాలి.

అన్ని రకాల ఛాందసవాదాలను మనం ధృఢంగా వ్యతిరేకించాలి. ఇటీవలి సంవత్సరాలలో ముస్లిం ఛాందసవాద సంస్థలు తమ బలాన్ని పెంచుకున్నాయి. జమాతే ఇస్లామీ అనేక సంస్థలనూ, రాజకీయ నిర్మాణాలనూ ఏర్పాటు చేసింది. మానవ హక్కుల కోసమూ, మతతత్వాన్ని వ్యతిరేకంగానూ పోరాడుతున్న ఉమ్మడి వేదికలలో చేరడానికి వారు ప్రయత్నిస్తున్నారు. మనం చాలా జాగ్రత్తగా ఉండాలి, వారితో ఎటువంటి ఉమ్మడి కార్యక్రమాన్ని చేపట్టకూడదు. విచ్ఛిన్నకర రాజకీయాలను ప్రచారం చెయ్యడం మాత్రమే కాదు, మతతత్వ ప్రాతిపాదికన ప్రజలు చీలిపోవడానికి హిందుత్వ శక్తులు చేసే ప్రచారానికి వారు ఉపయోగపడతారు.

కుల, వర్గ, జెండర్ అణచివేత సమస్యలను జోడించి ఈ సమస్యల మీద

పోరాటాలు నిర్మించే మన విధానాన్ని బలపరచాలి. ఈ పోరాటాలలోకి మరిన్ని సంస్థలను కూడగట్టాలి.

జాతీయ ఐక్యతను కాపాడడానికి లౌకికవాదాన్ని కాపాడవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాలి. రాజీలేని విధంగా మైనారిటీల హక్కుల పరిరక్షణ మన బాధ్యత అని మనం అంగీకరించాలి.

**హిందుత్వకు వ్యతిరేకంగా ముందుకు సాగాలి**

హిందుత్వ శక్తులతో పోరాడేందుకు సిపియం 23వ కాంగ్రెసు తన రాజకీయ తీర్మానంలో ఈ క్రింది కర్తవ్యాలను నిర్దేశించింది :

"2.168. హిందుత్వ శక్తులను వేరు చెయ్యడానికి పార్టీని బలపరచడం ఒక మౌలికమైన ముందస్తు అవసరం. రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాలలో హిందుత్వానికీ, దాని బహుళ సంస్థలకూ వ్యతిరేకంగా పట్టువిడవని రీతిలో పోరాటాన్ని నిర్వహించాలి. హిందుత్వ మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా ఈ పోరాటాన్ని బలపరచడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి.

"2.169 పార్టీ, దాని ప్రజా సంఘాలూ ఈ నిరంతర పోరాటాన్ని దిగువన పేర్కొన్న చర్యల ద్వారా నిర్వహించాలి:

i) పార్టీ ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రూపులు నిరంతరాయంగా సైద్ధాంతిక, రాజకీయ సమాచారాన్ని తయారు చేస్తుండాలి. హిందుత్వ, ఇతర మతోన్మాద శక్తులలోని అభివృద్ధి నిరోధక విషయాన్ని ఎండగడుతూ, ప్రజలలో విశాలమైన భాగాలకు చేరేలా ఇది జనరంజకమైన శైలిలో ఉండాలి.

ii) ద్వేషమూ, బెదిరింపులతో కూడిన విష ప్రచారాన్ని చేస్తూ సాగే ఫాసిస్టు దాడులను, ముఖ్యంగా మత మైనారిటీల మీద, చేసే హిందుత్వ గ్రూపుల దాడిని క్రియాశీలంగా ఎదుర్కోవాలి.

iii) హేతువాదం మీద ఆధారపడిన లౌకిక శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా పెరుగుతున్న మూఢనమ్మకాలనూ, హేతువిరుద్ధతనూ, గుడ్డి విశ్వాసాలనూ ఎదుర్కోవడానికి సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలనూ శాస్త్ర ప్రచారాన్నీ ప్రోత్సహించాలి. హిందుత్వ ముఠాలు చేసే హేతువిరుద్ధ, అహేతుకత ప్రచారాన్ని ఎదుర్కోవడానికి ఇది అవసరం.

iv) సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సమస్యలను చేపట్టాలి. 'హిందుత్వ' స్త్రీలకు సమాన హక్కులను నిరాకరిస్తుంది. జెండర్ అణచివేతను ధర్మసమ్మతమైనదిగా ప్రచారం చెయ్యడం ద్వారా స్త్రీల మీద క్రూరమైన

దాడులు చెయ్యడానికి అనువైన పరిస్థితులను సృష్టిస్తుంది.

v) విషపూరిత, గత కాలానికి చెందిన, హిందుత్వ కుల విలువలు దళితులలోనూ, ఆదివాసీలలోనూ విస్తరించడాన్ని అడ్డుకోవాలి.

vi) సామాజిక సేవా కార్యకలాపాలను ప్రోత్సహించాలి. కోవిడ్ వ్యాధి కాలంలో చేసిన పనిని ఆరోగ్య కేంద్రాల ద్వారా కొనసాగించాలి. లైబ్రరీలు, రీడింగ్ రూంలు, ఎడ్యుకేషనల్ కోచింగ్ సెంటర్లు, నైపుణ్యాన్ని పెంపొందించే సెంటర్లూ మొదలైనవి ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలి.

vii) విద్యా రంగంలో ఆరెస్సెస్, హిందుత్వ మత శక్తులు చాలా చురుకుగా పని చేస్తున్నాయి. శాస్త్రీయ స్వభావాన్ని ప్రోత్సహిస్తూ లౌకిక, ప్రజాస్వామ్య, ఏకీకరణ విషయాలను విద్యలో చేర్చి ప్రచారం చెయ్యడానికి విద్యారంగంలో మనం చొరవ తీసుకోవాలి.

"2.170 అటువంటి కార్యకలాపాలు లేనట్లయితే, ఆరెస్సెస్–బిజెపిలు, మతతత్వ సంస్థలు, సామాజిక, జాతి విభేదాలను అధిగమించి, ప్రబలంగా ఉన్న 'హిందుత్వ అస్తిత్వాన్ని' మరింత బలపరచడంలో విజయాన్ని సాధిస్తాయి. హేతువిరుద్ధతను హేతుబద్ధతతోనూ, కుతర్కాన్ని తర్కంతోనూ ఎదుర్కోవడం చాలా ముఖ్యం.

**- అక్టోబరు 13, 2022**

# స్త్రీల సమస్యల గురించీ,
# జెండర్ గురించీ పార్టీ దృక్కోణం

**జ**నతా ప్రజాస్వామ్యము, సోషలిజాల కోసం ప్రజా సమీకరణ, నిర్మాణాలకు సంబంధించి పార్టీ అవగాహనలో, వ్యూహంలో, ఎత్తుగడలలో స్త్రీల సమస్య కీలకమైనది. ఇది చెయ్యాలంటే మనం స్త్రీల మధ్య పనిచెయ్యడం మీదా, స్త్రీలు తమ కోసం పోరాడడం మీదా మాత్రమే దృష్టి పెట్టకూడదని నొక్కి చెప్పాల్సిన అవసరం ఉంది. స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్ష, అణచివేత, దోపిడీలలో, వర్గం, జెండర్, కులం, మతం, జాతులూ కలిసిపోతున్న 'ప్రస్తుత అధర్మ, అసమాన వ్యవస్థ'కు వ్యతిరేకంగా మొత్తం పార్టీని సమీకరించడం కూడా అవసరం. ఉద్యమంలోకీ, పార్టీలోకీ మరింతగా స్త్రీలను తీసుకురావాలంటే, ప్రస్తుతం ఉన్న జెండర్ సంబంధాల గురించి తమ అవగాహన, ఆచరణలను పార్టీ సభ్యులందరూ ప్రశ్నించుకోవాలి. స్త్రీల సమస్యల పట్ల మార్క్సిస్టు–లెనినిస్టు అవగాహనను అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడు మాత్రమే కమ్యూనిస్టులు నిజమైన కమ్యూనిస్టులు కాగలరు, మరింతమంది స్త్రీలు కమ్యూనిస్టులుగా అభివృద్ధి చెంది, పార్టీలో ప్రతీ స్థాయిలోనూ ముఖ్యమైన స్థానాలలో ఉండగలరు.

మరో మాటలో చెప్పాలంటే, ప్రపంచాన్ని గురించి తన సైద్ధాంతిక దృక్పథంలోనూ, వర్గ దృష్టికోణంలోనూ పార్టీకి స్త్రీల సమస్య ముఖ్యమైనది. వ్యూహరీత్యా కాని, ఎత్తుగడల రీత్యా కాని కూడా ఇది ముఖ్యమైనది. స్త్రీలను సమీకరించకుండా జనతా ప్రజాస్వామ్య విప్లవాన్ని ముందుకు తీసుకు వెళ్ళలేం. విప్లవ కార్యక్రమానికీ, జనతా ప్రజాస్వామిక విప్లవానికి కీలకమైన మద్దతును నిర్మించలేం.

ఈ ప్రసంగంలో ఒక ముందుమాటగా భారత దేశంలో స్త్రీల పరిస్థితికి సంబంధించిన కొన్ని పార్శ్వాల గురించి క్లుప్తంగా చెప్పడం జరుగుతుంది. ఆ తర్వాత ఈ ప్రసంగం పోరాటాల దిశ గురించి ఆలోచించడానికి కొన్ని సైద్ధాంతిక విషయాలనూ, 'స్త్రీల సమస్య'ను అర్థంచేసుకోవడానికి అవసరమైన ప్రామాణిక మార్క్సిస్టు–లెనినిస్టు విశ్లేషణనూ, జెండర్ రాజకీయ అర్థశాస్త్రాన్నీ వివరిస్తుంది.ఆ తర్వాత స్త్రీ సమస్యకు సంబంధించి భారత దేశానికి, ముఖ్యంగా సమకాలీన సందర్భానికి, సంబంధించి

ప్రత్యేకమైన కొన్ని  సాంస్కృతిక, సామాజిక, రాజకీయ నిర్మాణాల గురించీ, ధోరణుల గురించీ చెబుతుంది. ఆ తర్వాత స్త్రీ సమస్య గురించి డిమాండ్లను లేవనెత్తడానికీ, ఈ డిమాండ్ల మీద ప్రజలను కూడగట్టడానికీ పార్టీ యొక్క నిర్దిష్ట నిర్మాణమూ, విశ్లేషణ, విధానాల మీద దృష్టి పెడుతుంది. చిట్టచివరన కొన్ని సంస్థాగత సమస్యల గురించి మాట్లాడుతుంది.

**భారతదేశంలో స్త్రీల పట్ల వివక్ష, అణచివేత కొలమానాలు**

నేడు మనం మన చుట్టూ దృష్టిని సారిస్తే, స్త్రీలలో ఒక వైరుధ్యపూరిత పరిస్థితిని గమనిస్తాం. ఒక పక్క వివిధ వర్గాల, కులాల, మతాల, ప్రాంతాల, వివిధ జెండర్‌ల  పౌర జీవితంలోనూ మీడియాలోనూ స్త్రీలు కనుపించడమూ, ఉన్నత విద్యను అభ్యసించడమూ, కొత్త వృత్తులలో, ఉద్యోగాలలో ప్రవేశించడమూ గమనిస్తాం. వీరు స్వేచ్ఛగా, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో పాల్గొంటున్నట్లూ, తమ ఇచ్ఛానుసారం పెళ్ళి చేసుకుంటున్నట్లూ లేదా అవివాహితగానే ఉంటున్నట్లూ, వివిధ ఉద్యమాలలో చేరుతున్నట్లూ, వ్యక్తులుగానూ, సమూహంగానూ వివక్షనూ, అణచివేతనూ ప్రతిఘటిస్తున్నట్లూ కనుపిస్తుంది. ఇవన్నీ సానుకూల అంశాలే, కానీ ఇది పూర్తి కథ కానీ, ప్రధానమైన కథ కానీ కానే కాదని మనందరకూ తెలుసు.

కానీ ఈ పాక్షిక కథనూ, స్త్రీల సాధికారత గురించి రాజ్యమూ, ప్రభుత్వమూ చెప్పే కథనాన్ని దాటి ముందుకు వెళ్ళినప్పుడు, బహిరంగ ప్రదేశాలలో, అపరిచిత వ్యక్తులు స్త్రీల మీద చేసే హేయమైన, కనిపించే హింసను మాత్రమే చూస్తాం. మనం ప్రతీ రోజూ జరిగే అణచివేతలనూ, వివక్షలనూ, కించపరిచే ప్రవర్తనలనూ, సాధారణ ప్రజల, శక్తివంతమైన ప్రజల పాత్రనూ, వ్యవస్థ సంబంధాలనూ, భావజాలాలనూ, వాటిని సృష్టించి కొనసాగించే వ్యవస్థలనూ గమనంలోకి తీసుకోవాలి. అలా చెయ్యకపోతే, మనం స్త్రీలు ఎదుర్కొంటున్న బహుళ వివక్షలనూ, అణచివేతలనూ ఎండగట్టలేం, మౌలికమైన మార్పు అవసరాన్ని గుర్తించలేం.

వరల్డ్ ఎకనమిక్ ఫోరం 2022 నివేదిక ప్రకారం, జెండర్ గ్యాప్‌లో భారతదేశం 146 దేశాలలోనూ 135వ స్థానంలో ఉంది. 2006లో ఉన్న 98వ స్థానం నుండి మరింత దిగజారింది. ఈ సూచి 'ఆర్థిక భాగస్వామ్యంలోనూ, అవకాశాలలోనూ, విద్య, ఆరోగ్యం, మనుగడ, రాజకీయ సాధికారికతల మధ్య తేడాల మీద ఆధారపడి ఉంటుంది. కాలక్రమంలో ఈ అంతరాన్ని అధిగమించడానికి జరిగిన ప్రయత్నాల పురోగతిని గమనంలోకి తీసుకుంటుంది'. ఈ వివిధ కొలమానాలలో స్త్రీ పురుషుల మధ్య అంతరాన్ని అది మనకు చెబుతుంది. ప్రపంచంలో మనం ఏ

స్థానంలో ఉన్నామో కూడా వెల్లడిస్తుంది. ఈ సూచిలో క్షీణత భారదేశంలో పరిస్థితి సాపేక్షంగా దిగజారడాన్నీ, ఇతర దేశాల సాపేక్ష పురోగతినీ – రెండింటినీ వెల్లడిస్తుంది.

భారతదేశం మొత్తంలో అసమానత పెరుగుతోంది. ప్రపంచంలోనూ ఈ ప్రాంతంలోనూ ఉపాధి నియామకాలలో స్త్రీ చాలా దిగువన ఉండడంతో ముఖ్యంగా స్త్రీల విషయంలో అసమానత పెరుగుతోంది. 2017–18 పిరియాడిక్ లేబర్ సర్వే (PLFS) ప్రకారం, పనిలో భాగస్వామ్య రేటు (WPR) స్త్రీల విషయంలో 23 శాతం ఉంది. ప్రభుత్వం యజమానిగా ఉన్న చోట కూడా చాలా తక్కువ చెల్లింపు జరిగే స్త్రీల నియామకాలలో దాదాపు అన్నీ అసంఘటిత, క్యాజువల్, కాంట్రాక్ట్, ఎక్కువ పని – తక్కువ చెల్లింపు ఉన్న విభాగాలే. ఇది మరింత పెరుగుతోంది. వేతనాలలో వివక్ష ఉంది, తరచు స్త్రీలను అత్యంత తక్కువ వేతనాలను ఇచ్చే విభాగాలలో నియమించడం జరుగుతోంది. సమానమైన పనికి అసమానంగా చెల్లింపు జరుగుతోంది. చట్టాలను సవరించినా చెల్లింపు ఉన్న పని లేకపోవడం వలనా, కుటుంబాల మీద ఆధారపడి ఉండడం వలనా స్త్రీలకు ఆస్తి లేదు, సంపదా లేదు. వివాహం తర్వాత అత్తవారింటికి వెళ్ళినప్పుడు ఎక్కువ కట్నం ఇచ్చామన్న నెపంతో వారిని ఆస్తికి వారసులుగా నిరాకరించడం జరుగుతోంది.

స్త్రీ విలువ క్షీణించడమూ, లేమీ, ప్రతికూల సెక్సు నిష్పత్తిలో ప్రతిబింబిస్తుంది. 1971 లో బిడ్డల సెక్సు నిష్పత్తి 964 ఉంటే 2011 నాటికి 914 కు పడిపోయింది. సరియైన పోషకాహారం లేకపోవడమూ, పేదరికమూ ప్రసూతి మరణాల రేటు (MMR) లో ప్రతిబింబిస్తాయి. 2000 నాటికి 407 నుండి 2007లో 212 కూ, 2014–16 నాటి 130 నుండి 2020లో 99కూ తగ్గినా, ఇది ఇంకా చాలా ఎక్కువే. శిశు మరణాల రేటులో కూడా ఇదే ధోరణిని మనం గమనిస్తాం. పేదరికం వలనా, వివక్ష వలనా పోషకాహారం లేకపోవడమూ, ప్రాథమిక వైద్య సేవలూ, స్త్రీ పునరుత్పత్తి ఆరోగ్య హక్కులు లేకపోవడమూ, దీని వెనుక ఉన్నాయి.

పాఠశాలలో స్థూల నమోదు రేట్లలో (జిఇఆర్) పెరుగుదలా, దాదాపు జెండర్ సమానత్వం ఉన్నా, మాధ్యమిక, ఉన్నత మాధ్యమిక స్థాయిలలో చూసినప్పుడు, పాఠశాలను వదిలి పెట్టేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. కానీ ఉన్నత స్థాయిలలో బాలుర కంటే బాలికల GER ఎక్కువగా ఉంది. సంపాదించే ఉద్యోగాలలో బాలురు చేరవలసిన అవసరాన్నీ, గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలు పని కోల్పోవడాన్ని ఇది ప్రతిబింబిస్తుండవచ్చు. ఒక స్పష్టమైన వైరుధ్యం ఏమిటంటే – సంఖ్య రీత్యా ఉన్నత విద్యలో స్త్రీలు పురుషులతో పాటు దాదాపు సమానంగా ఉన్నారు. 18–23 వయసు గల వారిలో శాతంగా (గ్రాస్ ఎన్రోల్మెంటు నిష్పత్తి) గ్రాడ్యుయేట్, పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సులతో సహా (ఆల్ ఇండియా

సర్వే ఆన్ హైయ్యర్ ఎడ్యుకేషన్ (AISHE) 2010–20) ఎక్కువగా ఉన్నారు. కానీ, సాంకేతిక, ప్రొఫెషనల్ కోర్సులలో (STEM) - అంటే కొత్త, ఎక్కువ వేతనం లభ్యమయ్యే ఉపాధులకు దారి తీసే కోర్సులలో – తక్కువగా ఉన్నారు. జాతీయ ప్రాముఖ్యతగల సంస్థలలోనూ, ప్రైవేటు యూనివర్సిటీల లోనూ స్త్రీలు చిన్న విభాగంగా ఉన్నారు. GERలో రాష్ట్రానికీ రాష్ట్రానికీ మధ్య భేదం ఉంది. ఇండో–గేంజిటిక్ మైదానాలలోని రాష్ట్రాలలోనూ, గుజరాత్‌లోనూ ఆల్ ఇండియా సగటు కన్నా తక్కువగా ఉంది. కేరళ, మరికొన్ని రాష్ట్రాలలో ఎక్కువగా ఉంది. దళితులు, ఆదివాసీలు, ముస్లింలు స్త్రీలకు విద్య అందుబాటు లేకపోవడం వలన అక్షరాస్యతలోనూ, విద్యా స్థాయిలోనూ తక్కువ స్థాయిల్లో ఉన్నారు. దారిద్ర్యం, ప్రభుత్వ సౌకర్యాలు లేకపోవడం, బాలికలకు తేలికగా, సురక్షితంగా పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, పాఠశాల వాతావరణంలో వివక్షను అనుభవించడమూ మొదలైనవి కారణాలు.

అసెంబ్లీలకూ, పార్లమెంటుకూ ప్రతినిధులగా ఎన్నికవుతున్న స్త్రీల శాతం 1952 నాటి 5 శాతం నుండి లోక్‌సభలో 10 శాతానికి, 14 శాతానికి, అసెంబ్లీలలో 9 శాతానికి పెరిగింది. 1952లో యు.కె., యు.యస్.తో సహా అనేక పశ్చిమ ప్రజాస్వామ్య దేశాల కంటే భారతదేశంలో ఎన్నికైన స్త్రీ ప్రతినిధుల శాతం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు పశ్చిమ దేశాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉండడం మాత్రమే కాదు, ఇది పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా, తాలిబాన్ తిరిగి అధికారాన్ని చేపట్టకముందుకు ఆఫ్ఘనిస్తాన్‌ల కంటే తక్కువగా ఉంది. బ్యూరోక్రసీలో అన్ని స్థాయిలలోనూ స్త్రీల శాతం చాలా తక్కువగా ఉంది. కొంతమంది ప్రముఖంగా కనుపించడం వలన ఈ వాస్తవం స్పష్టంగా కనిపించదు.

హింస విషయానికి వస్తే, గృహంలో పెరుగుతున్న, లేదా కనీసం కొనసాగుతున్న, హింసను గమనిస్తాం. భర్తా, అతని బంధువులూ స్త్రీల మీద జరిపే క్రూరత్వానికి సంబంధించిన కేసులు 2018 నాటి 16.1 శాతం నుండి 2019లో 19.3 శాతానికి పెరిగాయి. బలాత్కార కేసులు మాత్రం 2017 – 2019ల మధ్య క్షీణించాయి. బలాత్కార కేసులల 94 శాతానికి మించిన కేసులలో నేరస్తుడు బాధితురాలికి తెలుసున్నవాడే – తరచు కుటుంబ సభ్యుడు, బంధువు – అన్న విషయాన్ని గమనించడం ముఖ్యం. అంటే సురక్షితమని భావించబడిన స్థలాలలోనే, 'కుటుంబ' సభ్యుల చేతనే స్త్రీలు బలాత్కారానికి గురవుతున్నారు. పబ్లిక్ రంగంలో హింస – రాజ్య హింసతో పాటు సెక్సువల్, శారీరక, సాంస్కృతిక హింస – భయంకరమైన రూపాలను తీసుకుంటోంది. పబ్లిక్, ప్రైవేటు హింసలను తరచు రిపోర్టు చెయ్యడం జరుగదు. దీనర్థం ఏమిటంటే – అంతకంతకు ఎక్కువగా స్త్రీలు రిపోర్టు చెయ్యడానికి

ధైర్యాన్ని చూపిస్తుంటే, అన్ని కేసులను రిపోర్టు చెయ్యడం జరగడం లేదు. తరచు పోలీసులు కేసులను, ముఖ్యంగా పేద, కార్మిక వర్గ, దళిత, లేదా మైనారిటీలకు చెందిన స్త్రీల కేసులను, రిజిష్టరు చెయ్యడానికి తిరస్కరిస్తారు. ప్రబలంగా ఉన్న కట్టుబాట్లను ఎదిరించినప్పుడు స్త్రీలను నిందించడం జరుగుతుంది, సాంస్కృతిక, సామాజిక అపవాదును ఎదుర్కోవలసి వస్తుంది....

దళిత స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షనూ, అణచివేతనూ అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ స్త్రీలు తీవ్రమైన జెండర్, ఆర్థిక అసమానతల బాధితులు మాత్రమే కాదు, వారు అత్యంత హీనమైన హింసకూ, లైంగిక దాడులకూ గురవుతుంటారు. దేశంలో అనేక ప్రాంతాలలో ఇది మరింత ఎక్కువవుతోంది. NCRP ప్రకారం, ప్రతీ రోజూ10 మంది దళిత స్త్రీలూ, బాలికలూ బలాత్కారానికి గురవుతుంటారు. తరచు వారు సామూహిక అత్యాచారాలకు గురై హత్య చెయ్యబడుతుంటారు.

ఆర్థిక, రాజకీయ వనరులు లేని వారు తమ గోడును వినిపించడానికి సోషల్ మీడియా ఒక కొత్త ఛానల్‌గా ఉంది. కానీ దీనికి రెండువైపులా పదునుంది. తమ గొంతు వినిపించే స్త్రీలను, ముఖ్యంగా వివక్షకు గురయిన మతానికీ, కులానికీ చెందిన స్త్రీలను, కించపరిచే సందేశాలు ప్రబలంగా ఉంటున్నాయి.

జెండర్ చుట్టూరా వర్గం, కులం, మతం, ప్రాంతీయ విలువలు, నిర్మాణాలు, సంబంధాలూ– స్త్రీల అణచివేత, వివక్ష, కష్టాలు, స్త్రీలను చిన్నచూపు చూడడం కొనసాగించడంలో ఏకమవుతాయి. కానీ, స్త్రీలూ, అణచివేతకు గురవుతున్న ఇతర సమూహాలూ, దోపిడీకి గురవుతున్న వర్గాలూ, పార్టీ చేతులు ముడుచుకు కూర్చోలేదు. భక్తి మార్గానికి చెందిన పవిత్ర స్త్రీల నిరసన చరిత్ర ఉంది. వర్గం, కులం, జెండర్, గృహ హింస లాంటి సమస్యలను ఇటీవలి శతాబ్దాలలో ప్రశ్నించడం జరిగింది. స్త్రీల సామూహిక చర్యలలోనూ, తెలంగాణా వ్యవసాయక విప్లవం, తేభాగా పోరాటాల లాంటి పార్టీ, దాని సంస్థల నాయకత్వాన జరిగిన పోరాటాలలోనూ ఇలా ప్రశ్నించడం జరిగింది. స్త్రీలు వివిధ విధాలుగా – రహస్య జీవితంలోనూ, సాయుధ సంఘర్షణలలోనూ – ఈ పోరాటాలలో పాల్గొన్నారు, ముఖ్య పాత్రలను పోషించారు. ఆ విధంగా జెండర్ సంబంధాలనూ, సంస్థలనూ ఎప్పుడూ అస్థిరం చెయ్యడమూ, రాజ్యమూ, పాలక వర్గాలూ తిరిగి ఉద్ఘాటించడమూ జరుగుతూనే ఉంది. ప్రస్తుత కాలంలో స్త్రీలూ, స్త్రీల సంస్థలూ, అనేక ఇతర గ్రూపులు చేస్తున్న వివిధ రకాల పోరాటాలలో పెరుగుదల గురించి మాట్లాడేటప్పుడు, ఒంటరి స్త్రీలు నిరసన తెలియజెయ్యడమూ, ప్రతిఘటించడమూ ఎంత కష్టమో మనం గుర్తు పెట్టుకోవాలి. అన్ని ప్రజా సంస్థలూ, పార్టీ మరిన్ని పోరాటాలనూ, ఉద్యమాలనూ సాగించాల్సిన అవసరం ఉంది. అటువంటి ఉద్యమాల

దృష్టికీ, సమస్యలకూ, రూపాలకూ ఒక నిర్దిష్ట రూపాన్నివ్వడానికి, పైన వివరించిన పరిస్థితి గురించి మనకు ఒక స్పష్టమైన మార్క్సిస్టు–లెనినిస్టు అవగాహన, విశ్లేషణ అవసరం.

### నేటి స్త్రీల సమస్య విశ్లేషణలో కొన్ని జాగ్రత్తలు

ఒక్కొక్కప్పుడు ప్రజలు, పార్టీ సభ్యులు కూడా, ఫ్యూడలిజం కొనసాగడం మీదా, స్త్రీల కదలిక మీద ఆంక్షలు, స్త్రీల అణచివేత, స్త్రీలు అపవిత్రులు అనే రకరకాల ఆచారాల మీదా, స్త్రీల అణచివేత ఆధారపడి ఉంటుందని అనడం మనం చూస్తుంటాం. వారు అటువంటి విశ్లేషణను సమర్థిస్తున్నట్లు కనుపిస్తుంది. కానీ ఇది ఒక తప్పు. సమకాలీన భారతదేశ సామాజిక నిర్మాణంలో కొన్ని భాగాలలో ఫ్యూడలిజానిది పైచేయి కావచ్చు, మరికొన్ని భాగాలలో కేపిటలిజానిది పై చేయి కావచ్చు. ఈ దేశంలో కేపిటలిస్టు, ఫ్యూడల్ నిర్మాణాలూ, సంబంధాలూ కలిసి పనిచేస్తాయి. క్యాపిటలిస్టు సంబంధాల, లేదా ఫ్యూడల్ సంబంధాల స్వభావంగా కనుపించి దోపిడీ, వివక్ష, అణచివేతలు పాతుకుపోయేటట్లు చేస్తాయి. రెండూ జెండర్ అణచివేతను తయారు చేస్తాయి, రెండూ ప్రధాన వర్గాన్నీ, మిత్ర వర్గాలనూ విభాగాలనూ సమీకరించకుండా అడ్డుపడతాయి, ఒకదానినొకటి బలపరుచుకుంటాయి. ఆ కారణంగా ఈ రెండింటితోనూ మనం పోరాడవలసి ఉంటుంది. ఫ్యూడల్, వ్యవసాయిక సందర్భంలో జెండర్, కుల, సామాజిక, మత విభజనలను మనం గమనిస్తాం. కానీ ఆధునిక వ్యవస్థలు అని చెప్పబడే వ్యవస్థలలో కూడా గత యుగం నాటి అణచివేత, విభజన సంబంధాలు కొనసాగడం కూడా మనం గమనిస్తాం.

జెండర్ అణచివేతను కేవలం పాత సామాజిక, ఆర్థిక నిర్మాణాల అవశేషాలుగానూ, ప్రభావంగానూ – ఈ సమస్యకు ఆ కోణం కూడా ఉన్నా – మనం చూడకూడదు. అత్యంత ఆధునికమైన కేపిటలిస్టు దేశాలలో గమనిస్తున్నట్లు, ఇది ఆధునిక కేపిటలిస్టు రాజకీయ ఆర్థిక వ్యవస్థలోనూ, కుటుంబ, సామాజిక వ్యవస్థలలోనూ ఒక భాగం. స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు – చెల్లింపు లేని శ్రమ భాగం, అసమాన వేతనాలు, ఉద్యోగాలలో, ప్రమోషన్లలో అసమానావకాశాలు దీనికి రుజువు. తార్కికంగా, కేపిటలిస్టులు లాభం సంపాదించే పద్ధతి అన్ని సామాజిక సాంస్కృతిక తేడాలకు వర్తిస్తుంది కానీ తన లాభాలను పెంచుకోవడానికీ, అణచివేతకు గురైనవారిని విడదీయడానికి బూర్జువా వర్గం అటువంటి విభేదాలను రెచ్చగొడుతుంది, ఉపయోగించుకుంటుంది,

వర్గం, జెండర్, కుల నిర్మాణాలూ, సంబంధాలూ లోతుగా పెనవేసుకుపోయి

ఉంటాయి. ఒక్కొక్క సమస్య యొక్క విలక్షణతలను పరిగణలోకి తీసుకుంటూనే, ఇతర సమస్యలనుండి విడదీసి ఏ ఒక్క సమస్యను మనం చూడకూడదు. స్త్రీలు ప్రధాన వర్గాలలో– కార్మికులు, వ్యవసాయ కూలీల వర్గాలలో – ఒక భాగం. వ్యవసాయ కూలీలలో అధికభాగం దళితులూ, దిగువ కులాలకూ, మత మైనారిటీలకు చెందిన వారు. దీనర్థం ఏమిటంటే, స్త్రీలు రెండు, మూడు రకాల అణచివేతలనూ, దోపిడీనీ స్త్రీలుగా, కార్మిక వర్గంలో ఒక భాగంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అణచి వెయ్యబడుతున్న కులాలకు చెందిన స్త్రీలుగా అనుభవిస్తారు. అయినా, స్త్రీల అణచివేతకు సంబంధించిన అనేక అంశాలు కుల, వర్గ, మతాలకు అతీతంగా ఉంటాయి. ఏ పరిస్థితుల మధ్య అవి పని చేస్తాయి అన్న దానిలో ఈ అణచివేత స్థాయిలలో తేడాలు ఉండవచ్చు. ఆ కారణంగా, పార్టీ స్త్రీలను స్త్రీలుగా, కార్మికులుగా, పౌరులుగా పరిగణిస్తుంది. స్త్రీల సమస్య మీద ప్రామాణిక మార్క్సిస్టు–లెనినిస్టు విశ్లేషణ యొక్క ప్రాథమిక సూత్రాలను తెలుసుకున్న తర్వాత, ప్రస్తుత వ్యూహాలకు నిర్దిష్ట రూపాన్నిస్తున్నప్పుడు, మళ్ళీ ఈ విషయం గురించి మాట్లాడుకుందాం.

**గతి తార్కిక, చారిత్రక భౌతిక వాదం,**
**జెండర్ అణచివేత పుట్టుక - ఏంగెల్స్**

స్త్రీల సమస్య గురించి ఏంగెల్స్, బెబెల్, లెనిన్ తదితరులు రచించిన మార్క్సిస్టు ప్రామాణిక గ్రంథాల నుండి మన సాధారణ సైద్ధాంతిక అవగాహనను ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక చారిత్రక నిర్మాణంలోనూ, ప్రత్యేక సమాజాలలోనూ – పని ప్రదేశంలోనూ, పబ్లిక్ రంగంలోనూ, కుటుంబంలోనూ, గృహంలోనూ స్త్రీల అణచివేత, పరిస్థితుల గురించి చర్చలు జరిగాయి. సోషలిస్టు దేశాల – ఉదాహరణకు యు.యస్.యస్.ఆర్, జి.డి.ఆర్, చైనాలతో సహా – విధాన పత్రాలు, అధ్యయనాలు ఉన్నాయి. కానీ ఇక్కడ చర్చ ప్రధానంగా ఏంగెల్స్ రచన 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యం పుట్టుక' మీద ఆధారపడి ఉంటుంది. మోర్గాన్ రచన 'ప్రాచీన సమాజం' గురించి మార్క్స్ నోట్స్ మీద ఆధారపడి ఏంగెల్స్ ఈ పుస్తకాన్ని రచించాడు.

ఫెమినిస్టు కార్యక్రమాన్నీ, ఆలోచననూ పునరుజ్జీవింపచెయ్యడంలో ఏంగెల్స్ పుస్తకం చాలా ముఖ్యమైనది. తరచు అతని ప్రతిపాదనలను వక్రీకరించినప్పటికీ మార్క్సిస్టు వ్యతిరేకులను, సోషలిస్టు వ్యతిరేకులను కూడా ఈ పుస్తకం ప్రభావితం చేసింది. మన కార్యకలాపాలను ఏర్పాటు చేసుకోవడంలోనూ, జెండర్ విముక్తి అవకాశాల గురించి రాజకీయ–సైద్ధాంతిక చర్చలను, పోరాటాలను నిర్వహించడం

లోనూ మార్క్సిస్టు దృక్కోణం గురించి తెలుసుకోవడానికీ ఈ పుస్తకం చాలా విలువైనది.

ఏంగెల్స్ ఇచ్చిన చారిత్రక వివరాలు నూతన ఆర్కిలాజికల్ ఆవిష్కరణల నేపథ్యంలో చర్చించుకోవచ్చు. తర్వాతి అధ్యయనాలలోని కొన్ని అంశాలను స్వీకరించవచ్చు. అందువలన ఏంగెల్స్ తదనంతర అధ్యయనాలు వెల్లడించిన కొన్ని అంశాలను ఇక్కడ ప్రస్తావిస్తాం. ఏంగెల్స్ యొక్కా, అతని ప్రామాణిక విశ్లేషణ యొక్కా ప్రాముఖ్యత, జెండర్ అణచివేతను అర్థం చేసుకోవడానికి అతను అనుసరించిన చారిత్రక, గతితార్కిక భౌతికవాద పద్ధతిలోనూ, విశ్లేషణలోనూ ఉంది. సమకాలీన పరిణామాలను అర్థం చేసుకోవడానికి మనకు ఇది ఒక విశాలమైన నిర్మాణాన్ని ఇస్తోంది. వర్గాన్నీ జెండర్ విముక్తినీ జోడించి ముందుకు పోవడానికి అతని చారిత్రక విశ్లేషణ మన పోరాటాలకు ఒక విశాలమైన అవగాహన ఇస్తోంది.

మొదటి విషయం ఏమిటంటే – స్త్రీల 'తక్కువ హోదా', అణచివేతా మానవ జాతీ, మానవ సమాజమూ ఉనికిలోకి వచ్చినప్పటినుండీ లేదు. అంటే, **స్త్రీ అణచివేతను కొనసాగించడానికి జీవశాస్త్రాన్ని తరువాత ఉపయోగించుకున్నా, పునరుత్పత్తికి సంబంధించిన సమస్యలు జెండర్ సమానత్వానికి కీలకమైనవి అయినా, ఇది జీవసంబంధమైన కారణం వలన నిర్ణయించబడినది కాదు.** ఏంగెల్స్‌ను ఉటంకిస్తే – **'అంతిమంగా చరిత్రలో నిర్ణయాత్మకమైన అంశం – ఉత్పత్తి, జీవితం యొక్క పునరుత్పత్తి. దీనికి రెండు రకాల స్వభావం ఉంది – (i) జీవితావసరాల ఉత్పత్తి (ii) మనుషుల ఉత్పత్తి.'**

దీనర్థం ఏమిటంటే – ఒక ప్రత్యేక యుగపు సామాజిక నిర్మాణం రెండు రకాల ఉత్పత్తుల చేతా నిర్ణయించ బడుతుంది. ఆ కారణంగా శ్రమ పరిణామ దశా, 'కుటుంబం' స్వభావమూ, జెండర్ సంబంధాలూ కీలకమైనవి. పాత వ్యవస్థలోనే నూతన సామాజిక అంశాలు అభివృద్ధి చెందుతాయనీ, పాతలో పెరుగుతున్న వైరుధ్యాలూ, పాతకి కొత్తకి మధ్య సంఘర్షణలూ ఒక గుణాత్మకమైన మార్పుకు దారి తీస్తాయనీ గతి తార్కిక పద్ధతి మనకు చెబుతుంది. ఒక్కొక్కప్పుడు, గుణాత్మకంగా భిన్నంగా ఉన్నా రూపం మారినట్లు కనుపించదు. ఒకసారి ఉనికి లోకి వచ్చిన తర్వాత, అర్థాలూ, రూపాలూ మారినా స్త్రీల అణచివేత అన్ని వర్గ సమాజాలలోనూ కొనసాగింది.

### శ్రమ, ఆస్తి రూపాలు, పబ్లిక్ రంగంగా గృహం, తొలి సమాజాలలో శ్రమ యొక్క సెక్సువల్ విభజన

మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రం ప్రకారం, శ్రమా, శ్రమ ఉత్పాదకతా తక్కువగా ఉన్న కొలదీ, ఉత్పాదకాలూ, ఉత్పత్తి అయిన సంపదా మరింత పరిమితంగా ఉంటాయి. వేట, ఆహార సేకరణ మీద ఆధారపడిన తొలి సమాజాలలో, ప్రకృతి

నుండి ప్రత్యక్షంగా సంపాదించడం మీద జీవితం ఆధారపడి ఉండేది. అదనపు ఉత్పత్తి ఉండేది కాదు. పిల్లలు మినహా పని చెయ్యని ఇతరుల జీవితం ప్రాధాన్యత కలిగి ఉండేది కాదు. బంధువుల సమూహాలలోనే ఉత్పత్తి, పంపిణీలుండేవి. ఆదిమ కమ్యూనిస్టు సమాజ స్వభావం ఇది. ప్రతీ వ్యక్తికీ /పని చేసేవాడికీ నేలను తవ్వడానికి కర్రలు, బుట్టలు, జంతువులను పట్టడానికి బోనులు, ఆయుధాలు, చేపలు పట్టడానికి బోట్లు, బల్లాలు, వలలు, రాడ్లు మొదలైన తన స్వంత ఉత్పత్తి పరికరాలు ఉండేవి. బహుశా వారు ఒక సమూహంలో, లేదా సమిష్టిగా, ఈ పరికరాలను తయారు చేసుకునే వారు. శ్రమించిన సమూహం చేతుల్లోనో, లేదా వ్యక్తి చేతుల్లోనే ఉత్పత్తి ఉండేది. కానీ దాని ఉపయోగమూ, వినియోగమూ – పంచుకోవడమూ, ఒక చోట చేర్చడమూ, తిరిగి పంచుకోవడమూ – కమ్యూనిటీ కట్టుబాట్ల ప్రకారం జరిగేది.

స్త్రీలు ప్రధానంగా ఆహారాన్ని సేకరించేవారు. తరచు ఆహారంలో ముఖ్య భాగాన్ని సేకరించడం ద్వారానూ, చిన్న చిన్న జంతువులను వేటాడడం ద్వారానూ ఆహారంలో గణనీయమైన భాగాన్ని సంపాదించేవారు. ఎందుకంటే మగవారు పెద్ద జంతువులను వేటాడేవారు, ఈ వేట అనిశ్చితంగా ఉండేది. అంతేకాక స్త్రీల పునరుత్పత్తి సామర్థ్యం కూడా చాలా విలువైనది. వేటాడే, ఆహారాన్ని సేకరించే సమాజాలకు వారి బహు సంతతి, సంతానోత్పత్తి, పిల్లల పెంపకం, పిల్లలకి పాలివ్వడం లాంటివి కీలకమైనవి. ఈ సమాజాలలో మనిషి జీవితం క్షణికంగా ఉండేది. ఆ కారణంగా సమాజం బతికి బట్టడానికి స్త్రీలు చాలా అవసరమయ్యేవారు, సమూహంలో ముఖ్య సభ్యులుగా ఉండేవారు. గర్భిణీ స్త్రీలనూ, పాలిచ్చే స్త్రీలనూ పిల్లలకు దగ్గరగా జాగ్రత్తగా కాపాడవలసి వచ్చేది. స్త్రీలు బలహీనంగా ఉండడం వలన కాక పిల్లలు బలహీనంగా ఉండి, తల్లుల మీద ఆధారపడడం వలన ఇది జరిగేది. ఫలితంగా, స్త్రీల కార్యకలాపాలు హద్దూ పద్దూ లేని ప్రమాదాలకు దూరంగా, నివాసాలకు పరిమితమై ఉండేవి. స్త్రీల యొక్క ఈ శక్తిని కాపాడవలసి వచ్చేది. అది అందరూ గుర్తించిన సామాజిక బాధ్యత. ఈ సంరక్షణ బాధ్యతలు మోపిన సెక్సువల్ శ్రమ విభజనలో, మగవారు ప్రమాదకరమైన వేటకూ, యుద్ధాలకూ వెళ్ళేవారు. సమీపంలో ఉన్న అడవుల నుండి స్త్రీలు ఆహారాన్ని సేకరించేవారు. ప్రమాదకరమైన వేటకు దూరంగా, గృహ కార్యకలాపాలకు పరిమితమై ఉండేవారు.

మొట్టమొదటి శ్రమ విభజన స్త్రీ పురుషుల మధ్య జరిగిందని ఏంగెల్స్ చెప్పినా, ఇది స్త్రీల శారీరక పరిమితుల, జీవ సంబంధమైన పరిమితుల ఫలితమని

కానీ, మార్పు లేకుండా శాశ్వతంగా ఉండేది అని కానీ, అతను ఎన్నడూ భావించలేదు. చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే, అది హెచ్చుతగ్గుల భావన కానీ, స్త్రీల విలువనూ శ్రమనూ కించపరచడం కానీ కాదు. లేదంటే తొలి సమాజాలలో దీనికి విరుద్ధంగా స్త్రీలకు అధిక ప్రాధాన్యత ఉండేది. కానీ అది అలా కొనసాగలేదు.

స్త్రీలు గృహాన్ని, అంటే కమ్యూనిటీని, నిర్వహించేవారు. వారి పని రంగం పబ్లిక్ రంగం. పబ్లిక్, ప్రైవేట్‌ల మధ్య విభజన ఏమీ లేదు. కుటుంబ కమ్యూనిటీ పబ్లిక్ రంగంగా ఉండేది. ఇది తర్వాత ఉనికిలోకి వచ్చిన, ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న, ప్రైవేట్, హెచ్చు తగ్గుల గృహమూ, కుటుంబమూ కాదు. గృహమూ, కమ్యూనిటీలు విడివిడిగా, ప్రత్యేకంగా ఉండేవి కావు. కొత్త తరం ఏ సమూహంలో భాగమూ, కొత్త తరాన్ని ఏ సమూహం పెంచి పెద్ద చెయ్యాలి, కొత్త తరం మీద ఏ సమూహానికి హక్కు ఉంది? అన్న అంశాలను తల్లి హక్కు నిర్ణయించేది. తల్లి హక్కు మాతృస్వామ్యం కాదు. అధికారమూ, నిర్ణయం తీసుకోవడమూ భిన్నంగా విస్తరించిన ఒక రూపం. కమ్యూనిటీ బతికి బట్టకట్టడానికి పునరుత్పత్తి ప్రాముఖ్యత కారణంగా, కమ్యూనిటీ నిర్ణయాలలో స్త్రీలకు ప్రధాన పాత్ర ఉండేది. వేటాడే, ఆహారం సేకరించే అనేక సమాజాలలో మాతృ దేవతల ప్రాముఖ్యతలోనూ, యుద్ధమూ–శాంతి విషయాలలో స్త్రీ నిర్ణయాల ప్రాముఖ్యతలోనూ మనం ఇది చూడవచ్చు. కమ్యూనిటీ యొక్క రాజకీయ, మత జీవితంలో వారు క్రియాశీలంగా ఉండేవారు, సమాన పాత్ర కంటే ఎక్కువ పాత్రే పోషించేవారు.

### ఉత్పత్తి విధానంలో మార్పులు, యాజమాన్యం, కుటుంబం లోపల సంబంధాలు, తలెత్తుతున్న అసమానతలు

ప్రకృతి ఉత్పాదితాలను ప్రత్యక్షంగా వినియోగించడం నుండి క్రమంగా మానవ శ్రమా, కార్యకలాపాల ద్వారా ప్రకృతి మీద పని చేస్తూ, దాన్ని మారుస్తూ ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందినప్పుడు – శ్రమ ఉత్పాదకత పెరిగింది. జీవన సాధనాల వనరుల మీద మనిషి ఆధిపత్యాన్ని సంపాదించాడు. ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తికీ (పారలతో చేసే వ్యవసాయం), వేట నుండి పశుపాలనకూ జరిగిన మార్పులో ఇది మనం చూడవచ్చు. ఈ మార్పులతో 'ప్రతీ రోజూ కొత్తగా' ఆహారాన్ని సంపాదించవలసిన అవసరం తప్పింది. తమనూ, సమూహాలు కొనసాగించడానికి అవసరమైన పసిపిల్లలనూ, రోగగ్రస్తులూ, క్షత గాత్రులనూ మాత్రమే కాక మరింత

మందిని భరించడం సాధ్యమైంది. మరో మాటలో చెప్పాలంటే, కొందరి శ్రమ మీద ఎక్కువ మంది బతకగలిగేవారు. సమూహం జీవించడానికి అవసరమైనదానికి కంటే అధికంగా ఉత్పత్తి, వర్గ సమాజం పెరగడానికి ఒక కీలక అంశం. ఉత్పాదకత అంతకంతకు పెరగడంతో, కుటుంబం నుండీ, తెగ నుండీ సమర్థులైన వారు కొంతమంది విడిపోయి ఒక విశేషాధికారాలు గల సమూహం ఏర్పడే అవకాశం తలెత్తింది.

క్రమంగా జంతువులను మచ్చిక చెయ్యడం ప్రారంభించినప్పుడు, వెంటనే లభించే మాంసమూ, పాలు, పాల ఉత్పాదితాలు, కోళ్ళూ, గుడ్లూ మొదలైనవి సంపాదించడానికి మందలను సాకడం ప్రారంభమైంది. పెద్ద జంతువును సాధారణంగా సమిష్టిగా వేటాడేవారు. వేట పురుషుల పనిగానే ఉండేది. పశువుల మందలు తొలుతగా తెగలకు / గణాలకు, లేదా జంతువును మచ్చిక చేసిన వ్యక్తికీ చెంది ఉండేవి. పరికరాలు, వ్యక్తిగత వస్తువులు, స్వంత శ్రమతో చేసిన ఉత్పత్తి వంటి ఉనికిలో ఉన్న సంపద వ్యవస్థలోకి మందలు చేరాయి. పోడు (slash and burn) వ్యవసాయం ముందు ప్రారంభమైందా? లేక పశుపోషణ ముందు ప్రారంభమైందా? అనే విషయం గురించి పురాతత్వ శాస్త్రజ్ఞుల మధ్య చర్చలు జరిగాయి. కానీ చాలాకాలం వరకూ పోడు వ్యవసాయం సమిష్టి భూముల మీద సమిష్టి కార్యకలాపంగా ఉండేది. వనరులో ఉండే తేడాలు – భూమి–అడవులకూ, వ్యక్తిగతంగా ఉండే పశువులకూ మధ్యా, కార్యకలాపాలలోనూ తేడాలు – పారలతో వ్యవసాయంతో పోల్చి చూసినప్పుడు వ్యక్తిగతంగా మందలు పెంచడాన్ని సాధ్యం చేశాయి. అదే ఆస్తి పునాది మీద శ్రామికుడు ఉత్పత్తికి యజమాని అయ్యాడు. ప్రకృతి వనరులను సమిష్టిగా అనుభవించే పద్ధతి నుండి గృహంలో పెంచే పశు సంపదకు మార్పు జరిగింది. పెద్ద జంతువులను వేటాడే వేటగాడు, పాలనూ, మాంసాన్ని ఇచ్చే పశువులను పెంచాడు, వాటిని తన అధీనంలోకి తెచ్చుకున్నాడు, ఆ పశువులు అతని స్వంతం అయ్యాయి. తెగల, గణాల ఉమ్మడి ఆస్తిగా ఉన్న పశు సంపద వ్యక్తుల ఆస్తిగా మారిన ప్రక్రియను మనం ఖచ్చితంగా తెలుసుకోలేం. జీవన సాధనాలుగా ప్రాముఖ్యతను సంతరించుకుంటున్న పశు సంపదను నియంత్రించే ప్రక్రియలో ఈ వ్యక్తులు క్రమంగా కుటుంబంలోనూ, తెగలోనూ మరింత అధికారాన్ని సంపాదించుకుని అధిపతులయ్యారు.

ఒక వ్యక్తి తనూ, ఇతరులూ జీవించడానికి అవసరమైనది ఉత్పత్తి చెయ్యగలగడం వలన, బానిసలు ఆర్థికంగా ఉపయోగపడ్డారు. కుటుంబాలోనూ, తెగలోనూ 'సహజ పెరుగుదల' అనుమతించిన దానికంటే మరింత శ్రమను

ఉపయోగించగల పరిస్థితి ఏర్పడింది. ఓడిపోయిన శత్రు సైనికులను చంపకుండా బానిసలుగా చెయ్యడం ప్రారంభమైంది. బానిస ఆర్థిక వ్యవస్థ తలెత్తినప్పుడు, మొట్టమొదట దోపిడీకి గురయిన వారు బహుశా 'అపరిచితులు' అయి ఉండవచ్చు. కానీ ఉత్పత్తికీ, పునరుత్పత్తికీ విలువైనవారిగా భావించబడే స్త్రీలు ముఖ్యంగా ఉండేవారు. అలా మొట్టమొదటి వర్గ సమాజం ఏర్పడింది.

వ్యక్తిగత యాజమాన్యంలో ఉండే సంపద పెరిగినప్పుడు, వారసత్వం ప్రాముఖ్యతను సంతరించుకుంది. వనరులలోను, మిగులులోను, సంపద లోను అసమానతలు వేళ్లూనుకొన్నప్పుడు ప్రైవేటు ఆస్తి అవిర్భవించడానికి మూలాలు ఏర్పడ్డాయి. పశు సంపద, యుద్ధంలో పట్టుబడిన ఖైదీలు లాంటి ఉత్పాదక ఆస్తిని స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత స్వంతం చేసుకోవడంతో పురుషుల వ్యక్తిగత ఆస్తి పెరిగింది. కుటుంబంలో వారి స్థానం స్త్రీల స్థానం కంటే ప్రముఖంగా మారింది. వ్యక్తిగత ఆస్తిని పొందడానికి వారసులకు చట్టబద్ధతను కల్పించాలనే కోరిక, స్త్రీలను ఏకాంతవాసానికి పరిమితం చెయ్యడానికీ, వారి హోదాను తగ్గించడానికీ ఒక ముఖ్య కారణం అయింది. వారసత్వాన్ని తల్లి నుంచి పరిగణించడానికి బదులు తండ్రి నుంచి పరిగణించడం ప్రారంభమైంది. తల్లి వారసత్వం కొనసాగిన చోట కూడా స్త్రీలలోనూ, స్త్రీల, యువత మీదా పురుషుల, కుటుంబ పెద్దల క్రమానుగత, నియంత్రణ వ్యవస్థలు తలెత్తాయి. వ్యక్తిగత ఆస్తి వ్యవస్థా, హోదా, వర్గమూ కుటుంబ వ్యవస్థమీద పెత్తనం చెలాయించసాగాయి, సమానత్వ సంబంధాలను కూలద్రోశాయి. వేట, ఆహార సేకరణ, తొలి పశు పోషక, వ్యవసాయ సమాజ సంస్కృతికి చెందిన సంప్రదాయాలు – పంచుకోవడమూ, ఒక చోట చేర్చడమూ, తిరిగి పంచుకోవడమూ – అంతమై విశేషాధికార, వర్గ వ్యవస్థలకు దారి తీశాయి.

## వర్గం, పితృస్వామ్య వ్యవస్థ, రాజ్యం

ఉత్పత్తి సంబంధాలలోనూ, కుటుంబ సంబంధాలలోనూ భౌతిక మార్పులతో పాటు వివిధ రకాల శ్రమల విలువలు కూడా మారుతాయి. కొత్త సామాజిక శ్రమ విభజనలతో, ఆదిమ కమ్యూనిజం నుండి హోదాలకూ, ఆ తర్వాత వర్గ సమాజానికీ మారడం జరిగిన తర్వాత, అదే రకంగా కనుపించే గృహ / కమ్యూనిటీ శ్రమ విభజనల అర్థాలు, విలువలు, ఫలితాలు కూడా మారాయి. స్త్రీల పని విలువ తగ్గిపోయింది. ఇంతకు ముందు లాంటి సెక్సువల్ శ్రమ విభజన కొనసాగుతున్నా, ఇప్పుడు తలక్రిందులైన విలువలతో అది ముడిపడింది. వనరులూ, సంపదా, రాజకీయ స్వరమూ అందుబాటులో లేకుండా పోయాయి. స్త్రీలకు గృహంలో ఆధిపత్యాన్ని ఇచ్చిన గృహ

సంబంధాలు తలక్రిందులయ్యాయి. స్త్రీ ఇప్పుడు పురుషాధిక్యత క్రింద గృహ శ్రమకే పరిమితమైంది. గృహ నిర్వహణకు ఉన్న పబ్లిక్ స్వభావం అంతమై, అది ఒక ప్రైవేటు సేవగా మారింది. దీన్నుంచి స్త్రీలను ఎలా విముక్తి చెయ్యాలి? అన్నది తర్వాత చర్చిద్దాం.

వ్యవసాయ, చేతి వృత్తుల శ్రామికులలో ఒక భాగంగా ఉన్నట్లుగానే, ఆధునిక పారిశ్రామికీకరణలో కూడా స్త్రీలు పారిశ్రామిక కార్మిక శక్తులలో ఒక భాగంగా ప్రారంభంలో ఉండేవారు. స్త్రీల మీద రెండు రకాల బరువులుండేవి. 'ఇంగ్లండులో కార్మిక వర్గ పరిస్థితులు' రచనలో ఏంగెల్స్ వర్ణించినట్లు, స్త్రీలు తీవ్రమైన దోపిడీ పరిస్థితులలో ఉండేవారు. పెట్టుబడిదారీ విధానం మరింత అభివృద్ధి చెందడంతో దానికి ఒక శ్రామిక రిజర్వు సైన్యం అవసరమైంది. ఈ 'అస్థిర' శ్రామిక సైన్యానికి స్త్రీలు కేంద్రమయ్యారు. స్త్రీల శ్రమ విలువ తగ్గింపు, గృహ శ్రమను సహజంగా పరిగణించడమూ, స్త్రీలకు అసమాన వేతనాలను ఇవ్వడానికి ఒక వాదనగా ఉపయోగించడం జరిగింది. స్త్రీలను పనిలోకి తీసుకోవడం ఆఖరున, పని నుండి తొలగించడం ముందూ జరిగేది. శారీరక శక్తి ఒక కారణంగా చూపించలేని తెల్ల చొక్కా కార్మికులలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. తమ భౌతిక బాధ్యతలతో స్త్రీలు విధేయతతో ఉండే శ్రామిక శక్తి అనే భావజాలం అర్థం ఏమిటంటే – అవసరమైనప్పుడు వాళ్ళను పనిలోకి తీసుకోవచ్చు, పని చెయ్యనివ్వవచ్చు. జిడ్డు నేల స్త్రీలను అట్టడుగున ఉంచుతుందనీ, గాజు కప్పులు వారు పైకి ఎదగడానికి లేకుండా చేస్తాయనే సామెత సమకాలీన పెట్టుబడిదారీ సమాజంలో చెల్లింపు పనిలో స్త్రీల అనుభవంలో ఒక భాగం అయింది.

వర్గ విభేదాలు లోతై, వర్గాలు ఘనీభవించి, రాజీ సాధ్యం కాని వైరుధ్యాలతో, సంఘర్షణలతో సమాజం ముక్కచెక్కలవుతున్నప్పుడు రాజ్యమూ, రాజ్య సంస్థలూ తలెత్తాయని ఏంగెల్స్ చెప్పాడు. బానిస వ్యవస్థలో కానీ, ఫ్యూడలిజంలో కానీ, పెట్టుబడిదారీ బూర్జువా ప్రజాస్వామ్యంలో కానీ, తటస్థ వ్యవస్థగా కాక, ఒక వర్గ వ్యవస్థగా, పాలక వర్గాల చేతుల్లో ఒక పరికరంగా, రాజ్య వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. రాజ్యం అణచివెయ్యబడుతున్న వారిని తన నియంతృత్వంలో అణగద్రొక్కి ఉంచుతుంది. సమాజంలో అంతర్గతంగా ఉన్న వైరుధ్యాలు పాలక వర్గం తన అధికారాన్ని కోల్పోవడానికి దారి తీయకుండా జాగ్రత్త పడుతుంది. వర్గ సమాజాన్నీ, దోపిడీనీ, నిర్మాణాత్మక సామాజిక అసమానతలనూ, జెండర్ అణచివేతనూ కొనసాగించడానికి రాజ్యం పని చేస్తుంది. ఎందుకంటే, ఇవన్నీ సన్నిహితంగా పెనవేసుకుపోయాయి.

తన కాలం నాటి ఉదారవాదులు ప్రతిపాదించినట్లు కాక, 'నాగరికత'తో స్త్రీ పరిస్థితి మెరుగుపడలేదని ఏంగెల్స్ అన్నాడు. బూర్జువా ప్రజాస్వామ్యం బలపడడంతో

చట్టబద్ధ సమానత్వానికి కొన్ని చర్యలు తీసుకున్నా, వాస్తవానికి అది మరింత దిగజారింది. విక్టోరియన్, వలసవాదులు భావించినట్లు, స్త్రీలు బలహీనులు కనుక పని నుంచి విడుదల చేసి గృహంలో ఎలా రక్షించాలి? అన్న భావనలూ, మంచి స్త్రీ పురుషుడి మీద ఆధారపడి ఉంటుంది అన్న భావనా, ప్రబలంగా ఉండేవి. పురుషుడు పోషించేవాడు అనే భావజాలం ప్రబలంగా ఉండేది. తమకు సంపూర్ణ జీవితాన్ని ఇచ్చే స్వతంత్ర ఆదాయం లేకుండా, ఆస్తి లేకుండా, స్వతంత్ర జీవన విధానం అవలంబించకుండా క్రియాశీలంగా నియంత్రించడం వలన స్త్రీలు ఆర్థికంగా మగవాడి మీద ఆధారపడవలసి వచ్చేది. కుటుంబ, లైంగిక సంబంధాలు క్రమంగా స్త్రీల శ్రమను కుటుంబం వినియోగించడానికీ, స్వతంత్ర జీవనోపాధి లేకపోవడానికీ, లైంగిక నియంత్రణకూ దారి తీశాయి. బహుభార్యాత్వం నుండి దంపతీ వ్యవస్థకు మార్పు, ప్రారంభంలో తమ లైంగిక సంబంధాల మీదా, ఆధునిక లైంగిక ప్రేమ మీదా స్త్రీలకు మరింత స్వేచ్ఛనిచ్చినట్లు కనిపించింది. కానీ, వర్గ సమాజం అభివృద్ధి చెందడంతో, పురుషుడి వ్యక్తిగత ఆస్తి వేళ్ళూనుకోవడంతో, దంపతీ వ్యవస్థలో వివాహం తన వారసులు ఎవరో నిర్ణయించుకోవడానికీ, గృహ సౌఖ్యాలకూ భర్త స్త్రీని తన నియంత్రణలో ఉంచుకోవడానికీ ఏర్పడిందని స్పష్టమైంది.

ఏంగెల్స్ దృష్టిలో ఇది గతంలో స్త్రీలకూ, పురుషులకూ మధ్య ఉన్న వైరుధ్యాల మధ్య ఒక రాజీ కాదు – పురుషులు స్త్రీలను అణగద్రొక్కడమూ, ముసుగు వేసిన గృహ బానిసత్వమూ. స్త్రీ ఒక సరుకుగా, ఒక సేవకురాలుగా, ఇంటిలో ఉండే ప్రధాన సేవకురాలుగా మారింది. పురుషులకు వారి పబ్లిక్ వ్యవహారాలుండేవి. బానిసలూ, స్త్రీ సేవకులూ, వేశ్యలు ఉండేవారు. వాస్తవానికి రాజ్య వ్యవస్థ నిర్వహించే దంపతీ వ్యవస్థ (స్త్రీలకు మాత్రమే) వ్యక్తుల మధ్య లైంగిక ప్రేమ, లేదా నైతికతల నుంచి తలెత్తలేదు. చట్టబద్ధమైన వారసులకు వ్యక్తిగత ఆస్తిని దఖలు పరచాల్సిన అవసరం వలన దంపతీ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. వ్యక్తిగత ఆస్తి విజయం ఇది.

వ్యక్తిగత ఆస్తీ, వర్గ సమాజమూ ఉనికిలోకి రావడంతో స్త్రీ ప్రపంచ చారిత్రాత్మక అపజయాన్ని పొందింది అని ఏంగెల్స్ 'వ్యక్తిగత ఆస్తి...' రచనలో చేసిన ప్రతిపాదనను మనం ఎలా అర్థం చేసుకోవాలి? లేదా, మొట్ట మొదటి వర్గ వైరుధ్యం స్త్రీ పురుషుల మధ్య వైరుధ్యం అనీ, మొట్టమొదటి అణచివేత స్త్రీల అణచివేత అనీ, ఆధునిక సమాజంలో మగవాడు కేపిటలిస్టు అనీ, స్త్రీ కార్మికురాలు అనీ ఏంగెల్స్ చెప్పినది ఎలా అర్థం చేసుకోవాలి? స్త్రీ పురుషులు వేరు వేరు వర్గాలు అని ఈ ప్రతిపాదనలు సూచిస్తాయా? ఖచ్చితంగా కాదు. 'వ్యక్తిగత ఆస్తి....' రచనలో కానీ, మరే ఇతర రచనలో కానీ, అతని వాదన ఇది కాదు. వర్గ సంబంధాలలో,

అసమానతలో స్త్రీల అణచివేత అంతర్లీనంగా ఉంటుందని మాత్రమే కాకుండా, జతగా ఉండే ఈ అణచివేతా, జెండర్ అసమానతలు మార్పు లేనివి కావనీ, శాశ్వతంగా ఉండేవి కావనీ ఏంగెల్స్ ప్రతిపాదనలు సూచిస్తాయి. వ్యక్తిగత ఆస్తి, వర్గ దోపిడీ, వర్గ సంబంధాలు, స్త్రీల అణచివేత, వర్గ సమాజాన్ని కాపాడే వ్యవస్థగా రాజ్యం – ఇవన్నీ అంతర్గతంగా పెనవేసుకుపోయి ఉంటాయి. ఈ పెనవేత ప్రక్రియలో అవి తలెత్తాయి, కొనసాగుతున్నాయి. జెండర్ అసమానత వలన, స్త్రీల అణచివేత వలన పెట్టుబడిదారులు లాభం పొందుతారని మనం గుర్తుంచుకోవడం ముఖ్యం. స్త్రీలు చౌకగా లభ్యమయ్యే శ్రామిక రిజర్వు సైన్యంగా ఉండడం మాత్రమే కాదు. అన్ని కేపిటలిస్టు సమాజాలలోనూ స్త్రీలు అత్యంత చౌకగా లభ్యమయ్యే, అత్యంత తీవ్రమైన దోపిడీకి గురయ్యే శ్రామిక శక్తిగా ఉంటారు. శ్రామిక వర్గం కొనసాగడానికి మాత్రమే కాక దాని పునరుత్పత్తికి అత్యవసరమైన గృహ బాధ్యతలు స్త్రీ భుజాల మీద పడడం క్యాపిటలిస్టులకు ముఖ్యం మాత్రమే కాకుండా, ఈ విషయంలో అనేక ఖర్చులను తగ్గించుకోవడానికి కేపిటలిస్టులకు ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియ కొనసాగాలంటే పురుషుడి పెత్తనాన్నీ, పితృస్వామ్య సంస్కృతులను నిరంతరం ప్రచారం చేస్తుండాలి.

**విముక్తికి దారేమిటి?**

ఈ విశ్లేషణ నుండి స్త్రీల, అణచివేతకు గురవుతున్న వర్గాల విముక్తికి మనం మార్గాన్ని కనుగొనగలం. స్పష్టంగా, వ్యక్తిగత ఆస్తి నిర్మూలన స్త్రీ విముక్తికి ఒక అవసరమైన పరిస్థితి. ఎందుకంటే వర్గ సంబంధాలకూ, స్త్రీల అణచివేతకూ ఇది పునాది. దీనర్థం వ్యక్తిగత ఆస్తి నిర్మూలన జరిగేదాకా మనం వేచి ఉండాలనా? లేదా వ్యక్తిగత ఆస్తి నిర్మూలన అర్థంలో సోషలిజాన్ని నిర్మించాకా, స్త్రీల విముక్తి సాధించడం జరుగుతుందనా? ఈ రెండూ నిజం కాదు. జనతా ప్రజాస్వామ్య విప్లవానికీ, సోషలిజానికీ మనం చేస్తున్న పోరాటం, కొంత ఉపశమనం కోసం శ్రామిక ప్రజల, అణచివేత గురవుతున్న వారి తక్షణ పోరాటాలతో పెనవేసుకు పోవాలి. అటువంటి పోరాటాల ద్వారా మాత్రమే దోపిడీకీ అణచివేతకూ గురవుతున్న విశాల విభాగాలు జనతా ప్రజాస్వామ్య విప్లవం యొక్కా, సోషలిజం యొక్కా ఆవసరాన్ని గుర్తించగలవు. ఈ విభాగాలను పోరాటాల్లోకి దించడానికీ, వర్గ దోపిడీకీ, అన్ని రకాల అణచివేతలకూ గల మూలాలను ఈ విభాగాలకు స్పష్టం చెయ్యడానికీ సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజ ఎజెండాలో, పోరాటంలో, జెండర్, స్త్రీల అణచివేతా ఒక భాగంగా ఉండాలి.

స్త్రీల సమానత్వమూ, విముక్తీ తక్షణం కానీ, సమీప భవిష్యత్తులో కానీ సాధ్యం కాదని మనం గుర్తించినా, ఈ లక్ష్యాల కోసం మన పోరాటం ఇప్పుడే ప్రారంభం కావాలి. పురుషుడి పెత్తనం, స్త్రీల అణచివేతల విలక్షణ స్వభావం ఈ క్రింద పేర్కొన్నవి

ఉన్నప్పుడే స్పష్టంగా తెలుస్తుంది :

1. చట్టపరంగా సమానత – చట్టపర సమానత కోసం చేసే తక్షణ పోరాటాలు పోరాటాన్ని నిర్మించడానికి తోడ్పడడం మాత్రమే కాకుండా పెట్టుబడిదారీ రాజకీయ ఆర్థిక వ్యవస్థ యొక్క పరిమితులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. చట్టాలు ఎలా ఉన్నా, క్యాపిటలిస్టు వ్యవస్థ, వ్యక్తిగత ఆస్తి, నిర్మాణాత్మక అణచివేతా సమానత్వాన్ని నిరాకరిస్తాయని మనం తెలుసుకుంటాం. మన పోరాటం చట్టపర సమానత్వం కోసం మాత్రమే కాదు, వర్గ సమాజమూ, వర్గ సంబంధాలూ ఆచరణలో సమానత్వాన్ని నిరాకరించే విధానాన్ని వెల్లడించడానికి కూడా.
2. ఆర్థిక స్వాతంత్ర్యం సాధ్యం కాని, ఆకలి తీర్చలేని వేతనాల స్థాయిలో కాక, స్త్రీలు మొత్తం పబ్లిక్ పరిశ్రమలోనూ ఉద్యోగాలలోనూ ప్రవేశించాలి. కుటుంబ సభ్యుల మీద కానీ, పోషకుల మీద కానీ ఆధారపడుతూ లొంగివుండేలా కాకుండా, ప్రైవేటు, గృహ బంధాలకు ఆవల తమ జీవితాన్ని సార్థకం చేసుకునేలా తగిన ఆదాయాన్ని స్త్రీలందరూ సంపాదించగలగాలి. అంటే క్యాపిటలిస్టు లాభానికి ఆర్థిక వ్యవస్థను ముడిపెట్టే పరిస్థితి మారాలి.
3. వ్యక్తిగత ఆస్తిని నిర్మూలించినప్పుడు సమాజంలో ఒక ఆర్థిక యూనిట్ గా కుటుంబం రద్దు అవడం సాధ్యమవుతుంది. దీనర్థం ప్రైవేటు, సన్నిహిత కుటుంబ సంబంధాలనూ, వ్యక్తిగత లైంగిక ప్రేమనూ, సుదీర్ఘ కాలం ఉండే వ్యక్తిగత సంబంధాలు ఇచ్చే భద్రతనూ నిరాకరించడం కానీ, లేదా అవి సాధ్యం కాదని చెప్పడం కానీ కాదు. మనం చెప్పేది సరిగ్గా దీనికి వ్యతిరేకమైనది. కుటుంబాల నుండి ఆర్థికాన్ని తొలగించినప్పుడు మాత్రమే, వివాహం మీద స్త్రీలు ఆర్థికంగా ఆధారపడనప్పుడు మాత్రమే, నిజమైన ప్రేమ, సాన్నిహిత్యమూ సాధ్యమవుతాయి.
4. సెక్సు ఇంకేమాత్రం ఒక సరుకుగా లేనప్పుడు, బతకడానికి ఒక సాధనంగా వివాహం ఇంకేమాత్రం కానప్పుడు, పబ్లిక్ రంగంలోనూ, ప్రపంచంలోనూ స్త్రీలు సమాన స్థానాన్ని పొందగలిగినప్పుడు, భయం వలనా, సామాజిక ఒత్తిడి వలనా కాక, ప్రేమ పునాదిగా ప్రజలు సంబంధాలలోకి అడుగు పెడతారు, లేదా కొనసాగుతారు.
5. ప్రైవేటు గృహ నిర్వహణ ఒక సామాజిక పరిశ్రమగా పరివర్తన చెందుతుంది. అంటే వర్గ సమాజంలో ఉన్నట్లు పునరుత్పత్తిని స్త్రీల, లేదా కుటుంబం యొక్క ప్రైవేటు బాధ్యతగా కాక సమాజ బాధ్యతగా పరిగణించడం

జరుగుతుంది. మరోమాటలో చెప్పాలంటే, ప్రధాన గృహ నిర్వాహకులుగా, ఇంటి బాధ్యతలను చేపట్టేవారుగా ఆటోమేటిక్ గా స్త్రీలు మాత్రమే ఉండరు. 'విసుగు కలిగించే' ప్రైవేటు, చెల్లింపు లేని ఇంటి చాకిరీ నుంచి స్త్రీలను విముక్తి చెయ్యాలని ఏంగెల్స్, లెనిన్ తదితర ప్రామాణిక ఆలోచనాపరులందరూ గుర్తించారు. కుటుంబం ఇంకేమాత్రం సమాజం యొక్క ప్రాథమిక అకౌంటింగ్ యూనిట్‌గా ఉండనప్పుడు, పబ్లిక్ శిశు సంరక్షణ, నర్సరీలు, ఇతర సౌకర్యాల ద్వారా రాజ్యమూ, సమాజమూ తరువాతి తరం యొక్కా, వృద్ధుల యొక్కా సంరక్షణ బాధ్యతను స్వీకరించినప్పుడు, రోజువారి ఇంటి చాకిరీని దాటి స్త్రీలు ముందుకు వెళ్ళగలరు. స్త్రీల స్థానం ప్రైవేటు గృహంలోనే అనే భావజాలాన్ని ఎదుర్కోగలరు. పని, భావాలకు సంబంధించిన విశాల ప్రపంచాన్ని కౌగిలించుకోగలరు. పిల్లలూ, వారి సంరక్షణ విషయాన్నీ స్త్రీలు ఎంచుకోగలరు. మరో రకంగా ఎంచుకుంటే, ఏ కళంకాన్ని వారికి ఆపాదించడం జరుగదు.

పైన చెప్పినవన్నీ సాధించడానికి వ్యక్తిగత ఆస్తి రద్దు ఒక అవసరమైన పరిస్థితి. కానీ, అది ఒక్కటే సరిపోదు. మనం సోషలిజం చరిత్రను చూసినప్పుడు, విద్యలోనూ, వృత్తి విద్యలోనూ, కళలలోనూ, ఇంతవరకూ జెండర్ విభజనకూ, హింసకూ గురైన పబ్లిక్ జీవితంలోనూ, స్త్రీలూ, అణచివేతకు గురైన విభాగాలూ సాధించిన అనేక విజయాలను గమనిస్తాం. పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ జరిగిన మాజీ సోషలిస్టు దేశాలలో, ఉదాహరణకు యు.యస్.యస్.ఆర్., జి.డి.ఆర్.లలో, సోషలిజంలో స్త్రీలు సాధించుకున్న అనేక విజయాలు – ఆర్థిక స్వాతంత్ర్యమూ, ఉద్యోగాలలో సమానత, శిశు సంరక్షణ సౌకర్యాలూ, ప్రసూతి సెలవు లాంటివి – కోల్పోవడం కూడా మనం చూశాం. దీని ద్వారా భౌతికంగానూ, భావజాలంలోనూ, సామాజిక సంబంధాలలోనూ మన పోరాటం ఇది వరకు ఎలాగుందో, ఇప్పుడు ఎలా కొనసాగుతోందో మనం చూస్తాం. మార్పు కోసం పోరాటాన్ని కొనసాగించవలసిన అవసరాన్నీ, ఎదురయ్యే కష్టాలనూ అసమానంగా గుర్తించడం జరిగింది. ఇంకా చాలా చెయ్యవలసి ఉంది. సోషలిస్టు దేశాలలో జరిగిన అనేక అధ్యయనాలు, సాహిత్యము, చలన చిత్రాలు, చర్చల ద్వారా ఇది స్పష్టమవుతోంది. ఉదాహరణకు క్యూబాలో ఒక రేడికల్ నూతన కుటుంబ నియమావళి గురించి జరిగిన రిఫరెండంలో కూడా ఇది ప్రతిబింబిస్తుంది. పెద్ద ఎత్తున పబ్లిక్ చర్చల తర్వాత, అనేక సవరణలతో ఈ నియమావళిని ఆమోదించడం జరిగింది. ఇతర క్లాజులతో పాటు, ఈ నియమావళి స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని నిర్దేశించింది. ఇంటి చాకిరీ స్త్రీల పని అనే భావనను

వ్యతిరేకించింది. బహుళ జెండర్ల గుర్తింపుతో పాటు స్వలింగ వివాహాలను గుర్తించింది. దాదాపు 70 శాతం అనుకూలంగా ఓటు చేసినా, గణనీయమైన సంఖ్య వ్యతిరేకంగా ఓటు చేసింది. ఒక కొత్త సమాజాన్ని నిర్మించడానికి జరిగే రాజకీయ, సామాజిక పోరాటం నిరంతరం జరిగేదనీ, సోషలిస్టు సమాజాన్ని వ్యతిరేకించేవారు జెండర్ సమానతకు వ్యతిరేకంగా ఓటు చేసే అవకాశం ఉందనీ, సోషలిస్టు సమాజం కోసం నిలిచేవారు జెండర్ సమానతకు అనుకూలంగా ఓటు చేస్తారనీ ఇది మనకు స్పష్టం చేస్తుంది. మార్క్స్, ఏంగెల్స్‌లు పేర్కొన్నట్లు, భవిష్యత్తు కమ్యూనిస్టు సమాజంలో ఏమి ఉండదో, ఏమి ఉండకూడదో మనం కేవలం అంచనా మాత్రమే వెయ్యగలం. కొత్త సమాజం ఎలా వికసిస్తున్నది చూడడానికీ, ఈ మార్పులను ఎలా తీసుకు రాగలమో ఆలోచించడానికీ మనం వేచి ఉండాలి.

**భారతదేశంలో స్త్రీల అణచివేతకు,**
**జెండర్ సంబంధాలకు ఒక రూపాన్ని ఇవ్వడం**

**స్త్రీ** సమస్యనూ, స్త్రీ విముక్తికి మార్గాన్నీ అర్థం చేసుకోవడానికి ప్రామాణిక మార్క్సిస్టు–లెనినిస్టు దృష్టికోణం తెలుసుకున్న తర్వాత, పార్టీ పనిలో ఇది ఎలా చెయ్యాలో మనం చూడాలి. అలా చెయ్యాలంటే మనం సమకాలీన భారతదేశ సామాజిక నిర్మాణాలలో స్త్రీ సమస్యకు ఒక నిర్దిష్ట రూపాన్ని ఇవ్వాలి. సాధారణ మార్క్సిస్టు–లెనినిస్టు దృష్టికోణం గురించి మనం చర్చిస్తున్నప్పుడు ఇందులో కొంత భాగాన్ని మనం చేశాం. ఇంతకు ముందు ఒక విభాగంలో స్త్రీలు అనుభవించే అణచివేతనూ, వివక్షనూ ప్రతిబింబించే, స్త్రీల పనిలో, పోషణలో, ఆరోగ్యం, విద్య, రాజకీయ భాగస్వామ్యాలలో ధోరణులనూ లక్షణాలనూ మనం చర్చించాం. పార్టీ కార్యక్రమంలోనూ, తరువాతి కాంగ్రెసుల తీర్మానాలలోనూ విశదీకరించిన విధంగా, ఈ అంకెలనూ, ధోరణులనూ వర్గ, భౌతిక నిర్మాణాలు, సంబంధాల – అర్ధ భూస్వామ్య, అర్ధ పెట్టుబడిదారీ సంబంధాల సందర్భంలో పరిశీలించాలి. అంతే కాకుండా ఆర్థిక వ్యవస్థలోనూ, కుటుంబంలోనూ, రాజకీయాలలోనూ జెండర్ సంబంధాలకూ, స్త్రీల జీవితాలకూ రూపాన్నిచ్చే కుల, మత నిర్మాణాలనూ, భావజాలాలనూ గుర్తించి ఎదుర్కోవడం ముఖ్యం. వర్గ, జెండర్ వ్యవస్థలను కొనసాగించడానికి కుల, మత నిర్మాణాలనూ నిరంతరం ఉపయోగించడం జరుగుతోంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో మతతత్వమూ, ఛాందసవాదమూ పెరగడంతో ఇది మరింత ఎక్కువైంది.

ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోనూ ఛాందసవాద ఉద్యమాలను పునరుద్ధరించడానికి, జెండర్ అసమానత, వివక్ష, ఇతర ఆర్థిక సామాజిక

అసమానతలూ సహజమూ, దైవ నిర్ణయమూ అనే వ్యాఖ్యానాలను కేంద్రంగా చేసుకుని, అనేక మతాలు సమర్థిస్తున్నాయి. భారత దేశంలో ఇది స్పష్టంగా కనుపిస్తోంది. కుటుంబ పవిత్రత, కుటుంబం ఇచ్చే భద్రత, పాతివ్రత్య భావాలు, వివాహమూ, స్త్రీ నుదుటి రాతను బట్టి వివాహమాడే వ్యక్తి, అనే పేరుతో తరచు దీన్ని సమర్థించడం జరుగుతోంది. ఉత్తమురాలైన స్త్రీ తన భర్తకూ, అతని కుటుంబానికీ, పిల్లలకూ అంకితమై ఉంటుంది. దాంపత్య బంధంలో ఒక మనిషితో జీవితాంతం విధేయతతో ఉండే స్త్రీ అనే భావననూ, వితంతు వివాహాన్ని నిషేధించడమూ, అగ్ర కులాలలో పతివ్రత అనే భావన ద్వారా మరింత ముందుకు తీసుకు వెళ్ళడం జరిగింది. ఆదివాసీలూ, కొన్ని దళిత గ్రూపులలో కొన్ని మినహాయింపులున్నా, అన్ని కమ్యూనిటీలలోనూ, ఎంత వేధింపులకూ హింసకూ గురవుతున్నా, ఒక విధేయతగల భార్యగా, కోడలుగా, కారుణ్యంతో, ఓర్పుతో సర్దుకు పోవాల్సిన బాధ్యత స్త్రీ మీద ఉంటుందని తమ జీవితాలను త్యాగం చేసిన అనేక స్త్రీల కథలను పురాణాలలో, మత గ్రంధాలలో చెప్పడం జరిగింది. తన పాతివ్రత్యాన్ని మళ్ళీ మళ్ళీ నిరూపించుకోవలసిన ఆదర్శ స్త్రీ మూర్తిగా సీత కథను నిరంతరం చెప్పడం జరుగుతోంది. సీత అంతిమంగా మరణాన్ని / ప్రవాసాన్ని కోరుకుంది అనే విషయాన్ని కప్పిపుచ్చడం జరుగుతోంది, లేదా ప్రతిఘటనకు మారుగా మరణాన్ని ఎంచుకున్న ఒక ఉత్తమ స్త్రీకి ఉదాహరణగా చూపించడం జరుగుతోంది. హిందూత్వలో రాముడి కథల్లో ఆమె క్రమంగా పక్కకు నెట్టబడుతోంది. ప్రాచీన కాలాలలో స్త్రీలు ఒక ఉన్నత స్థానంలో ఉండేవారని వాదిస్తూ హిందూత్వవాదులు పురాణ స్త్రీల పేర్లను ఉదహరిస్తుంటారు. యాజ్ఞవల్కుని భార్య మైత్రేయి ఇందుకు ఒక ఉదాహరణ. మునులను ఓడించడానికి ముందే తన గొంతును నొక్కివేసేదాకా, వారితో చర్చలలో ఆమెదే పైచేయి అయింది. స్త్రీలకు మేధ ఉందనీ, ఆలోచించగలరనీ, మాట్లాడగలరనీ, కానీ పాలక, స్త్రీ వ్యతిరేక భావజాలాలూ, అధికారమూ వాళ్ళను అణచివేశాయనీ ఈ కథ మనకు వెల్లడిస్తుందని అభ్యుదయవాదులు చెబుతారు. తరువాత కాలంలో కుల, వర్గ, జెండర్ అణచివేత ప్రారంభం కావడంతో, కాళి విషయంలో జరిగినట్లు, శక్తివంతులైన స్త్రీ దేవతలను మరింత శక్తివంతమైన దేవుళ్ళ అదుపులో ఉండే భార్యలుగా చిత్రించడం జరిగింది.

గృహ హింసనూ, దాంపత్య హింసనూ సమర్థించడానికి స్త్రీ తన భర్తకు విధేయతతో సేవ చెయ్యకపోవడాన్ని ఒక కారణంగా చూపించడం అనేక కమ్యూనిటీలలో ఉంది. దీనికి మత అనుమతి కూడా ఉంది. స్త్రీల విధేయతను, తను తెలియక చేసిన తప్పులకూ, లేదా భర్త అవసరాలను తీర్చలేనందుకూ భర్త శారీరకంగా హింసించడాన్ని సమర్థిస్తూ ముస్లిం ఛాందసవాదులు సంప్రదాయాలను ఉదహరిస్తారు. స్త్రీ తన విధి

నిర్వహణలో విఫలమైనట్లయితే ఆమె శారీరక శిక్షకు అర్హురాలు అని మనుస్మృతి ప్రకటించింది. స్త్రీలనూ, దళితులనూ, పశువులనూ అదుపులో ఉంచడానికి హింస అవసరమే కదా! 'తప్పుగా' దుస్తులు వేసుకున్న, ఎక్కువ మాట్లాడే, లేదా తమ హక్కులు, స్వాతంత్ర్యం గురించి మాట్లాడే యువతులు నిందార్హులు. భారత స్త్రీలు మనుస్మృతికి రుణపడి ఉండాలని ఒక మహిళా హైకోర్టు న్యాయమూర్తి బహిరంగంగా ప్రకటించడం ఒక విద్యుద్ఘాతంలాగా తగులుతుంది. విద్యా విధానాన్ని నిర్ణయించడానికి ఏర్పడిన సంస్థలలోని ఆరెస్సెస్ సిద్ధాంతవేత్తలు మనుస్మృతిని విద్యా పాఠ్యాంశాలలోకి చేర్చడానికి చేస్తున్న ప్రయత్నం ప్రస్తుతం ఉన్న జెండర్ మూసధోరణులనూ, భావజాలాన్నీ మరింత ముందుకు తీసుకెళ్ళగలదు. స్త్రీని అదుపులో ఉంచాలనీ, ఆమె ప్రధాన పాత్ర గృహం లోపలే ఉంటుందనీ ప్రస్తుతం పాఠశాల విద్యా అంశాలలో ఉన్న భావాలను బలపరుస్తుంది. విద్యా సంస్థలలో స్త్రీల సంఖ్య పెరిగినా ఈ భావాలు మారలేదు.

కులం, జాతి, జెండర్ అసమానతలు సహజమనే భావం మీద ఆధారపడిన సంప్రదాయాల కోసం మితవాద పార్టీలూ, ఉద్యమాలు ముందుండి పోరాడుతున్నాయి. కుల వ్యవస్థ గురించీ, స్వచ్ఛత, కాలుష్యాల గురించీ, సహజంగా ఉండే బలహీనతల గురించీ, 'దిగువ కులాల', స్త్రీల, నైతిక, శారీరక బలహీనత గురించీ హిందూయిజం లోనూ, ఇతర మత కమ్యూనిటీలలోనూ మరుగున ఉన్న కఠోర ఉద్ఘాటనలు ఉన్నాయి. దిగువ కులాలనూ, స్త్రీలనూ 'స్వచ్ఛమైన' కులాలూ, పురుషులూ పర్యవేక్షించాలి, నియంత్రణలో ఉంచాలి అని బహిరంగంగా చెప్పడమో, లేదా సూచించడమో జరుగుతోంది. అంబేద్కర్ చెప్పిన నిచ్చెనమెట్ల అసమానతల కుల వ్యవస్థ శ్రామికులనూ, స్త్రీలందరి సెక్సువాలిటీనీ, యువతనూ అదుపులో ఉంచడానికి కావాలి. ఫలితం ఏమిటంటే, వర్గంతో సహా నిర్మాణాత్మక అసమానతలను సమర్థించడం.

కుల, కమ్యూనిటీ సరిహద్దులను కొనసాగించడం వివాహం మీద నియంత్రణతో ముడిపడి ఉంది. తమ వర్గ, కుల విశేష సౌకర్యాలనూ, అధికారాన్నీ పదిలపరుచుకోవాలని భావించే వారికి యువత తమ వివాహం గురించి తామే నిర్ణయించుకోవడమూ, కులాంతర, మతాంతర వివాహాలూ ముఖ్యంగా చాలా ప్రమాదకరమైనవి. ఎందుకంటే వీరు అనుభవిస్తున్న విశేష సౌకర్యాలూ, అధికారమూ కుల, మత నిర్మాణాల మీదా, నిచ్చెనమెట్ల వ్యవస్థ మీదా ఆధారపడి ఉన్నాయి. ఆధునిక, మధ్యతరగతి విభాగాలలో వర్గం కారణంగా అస్పష్టంగా ఉన్నా, వివాహంలో కుల ప్రాముఖ్యత చాలా బలంగానే ఉంది. కులమూ, మత భావజాలాలూ స్త్రీలను కించపరుస్తాయి, అదే సమయంలో కుల, కమ్యూనిటీ స్వచ్ఛతను సురక్షితంగా

ఉంచేవారిలా వారికి 'గౌరవమూ' 'హోదా'లను ఇస్తాయి. ఒక పక్క స్త్రీల హక్కులను హరించే, వారిని పరిమితం చేసే ఒక తప్పుడు అతిశయాన్ని వారికి ఇవ్వడం జరుగుతుంది. మరోపక్క, ఒక కమ్యూనిటీకి చెందిన స్త్రీలను అగౌరవపరచడం ఆ కమ్యూనిటీ మొత్తాన్ని కించపరిచే ఒక పద్ధతి. ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మికుల మీద భూస్వాములు జరిపే హింసలో ఇది మనం చూస్తుంటాం. దళిత గొంతుకూ, సమానత్వ ప్రకటనలకూ ప్రతీకారంగా హింసాపూరిత దాడుల, దళిత స్త్రీల మానభంగాల చరిత్ర మళ్ళీ మళ్ళీ సంభవిస్తోంది.

పేరు పెట్టి ముస్లిం స్త్రీలను కించపరిచిన, అవమానించిన, పని మనిషిగా 'వేలం వేసిన' అసహ్యకరమైన బుల్లీబాయ్ సుల్లీ బాయ్ యాప్స్‌లో కూడా ఇది చూస్తాం. స్త్రీలలో అనేకులూ, స్త్రీల సంస్థలూ, ఇతరులూ నిరసన తెలియజేసిన తర్వాత మాత్రమే వీటిని తొలగించారు. కేసులు రిజిష్టరు చెయ్యడంలో పోలీసులు ఎంతో జాప్యం చూపించారు. కేసుల విచారణ చాలా నెమ్మదిగా జరుగుతోంది. ఈ యాప్స్ ముస్లిం స్త్రీలను మాత్రమే కాదు, స్త్రీలు సరుకులనీ, గృహం లాంటి ప్రాంతాలలో పని చేసే స్త్రీలను మనుషులు కానట్లుగా అమ్మవచ్చనీ, మొత్తం స్త్రీలందరినీ కించపరుస్తున్నాయి.

దురదృష్టవశాత్తూ, ఆశించినది సాధించలేని, 'మరో మతం' వలన, లేదా నిచ్చెన మెట్ల వ్యవస్థకు ఏర్పడే ప్రమాదం వలన, తమకు భద్రత లేకుండా పోయింది అని నిరంతరం జరిగే ప్రచారం వలన ప్రభావితులైన అనేక మంది యువకులూ, స్త్రీలూ ఈ భావాల పట్ల ఆకర్షితులవు తున్నారు. మత పెద్దలు అని చెప్పబడేవారి ఆజ్ఞలను పాటిస్తున్నారు. తామూ, తమ కుటుంబాలూ అనుభవిస్తున్న కష్టాలనుంచి విముక్తి మార్గంగా మతతత్వం, కర్మకాండల వైపు మళ్ళుతున్నారు. తమ కమ్యూనిటీని 'రక్షించుకోవడానికి' కుల, మత అస్తిత్వ పునాది మీద వారిని కూడగట్టడం జరుగుతోంది. కులమూ, మత ఛాందసవాదమూ, వర్గ సిద్ధాంతాలూ, అసమానతలూ – అన్నీ స్త్రీ కార్మికులతో సహా స్త్రీలకు సమాన పౌరులుగా, వ్యక్తులుగా ఉండే హక్కులను నిరాకరించడానికి ఏకమవుతున్నాయి.

దీనికి మూల కారణం, స్త్రీలకు ఆదాయాన్నిచ్చే ఉద్యోగము, సమాన వేతనాలు, గౌరవప్రదమైన పని లేకపోవడమూ, స్వతంత్ర ఆదాయమూ ఆర్థిక వనరులూ లేకపోవడమూ. ఇవన్నీ ఆర్థికంగా, సామాజికంగా స్త్రీ కుటుంబం మీద, ఆ కుటుంబం ఇచ్చే మద్దతు, భద్రత మీదా – అది ఎంత తక్కువైనా సరే – ఆధారపడేలా చేస్తున్నాయి. తమ గృహాల్లో తాము అనుభవిస్తున్న మానసిక, భావోద్వేగ, శారీరక హింసను భరించేలా చేస్తున్నాయి. చట్టబద్ధంగా స్త్రీలకు ఆస్తి హక్కుల గురించి హిందువులలోనూ, క్రిస్టియన్లలోనూ ఉమ్మడి డిమాండ్లు ఉన్నాయి. కానీ, ఆదాయన్నిచ్చే

పనులకు స్త్రీలకున్న అవకాశాలు తగ్గిపోవడమూ, అసమాన వేతనాలూ, భద్రత లేని పనీ, పిల్లలకు సౌకర్యాలు లేకపోవడమూ మొదలైన వాటి గురించి అధ్యయనాలు వెల్లడిస్తున్నా, ఉమ్మడి పోరాటాలలోనూ, సమిష్టి ఉద్యమాలలోనూ ఈ సమస్యల పట్ల దృష్టి పెట్టడం జరగలేదు. స్త్రీల, స్త్రీ కార్మికుల అణచివేతకు గల ఆర్థిక కారణాలను ఇది మరుగుపరుస్తోంది. ఆ విధంగా, స్త్రీల విముక్తికి మాత్రమే కాకుండా సామాజిక సమానత్వానికీ, అందరకూ న్యాయం చెయ్యడానికీ స్త్రీలకు ఉపాధి అవకాశాలనూ, ఆర్థిక స్వాతంత్ర్యాన్నీ కల్పించడం కేంద్ర స్థానంలో ఉంటుంది.

వేతనం పొందే ఉద్యోగాలలో చేరడానికి స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలలో ముఖ్యమైనవి – ఇంటి పని, శిశు సంరక్షణ. ఇవి సహజంగా స్త్రీలకు ఉండే బాధ్యతలు అనీ, ఇవి మాత్రమే స్త్రీలు చెయ్యగలరనీ ఒక కారణాన్ని చూపించడం జరుగుతోంది. జెండర్ భావజాలాల లాగానే, స్త్రీలకు విద్యాశిక్షణలు లేకపోవడం, వారిని చెల్లింపులేని, తక్కువ చెల్లింపు ఉన్న పనులకు పరిమితం చెయ్యడంలో ఒక ముఖ్య అంశంగా ఉంది. స్త్రీ కార్మికులకు ఇది రెట్టింపు బరువు. ఇంటి పనికీ, శిశు సంరక్షణకూ సమయం, శ్రమ, నైపుణ్యం, ఆలోచనా అవసరం అని గుర్తించని భావన స్త్రీల ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. సహజంగా స్త్రీల బాధ్యతలు అని చెప్పబడే వాటిలో పురుషులు పాల్గొనకుండా ఉండే ధోరణిని ఇది బలపరుస్తుంది. మనం గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమిటంటే – అత్యంత అణచివేతకు గురవుతున్న కొన్ని కులాలనూ, కొంతమంది స్త్రీలనూ పాలక వర్గాలు తమలో కలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి ఎన్నుకున్న ప్రజాప్రతినిధులుగా కూడా చేస్తున్నాయి. కానీ ఏ పరిమితులలో వీరికి ఈ స్థానాలను ఇవ్వడం జరుగుతోందో ఆ పరిమితులు, 'తక్కువ కుల' హిందువులుగా ఉనికిలో ఉన్న కుల, జెండర్ కట్టుబాట్లను సమర్థిస్తాయి. ఈ కులాలు ఆర్థికంగా కానీ, సామాజికంగా కానీ అగ్ర కులాల కంటే ఉన్నత స్థానం కోసం పాకులాడకూడదు. ఎటువంటి హింసను అనుభవిస్తున్నా స్త్రీలు మొట్టమొదట తమ 'సహజ' బాధ్యతలను నిర్వహిస్తూ మనుస్మృతినీ, కుటుంబాన్నీ సమర్థించాలి. కార్పొరేట్ల నియంత్రణలోఉన్న ప్రధాన స్రవంతి మీడియా, పాలక పార్టీలూ తమ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా, విముక్తి వ్యతిరేక భావజాలాలు, ఆచరణలతో, స్త్రీలను తమ మత, కుల అస్తిత్వాలలో కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. 'సర్దుకుపోతే' లేదా లాక్కోగలిగితే, స్త్రీలకు అన్నీ అందుబాటులో ఉన్నాయనీ, సమిష్టి పోరాటం అవసరం లేదనీ వాదనలను ప్రచారం చెయ్యడం జరుగుతోంది. పాలక వర్గాల 'సంస్కరణవాద' ఎన్జీవోలు ప్రచారం చేస్తున్న భావమూ, కల్పిస్తున్న ఆశలూ ఇవి. స్త్రీలు 'తమదైన' స్థానాన్ని పొందడానికి మౌలిక పరివర్తన ఏమీ అవసరం లేదని ఈ ఎన్జీవోలు ప్రచారం చేస్తున్నాయి.

దీన్ని ఎదుర్కొంటూ, స్త్రీలకూ, జెండర్‌కూ సంబంధించిన హక్కుల విస్తరణకూ, మితవాద భావాజాలలను, విధానాలను, సమీకరణలను వ్యతిరేకించడానికి గణనీయంగా నిరసనలూ, పోరాటాలూ జరిగాయి. ట్రేడ్ యూనియన్‌లో, కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ వర్కింగ్ విమెన్ గత కొన్ని సంవత్సరాలుగా సి.ఐ.టి.యు. సభ్యత్వంలో స్త్రీ కార్మికులను (AASHAs and AWWs) ఒక పెద్ద, పెరుగుతున్న విభాగంగా చేసింది. జెండర్ హింసకు వ్యతిరేకంగానూ, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎన్నుకునే హక్కు కోసమూ అనేక చోట్ల AIDWA, SFIలు పోరాడుతున్నాయి. కట్నం, మానభంగం, సతి మొదలైన వాటిని వ్యతిరేకిస్తూ ఉమ్మడి చొరవతో అనేక పోరాటాలు జరిగాయి. కనుపించే హింసను స్త్రీలు అనుభవిస్తున్న తీరు మీదా, ఇంతకు ముందు సామాజిక సంస్కరణ ఉద్యమాలు లేవనెత్తిన సమస్యల మీదా ఈ పోరాటాలు జరుగుతున్నాయి. దేశ వ్యాపితంగా CAAకు వ్యతిరేకంగా నిరసనలలో మనం చూసినట్లు, స్త్రీ పౌరసత్వం కోసమూ, మైనారిటీ హక్కుల కోసమూ, బిజెపి, సంఘ్ పరివార్ లు సృష్టిస్తున్న మతోన్మాద వాతావరణానికి వ్యతిరేకంగానూ, స్త్రీలు ముఖ్య ఉద్యమాలకు నాయకత్వం వహించారు. AIDWA, పార్టీ, ఇతర ప్రజా సంఘాలూ ఈ ఉద్యమాలలో పూర్తిగా భాగస్వాములయ్యారు. మహిళా వ్యవసాయదారుల భాగస్వామ్యం ఉత్తేజాన్ని కల్గించిన చారిత్రాత్మక కిసాన్ ఆందోళనలలోనూ, ట్రేడ్ యూనియన్లూ, కార్మికులూ దేశ వ్యాపితంగా నిర్వహించిన ఉమ్మడి నిరసనలలోనూ పై సంఘాలు పాల్గొన్నాయి. ప్రత్యేక అణచివేతకు గురవుతున్న అస్తిత్వాల మీద – దళితులు, ఆదివాసీల అస్తిత్వాల మీద ఆధారపడిన సంస్థలూ, పాలక వర్గ నియంత్రణ నుండీ విడివడ్డ కొన్ని ఎన్జీవోలూ కుల, జెండర్ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. ఈ సంస్థలు ఒక్కొక్కసారి వామపక్షాలతో చేతులు కలుపుతాయి, ఒక్కొక్కసారి దూరంగా ఉంటాయి. ఒక్కొక్కసారి ఒక కుల ఓటు బ్యాంకును సంఘటితం చెయ్యడానికి పని చేస్తాయి. మరి కొన్ని సమయాలలో మరికొంత ముందుకు పోయి పాలక ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాయి.

స్త్రీలు మాత్రమే కాకుండా పార్టీ, పార్టీ సభ్యులందరూ స్త్రీల హక్కుల కోసమూ, జెండర్ సమానత్వం కోసమూ సీరియస్‌గా కృషి చేస్తే, ప్రత్యేకంగా స్త్రీల ఉద్యమాలలోనే కాకుండా అన్ని ఉద్యమాలలోనూ, తమ జీవితాల్లోనూ, పనిలోనూ కూడా ఇది చెయ్యాలని గుర్తిస్తే, ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా, జనతా ప్రజాస్వామిక విప్లవం దిశగా బలమైన ఉద్యమాలను నిర్మించడం సాధ్యపడుతుంది.

పైన చెప్పుకున్నదాన్ని బట్టి, అణచివేత, జెండర్ సంబంధాలు, వర్గ, కుల నిర్మాణాల అసమానతలలోనూ, మత ఛాందసవాదం, మతతత్వం, హింసల రాజకీయ, భావజాల ప్రక్రియలలోనూ నిర్మితమవుతాయనీ, ఈ అసమానతలకు అండగా

నిలుస్తాయనీ మనకు స్పష్టమవుతుంది. తమ వర్గ, కుల, మత విశేషాధికారాలను కాపాడుకోవాలనుకునే వారు తమకు ఈ విశేషాధికారాలను, లాభాన్ని సాధ్యం చేసే ఆ సంబంధాలను కొనసాగించడానికి కృషి చేస్తారు. కొన్ని మార్పులకు అనుమతించినా జెండర్ తో సహా యధాతథ స్థితిని కొనసాగించడానికి కృషి చేస్తారు. ఇందులో స్త్రీలలోనూ, అణచివేతకు గురైన వారిలోనూ ఉండే వర్గ, కుల కట్టుబాట్లు, విలువలు, విభేదాలూ పాలక వర్గాలకు ఉపయోగపడ గలవు. వీటిని మనం ఎదుర్కోవాలి. సాధారణతలతో కాకుండా, స్త్రీలుగా, కార్మికులుగా, పౌరులుగా స్త్రీల జీవితాల ప్రత్యేకతల గురించి పని చేస్తూ మనం ఈ విభేదాలను అధిగమించగలం.

**స్త్రీలుగా, కార్మికులుగా, పౌరులుగా స్త్రీలు**

పై చర్చలను సమీక్షించి, మన సందర్భంలో స్త్రీల సమస్యల గురించీ, జెండర్ అసమానతల గురించీ ఎలా పని చెయ్యాలి అన్న విషయం గురించి ఇప్పుడు మనం చిట్టచివరన చూద్దాం. ఇందులో పార్టీ కార్యక్రమం, ముఖ్యంగా చాప్టర్ III, క్లాజ్ 3.15, పేరా 3.18, పేరా 3.20, చాప్టర్ 5.13 , 5.20, ఛాప్టర్ VI, క్లాజ్ XIV లూ, 2005 నాటి కేంద్ర కమిటీ డాక్యుమెంటూ మనకు విలువైన మార్గదర్శకాలుగా ఉంటాయి. స్త్రీల అణచివేతలో మూడు అంశాలను - స్త్రీలుగా, కార్మికులుగా, పౌరులుగా – ప్రత్యేకంగా చెప్పడం జరిగింది.

**స్త్రీలుగా స్త్రీలు** తమ జెండర్ కారణంగా వర్గంలో, కులంలో, కమ్యూనిటీలో, ప్రాంతంలో వివిధ రకాల అణచివేతకు గురవుతుంటారు. కుటుంబంలోనూ, వివాహంలోనూ వివక్ష, ఆస్తి, విద్య, పోషణ, వైద్యం, గడప బయట అడుగు పెట్టే స్వేచ్ఛ ఇందులో ఉంటాయి. కుటుంబం మీద ఆర్థికంగా, సామాజికంగా ఆధారపడడం, కుటుంబంలోనూ, కమ్యూనిటీలోనూ, కమ్యూనిటీకి వెలుపలా జరుగుతున్న హింస ముందు స్త్రీలను నిస్సహాయులుగా చేస్తోంది. గుర్తింపులేని, అధికమైన కుటుంబ, ఇంటి చాకిరీ భారం వారి మీద పడుతోంది. ప్రధానంగా కుటుంబాన్నీ, కమ్యూనిటీని పునరుత్పత్తి చేసే, సెక్సువల్‌గా ఉపయోగపడే, నియంత్రించబడే సెక్సువల్ జీవులుగా స్త్రీలను చూడడం జరుగుతోంది. ఇంటిలో సంపాదన లేని వినియోగదారులుగా వారి సహజమైన స్థానం ఉంది. వారిని ఇంటికే పరిమితం చేస్తారు, వారి శ్రమకు విలువ లేదు, కట్నం విషయంలో నిందించడం జరుగుతుంది. కూతుళ్ళ విలువ తగ్గడానికీ, కూతుళ్ళంటే విముఖత కలగడానికీ, ప్రతికూల సెక్సు నిష్పత్తికీ కట్నం

కారణమవుతోంది. మత భావజాలాలు, కర్మకాండలు దీన్ని బలపరుస్తాయి. స్త్రీలందరూ ఎదుర్కొనే మరో సమస్య కులమూ, పైన పేర్కొనట్లు స్త్రీల గురించి బ్రాహ్మణవాద భావాలు. దళిత స్త్రీలు అంతకంటే క్రూరమైన, హింసాత్మకమైన పరిస్థితిని ఎదుర్కొంటారు. ప్రత్యక్షంగా కుల హింస సంభవించినప్పుడు వారు మనుషులనే గుర్తింపు కూడా లేకుండా పోతుంది.

జనతా ప్రజాస్వామ్య కార్యక్రమాన్నుంచి ఉటంకింపు : "సామాజిక అసమానతలు, స్త్రీల పట్ల వివక్ష తొలగింపు, భూమితో సహా ఆస్తి వారసత్వం మొదలైనవాటిలో పురుషులతో సమాన హక్కు, అన్ని కమ్యూనిటీలలోనూ సమాన హక్కుల మీద ఆధారపడి స్త్రీలకు రక్షణ కల్పించే సామాజిక, ఆర్థిక, కుటుంబ చట్టాలను అమలు చెయ్యడం, వృత్తులలోనూ, సేవలలోనూ ప్రవేశం– ఇవన్నీ జరిగేలా చూస్తుంది. శిశు సంరక్షణలోనూ, ఇంటి చాకిరీలోనూ అనువైన సహాయక వ్యవస్థలను ఏర్పాటు చెయ్యడం, కుటుంబ నిర్మాణాలను ప్రజాస్వామీకరించే కృషిలో ఒక భాగంగా ఉంటుంది." నేడు ఉనికిలో ఉన్న కుటుంబం అణచివేసే, దోపిడీ స్వభావం గల కుటుంబమనీ, దీనిని మార్చవలసి ఉంటుందనీ చెప్పే ప్రామాణిక గ్రంధాల నుండీ, దేశ వ్యాపితంగా స్త్రీల అనుభవాలూ, పోరాటాల నుండీ ఈ అవగాహన ఏర్పడింది. జెండర్, తదితర సంబంధాలన్నింటిలోనూ సమానత్వానికి కుటుంబానికి వెలుపల సామాజిక సంబంధాలను కూడా ప్రజాస్వామ్యీకరించాల్సి ఉంటుంది.

జెండర్ వివక్ష చట్టాల సంస్కరణ, ఉద్యోగాలకూ, వేతన చెల్లింపుకూ సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యాలకూ, స్త్రీలకు ప్రత్యేకంగా అవసరమైన ఆరోగ్య విధానాలకూ చర్యలు, పోషకాహార కార్యక్రమాలు, పాఠశాలలో, ఆసుపత్రులలో, అన్ని పబ్లిక్ ప్రదేశాలలో పారిశుధ్య సౌకర్యాలు, పాఠశాల విద్యలోనూ, పబ్లిక్ విధానంలోనూ స్త్రీ వ్యతిరేక, జెండర్ సమానతకు వ్యతిరేక భావజాలాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు, స్త్రీల మీద ఆంక్షలు – ఇవన్నీ మనం చెయ్యవలసిన, ఉధృతం చెయ్యవలసిన పోరాటాలు, ఉద్యమాలలో ఒక భాగం. ప్రస్తుత సామాజిక, ఆర్థిక నిర్మాణాలలో స్త్రీ విముక్తిని సాధించడానికి గల పరిమితులను కూడా ఈ పోరాటాల ద్వారా వెల్లడించాలి. మార్పు కోసం జరిగే పోరాటంలో విశ్వాసాన్ని పెంపొందించాలి.

**కార్మికులుగా స్త్రీలు** స్త్రీలలో వ్యత్యాసాలకూ, జెండర్ అన్యాయానికీ, అణచివేతకూ గల ఆర్థిక కోణాలను ఎత్తి చూపుతుంది. కార్యక్రమం నుండి మళ్ళీ ఒక ఉటంకింపు : "... కార్మిక వర్గానికి చెందని స్త్రీల లాగా కాక, స్త్రీ కార్మికురాలు

ప్రత్యక్షంగా వర్గ దోపిడీని ఎదుర్కొంటుంది. స్త్రీలు ఒక సజాతీయ సామూహిక సమూహం కాదు. కార్మిక స్త్రీలు అనుభవించే ప్రత్యేకమైన దోపిడీని సవ్యంగా అర్థంచేసుకోవాలి. కమ్యూనిస్టుల నాయకత్వాన స్త్రీ సమానత్వానికి జరిగే ఉద్యమాలు, పట్టణ ప్రాంతాలలోనైనా, పల్లె ప్రాంతాలలోనైనా పనిచేసే స్త్రీ కార్మికుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. రెండో అంశమేమిటంటే – పురుష కార్మికుడు అనుభవించే దోపిడీకి అదనంగా కార్మిక వర్గానికి చెందిన స్త్రీ మరింత దోపిడీకి గురవుతుంది. కమ్యూనిస్టుల నాయకత్వాన కార్మిక వర్గ సంస్థలు కార్మిక వర్గ సమస్యల కోసం పోరాడుతున్నప్పుడు, ఆ పోరాటంలో స్త్రీ కార్మికురాళ్ళకు ఎదురయ్యే ప్రత్యేక సమస్యలు ఒక ముఖ్య భాగం కావాలి."

మరో మాటలో చెప్పాలంటే, స్త్రీ కార్మికులు రెండు రకాల దోపిడీకి గురవుతారు. కార్మికులుగా వారు దోపిడీకి గురవుతారు. అదనంగా స్త్రీ కార్మికులుగా మరింత దోపిడీకి గురవుతారు. ఈ రెండు కోణాలను వేరు చేసి చూడడం అన్ని వేళలా సాధ్యం కాదు. క్యాపిటలిస్టు దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మికులుగా స్త్రీల ప్రత్యేక డిమాండ్లను లేవనెత్తాలి. కొన్ని కీలకమైన, సుదీర్ఘ కాలం నుండీ ఉన్న సమస్యలు : సమాన పనికి సమాన వేతనాలు, ప్రసూతి శిశు సంరక్షణ సెలవు, క్రెచ్‌లు, విశ్రాంతి గదులు, జీతాల పెంపులో, ప్రమోషన్ అవకాశాలలో, శిక్షణలో సమానత్వం, పని ప్రదేశంలో శారీరక, లైంగిక భద్రత. ఈ డిమాండ్లను నిరాకరిస్తే స్త్రీల దోపిడీ మరింత పెరుగుతుంది, శ్రామికులలో మరింత మంది స్త్రీలు చేరకుండా అడ్డుపడుతుంది. దళిత స్త్రీలు మరింత దోపిడీకీ, అణచివేతకూ గురవుతారు. కుల అణచివేత, భావజాలాలూ ఈ అన్యాయానికి మరో కోణాన్ని జోడిస్తాయి. ఆదివాసీ, మైనారిటీ స్త్రీ కార్మికుల విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది.

స్త్రీ కార్మికుల అణచివేత పరిస్థితికి మరో కోణం కూడా – రెండు పనుల బరువు కూడా ఉంది. ఇంతకు ముందు చర్చించినట్లు, ఇంటి చాకిరీ, శిశు సంరక్షణ, రోగుల, వృద్ధుల సంరక్షణ – స్త్రీలుగా ఈ భారమంతా స్త్రీల మీదే పడుతుంది. ఇది వారి 'సహజ' బాధ్యతగా భావించడం జరుగుతుంది. ఆ విధంగా స్త్రీలు రెండు షిఫ్టుల పనులు చేస్తారు. తరచు ఈ రెండో బరువు కారణంగా స్త్రీలు ఉద్యోగాలను వదులుకోవలసి వస్తుంది, లేదా తక్కువ వేతనం లభించే, అనిశ్చితమైన పని చెయ్యాల్సి వస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, ఇంటి పని సమస్య స్త్రీ కార్మికుల సమస్య కూడా. ఇది ఒక వర్గ సమస్య. స్త్రీలను వర్గ నిర్మాణాలలోకీ, పోరాటాలలోకీ

తీసుకురావడానికి దీన్ని గుర్తించడం కీలకమైనది. కానీ, నైతికంగా కానీ, ఆర్థికంగా కానీ, లేదా గణాంకాల ద్వారా కానీ, కుటుంబం జీవించడానికీ, ఆర్థిక వ్యవస్థకూ ఈ శ్రమ వాటాను గుర్తించడం మాత్రమే సరిపోదు. ఈ బండచాకిరీ నుండి స్త్రీ విముక్తి చెందాలని ఏంగెల్స్, లెనిన్‌లు చెప్పినది మనం గుర్తుకు తెచ్చుకోవాలి. స్త్రీకీ, ఇంటిపనికీ ఒక సహజమైన సంబంధం ఉందనే భావనను బ్రద్దలు కొట్టడం మన లక్ష్యంగా ఉండాలి. స్త్రీ పురుషుల మధ్య ఈ పని పంపకం ద్వారా కానీ, లేదా క్యూబాలోనూ, ఇతర సోషలిస్టు దేశాలలోనూ చేస్తున్నట్లు పబ్లిక్ సౌకర్యాల ద్వారా కానీ, దీన్ని బ్రద్దలు కొట్టాలి.

**పౌరులుగా స్త్రీలు** : ఈ సమస్య పురుషులతో సమానంగా పౌరహక్కులు లేని స్త్రీలందరి పరిస్థితికి సంబంధించిన సమస్య. భారత దేశంలో అసమాన కుల వ్యవస్థ సమాన పౌరహక్కులు లేకుండా చేస్తోంది. అందువలన, సామాజిక హోదాలో ముఖ్యమైన తేడాలున్నా, దళిత, గిరిజన స్త్రీలు ఆర్థికంగానూ, సామాజికంగానూ స్త్రీలందరిలోనూ అత్యంత అణచివేతకు గురవుతున్న స్త్రీలు, హింస, లైంగిక హింస, మానభంగాలు, హత్యలకూ గురవుతున్న స్త్రీలు. మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన స్త్రీలు, ముఖ్యంగా ముస్లిం స్త్రీలు, లేమికీ, పెరుగుతున్న హింసకూ గురవుతున్నారు. అనేక రంగాలలో వారికి పౌర హక్కులను నిరాకరించడం జరుగుతోంది.

హిందుత్వ శక్తులూ, వారి మత, కుల, హింసా, విధానాలూ, జెండర్ ద్వారా, మతం ద్వారా, నివాస ప్రాంతం ద్వారా పౌరుల మధ్య తేడాలకు మతతత్వ సమర్థనలూ తలెత్తడంతో స్త్రీలు – ముఖ్యంగా దళిత, ఆదివాసీ స్త్రీలూ, మైనారిటీ స్త్రీలూ – అంతకంతకు అభద్రతకు గురవుతున్నారు. నయా ఉదారవాద విధానాలు, పరిణామాల కారణంగా ఉత్పన్నమవుతున్న ఆర్థిక అసమానతలు అంతకంతకు పెరుగుతున్నాయి. ఇవి పౌర హక్కులను నీరు కార్చడం మాత్రమే కాకుండా, పౌరులందరూ, ముఖ్యంగా స్త్రీలు, సమానులే అన్న భావాన్ని బలహీనపరిచే భావజాలాలకు మరింత ఆజ్యం పోస్తున్నాయి.

పౌరులుగా స్త్రీలతో ప్రత్యక్షంగా జెండర్ పద్ధతిలో వ్యవహరించడం జరుగుతోంది. జెండర్ పద్ధతిలో ప్రభుత్వ సంస్థలు అభివృద్ధికీ, సంక్షేమానికీ, మ్యాక్రో–ఆర్థిక వ్యూహాలకూ విధానాలనూ కార్యక్రమాలనూ తయారు చేస్తాయి. అదే కాకుండా, స్త్రీల రాజకీయ హక్కులనూ, పబ్లిక్ జీవితాన్నీ, న్యాయానికీ, ప్రజాస్వామ్య ప్రక్రియకూ వారి రోజువారీ అందుబాటునూ కూడా అవి ప్రభావితం చేస్తాయి. ప్రజా రాజకీయ

జీవితంలో ప్రవేశించడానికీ, విధానాలను తయారు చెయ్యడానికీ, నిర్ణయాలను తీసుకోవడానికీ స్త్రీల సామర్థ్యానికి సంబంధించినది ఇది.

స్త్రీలు పౌరులుగా తమ హక్కులను చాటుతున్నారు. తమ సమిష్టి పోరాటాల ద్వారా చట్టపరమైన నిర్మాణాల వెలుపల నుండి విధానాలకు గండి కొడుతున్నారు. ప్రజాప్రాతినిధ్య సంస్థలలో స్త్రీలకు మూడోవంతు రిజర్వేషను కోసం పోరాటం పౌరులుగా సమాన హక్కులను వాస్తవం చెయ్యడంలో ఒక భాగం. చట్టాల పరిధిలోనూ, ప్రభుత్వ చర్యలు, కార్యక్రమాలలోనూ మార్పును డిమాండు చేసే స్త్రీల శక్తిని ఇది ఇనుమడింప చేస్తుంది. పౌరుల సమాన హక్కులను తప్పుదోవ పట్టించే ఛాందసవాద, మతవాద, కులవాద శక్తులు మొదలైన వివిధ మితవాద మతవాద నిర్మాణాలకూ, ప్రక్రియలకూ వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వారి గొంతును మరింత శక్తివంతం చేస్తుంది.

పార్టీ నాయకత్వాన ఉన్న వివిధ ప్రభుత్వాల విజయాలనూ, కొనసాగుతున్న సవాళ్ళనూ మనం చూసినప్పుడు కొన్ని సంభావ్యతలు మనకు కనుపిస్తాయి. పశ్చిమ బెంగాల్‌లో వామపక్షం స్త్రీలకు మాత్రమే, లేదా భర్తతో ఉమ్మడిగా, భూమి పట్టాలను ఇచ్చింది. దీని అమలు మాత్రం నత్తనడకలో ఉంది. పశ్చిమ బెంగాల్, త్రిపురలలో, పంచాయతీ వ్యవస్థలో ఎన్నికైన ప్రతినిధులుగా స్త్రీల శాతం చట్టప్రకారం ఉండవలసిన కనీస 33 శాతం కంటే ఎక్కువ ఉంది. కేరళలో పంచాయతీ వ్యవస్థలోనూ, కుడుంబశ్రీ నెట్‌వర్క్ లోనూ ఉన్న స్త్రీలు, స్త్రీలకు ఒక కొత్త గొంతు ఇచ్చారు. ఆర్థిక వనరులు పొందడానికి కొత్త మార్గాన్ని తెరిచారు. కానీ ఈ రాష్ట్రాలన్నింటిలోనూ స్త్రీలు పనిలోనూ, గృహం లోనూ, పబ్లిక్ రంగంలోనూ వివక్షనూ, హింసనూ అనుభవిస్తున్నారు. పార్టీలో స్త్రీల సభ్యత్వాన్ని పెంచడం అవసరం.

**స్త్రీ సమస్య మీద నిర్మాణం**

మళ్ళీ 2005 కేంద్ర కమిటీ తీర్మానం నుండి ఉటంకింపు :

"స్త్రీలలో మన పనిని మెరుగుపరచడానికి మనం శ్రద్ధ చూపించవలసిన విషయాలు ముఖ్యంగా మూడు ఉన్నాయి. (1) స్త్రీల సమస్యల గురించి పార్టీ, ఇతర ప్రజా సంఘాలూ ప్రజలను కూడగట్టాలి. (2) పార్టీలోకి స్త్రీలను చేర్చడానికీ, వారి బాధ్యతలను పెంచడానికీ మరిన్ని ప్రయత్నాలు చెయ్యాలి. పార్టీ నాయకత్వాన ఉండే సంఘాలలో స్త్రీలను సమీకరించాలి. (3) స్త్రీల సమస్యల గురించి పార్టీలో ఉన్న తప్పుడు ధోరణులను నిర్మూలించాలి."

1, స్త్రీల సమస్యలను చేపట్టేటప్పుడు, వివిధ స్థాయిలలో, పార్టీ భిన్న సామాజిక

గ్రూపుల అవసరాలనూ, ఆకాంక్షలనూ గుర్తించగలగాలి. ఈ సామాజిక గ్రూపులలో స్త్రీలు ఒక పెద్ద విభాగంగా ఉంటారు. దీనికి అనేక కోణాలుంటాయి.

ఎ, పార్టీ ప్రధాన కృషి తన పునాది వర్గాలలో ఉండాలి. కార్మిక వర్గ స్త్రీలు, మహిళా వ్యవసాయ కూలీలతో సహా పునాది వర్గాలను వ్యవస్థీకృతం చెయ్యడానికి పార్టీ ప్రాధాన్యతనివ్వాలి. ఈ విభాగాల స్త్రీల సమస్యలను చేపడుతున్నప్పుడు, పార్టీ, పార్టీ నాయకత్వం క్రింద ఉన్న ప్రజా సంస్థలూ జెండర్ అణచివేతకు సంబంధించిన సమస్యలను గుర్తించి, ఆ సమస్యల పట్ల శ్రద్ధ వహించడం అవసరం. మరో మాటలో చెప్పాలంటే, ఈ స్త్రీ విభాగం ఎదుర్కొనే రెండు భారాల నుండి ఉత్పన్నమయ్యే సమస్యలన్నింటి పట్లా శ్రద్ధ వహించడం అవసరం. ఇవన్నీ కూడ వర్గానికి సంబంధించిన సమస్యలే.

బి, పార్టీ యూనిట్లూ, ప్రజా సంఘాల సభ్యులు స్త్రీలలో వివిధ విభాగాలు ఎదుర్కొంటున్న సామాజిక అణచివేత సమస్యలను కూడా చేపట్టాలి. అటువంటి పోరాటాలలో చేరినప్పుడు, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పార్టీ యూనిట్లు చొరవ తీసుకుని ముందుండి ఉద్యమాలను నడిపించాలి. ఉదాహరణకు, దళిత లేదా ముస్లిం స్త్రీల పోరాటాలు.

సి, కుటుంబ రంగంలో గృహ హింస, వివక్ష సమస్యలను పార్టీ చేపట్టాలి. ఈ సమస్యలను మధ్య తరగతి లేదా ఉన్నత తరగతి స్త్రీల సమస్యలుగా భావించీ, లేదా కార్మిక ప్రజలలో ఈ సమస్యలను చేపట్టినప్పుడు అది కార్మిక వర్గ ఐక్యతకు భంగకరం అని భావించి పక్కన పెట్టరాదు. మనం నిర్మూలించవలసిన తప్పుడు ధోరణులలో ఇది ఒకటి. స్త్రీల సమస్యలను చేపట్టనట్లయితే, కార్మికుల, పార్టీ పోరాటాలను స్త్రీలు తమ పోరాటాలుగా చూడరు. ఇది కార్మిక వర్గ ఐక్యతను బలహీనపరుస్తుంది.

అటువంటి స్త్రీ వ్యతిరేక చర్యలను అంగీకరించకూడదనే ఒక ప్రత్యేక బాధ్యత పార్టీ సభ్యులందరి మీదా ఉందని దీనర్థం. అటువంటి అభిప్రాయాలను పార్టీ సభ్యులు ఖండించాలి. తమలో ఉన్న పితృస్వామ్య భావాలకూ, తమ జీవితాలలోనూ, కుటుంబాలలోనూ ఉన్న ఆచరణలకూ వ్యతిరేకంగా పోరాడాలి. దిద్దుబాటుకు ప్రతీ స్థాయిలోనూ కృషి అవసరమవుతుంది.

వర్గానికీ, సమాజానికీ, లేదా సంస్థకూ చెందినా, ఈ సమస్యలన్నీ మహిళా సంఘాలు మాత్రమే కాకుండా అన్ని ప్రజా సంఘాలూ చేపట్టవలసిన సమస్యలే. ఉదాహరణకు, పని ప్రదేశంలో కానీ, లేదా విద్యా సంస్థలో కానీ లైంగిక వేధింపుల మీద చర్యలూ, ఉద్యమాలూ ట్రేడ్ యూనియన్ల, స్త్రీల సంఘాల, విద్యార్థి సంఘాల బాధ్యతే. సమాన పనికి సమాన వేతనాలు వ్యవసాయ కార్మిక సంఘం, ట్రేడ్ యూనియన్, మహిళా సంఘాల బాధ్యత. వివిధ ప్రజా సంఘాల మధ్యా, సంబంధిత పార్టీ శాఖ / ఫ్రాక్షన్ తోనూ, చర్చలూ, సమన్వయమూ ఉండాలి. అన్ని ప్రజా సంఘాలలోనూ స్త్రీల సభ్యత్వ సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. స్త్రీ సభ్యత్వం అధికంగా ఉన్న సంస్థలు జెండర్ సమస్యలను చేపట్టాలి, తమ వర్గ దృష్టికోణాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. దీనర్థం మధ్యతరగతికి చెందిన స్త్రీల సమస్యలను చేపట్టకూడదని కాదు. కానీ ఇవి మాత్రమే సమస్యలుగా చూడకూడదు. భిన్న సంబంధాలు, ధోరణులు, సమస్యలూ పునాది వర్గాల స్త్రీలనూ, వివిధ విభాగాలనూ భిన్న పద్ధతులలో ఎలా ప్రభావితం చేస్తున్నాయో చూడాలి. ముఖ్యంగా వర్గ నిర్మాణాలూ, దోపిడీ జెండర్, సామాజిక అణచివేతలను ఎలా సుస్థిరం చేస్తున్నాయో మనం నిరంతరం దృష్టిలో ఉంచుకోవాలి.

ఒక ఉదాహరణ అంగన్‌వాడీ వర్కర్లు, గృహ కార్మికులు, ఉపాధి హామీ పథక కార్మికుల సమస్యల గురించి పోరాడడానికి స్త్రీల సంస్థలూ, ట్రేడ్ యూనియన్లూ, వ్యవసాయ కార్మిక సంఘాలు కలవడం. స్త్రీలు స్త్రీలుగా, కార్మికులుగా, పౌరులుగా ఎదుర్కొంటున్న సమస్యలన్నీ ఇందులో ఉన్నాయి.

2, పోరాటాలలో స్త్రీల సమస్యలను చేపట్టడం స్త్రీలను పార్టీలోకీ, ప్రజా సంఘాలలోకీ ఆకర్షించడానికి కీలకమైనది. మహిళా, విద్యార్థి సంఘాల నుండి పార్టీలోకి చేరుతున్నా, అక్కడ నుండి మాత్రమే కాకుండా ఇతర ప్రజా సంఘాలనుండి మరింతమంది స్త్రీలను పార్టీలోకి చేర్చుకోవాలి. ఇటీవల కిసాన్, ట్రేడ్ యూనియన్ రంగాలనుండి స్త్రీల రాక పెంపొందడం నుండి మనం నేర్చుకోవచ్చు.

ప్రజా సంఘాల నుండి స్త్రీలను పార్టీలోకి చేర్చుకోవడానికి ప్రణాళికబద్ధమైన ప్రయత్నాలు చెయ్యాలి. శాఖలు, ఫ్రాక్షన్లు ఇది దానంతట అదే జరుగుతుందని భావించి వేచి ఉండకూడదు. స్త్రీలకు, ముఖ్యంగా అణచివేతకు గురవుతున్న

కులాల నుండీ, మైనారిటీల నుండీ, శ్రామికుల నుండీ వచ్చే స్త్రీలకు, ప్రత్యేకంగా ఉండే ఇబ్బందులూ, ఆత్మవిశ్వాసం లేకపోవడం లాంటివి గ్రహించి వారిని పార్టీలోకి తీసుకు రావడానికి ప్రత్యేకంగా కృషి చెయ్యాలి. వారు ఆగ్జిలరీలు, క్యాండిడేట్ సభ్యులు, లేదా పూర్తి స్థాయి పార్టీ సభ్యులు అయిన తర్వాత, సంస్థాగత కార్యకలాపాలను నిర్వహించేటప్పుడూ, పోరాటాలలో బాధ్యతలను అప్పచెప్పేటప్పుడూ, ప్రస్తుత సామాజిక సందర్భంలో స్త్రీలుగా వారు ఎదుర్కొనే ప్రత్యేక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలి.

పార్టీని పైనుండి నిర్మించాలి అని మనం అంటున్నప్పుడు, స్త్రీలనూ, అంచులకు నెట్టివేయబడిన విభాగాలనూ పార్టీ నాయకత్వంలోకి తీసుకు రావడమూ, వారికి బోధించడమూ, వారి సైద్ధాంతిక, సంస్థాగత, రాజకీయ అవగాహననూ, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడమూ పార్టీ నాయకత్వం యొక్క బాధ్యత. స్త్రీలను నాయకులుగా అభివృద్ధి చెయ్యడం ముఖ్యం. కొత్తగా చేరిన సభ్యులకు పార్టీ పనిని అప్పచెప్పినప్పుడు వారికి సహాయమూ, సలహాలూ కామ్రేడ్లీ తరహాలో ఇవ్వాలి. మగ కామ్రేడ్స్ ఊహించని, లేదా మొదట తప్పుగా భావించే భావాలూ, ఆలోచనా ధోరణులతో స్త్రీ కామ్రేడ్లూ, కొత్త సభ్యులూ తమ తమ భావాలతో, ఆలోచనా విధానంతో, వ్యక్తీకరణతో రావచ్చు. వీటిని జాగ్రత్తగా చర్చించాలి. బహుశా స్థానికంగా పని చేస్తున్న తీరులో మార్పులకు ఇది దారి తీయవచ్చు. క్లాసుల ద్వారా, బాధ్యతలను అప్పగించడం ద్వారా, చర్చ ద్వారా, సమన్వయం ద్వారా, కామ్రేడ్లీ తరహా సలహాల ద్వారా, **పరస్పరం నేర్చుకోవడం** ద్వారా కామ్రేడ్స్ అభివృద్ధి చెందుతారు.

ప్రస్తుత సందర్భంలో స్త్రీల జీవితాల ప్రత్యేకతలనూ, శాఖ పనినీ పరిగణనలోకి తీసుకుంటూ రాజకీయ-సైద్ధాంతిక బోధన, బాధ్యతలను అప్పగించడం, కమిటీలలో చేర్చుకోవడమూ పట్ల శ్రద్ధ చూపించాలి.

3, పైన చెప్పినవన్నీ పార్టీలోని తప్పుడు ధోరణులను అధిగమించడానికి ఉపయోగపడినా, కొన్ని తప్పుడు ధోరణులు తక్షణమే రాజకీయంగా కనిపించని కారణంగా వాటిని అధిగమించడం జరగదు. పురుషులు పార్టీలో క్రియాశీలంగా ఉన్నారు కనుక తమ కుటుంబాలలోని స్త్రీలను ఇంటికే పరిమితం చెయ్యకుండా చూడాల్సిన ప్రత్యేక బాధ్యత పురుష కామ్రేడ్స్‌కు ఉంది. లేదా కుటుంబంలోని స్త్రీలను పార్టీలో చేరమని ఒత్తిడి కూడా

చెయ్యకూడదు. శ్రమ యొక్క రాజకీయ విభజన, స్త్రీలు అన్ని ఇంటి బాధ్యతలను స్వీకరిస్తూ, మగ కామ్రేడ్స్ పబ్లిక్ జీవితంలో క్రియాశీలంగా ఉండే గృహ, సామాజిక శ్రమ విభజన సమస్య వంటిది కాకూడదు.

పార్టీ జనతా ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలనుకుంటే, పార్టీ సభ్యులు జెండర్ సమస్య గురించి ప్రజలను కూడగట్టాలి, స్త్రీలను పార్టీలోకి తీసుకోవాలి, ఆత్మ విశ్వాసం గల నాయకులుగా శిక్షణ ఇవ్వాలి. ఇది చెయ్యాలంటే, స్త్రీ పురుషులతో సహా సభ్యులందరూ స్త్రీల అణచివేత గురించి మార్క్సిస్టు-లెనినిస్టు అవగాహనతో, స్థల కాల నిర్దిష్ట సందర్భంలో మనం ఎదుర్కోవలసిన సమస్యల గురించి అవగాహనతో, దీన్ని మన దైనందిన జీవితాల్లోనూ, పనిలోనూ ఒక భాగంగా చేసుకుని, పార్టీకున్న ప్రస్తుత సరిహద్దులను దాటడానికి కదలాలి.

***


ప్రతులు : 1000

ప్రచురణ కాలం : డిసెంబర్, 2023

వెల : ₹ . 30 /-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ -520 002,

ఫోన్ నెం. 0866 2577202, 9490098000

*web : www.cpimap.org*